ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

కడప

నేటి మీ కపిల్‌చిట్స్ తో సభ్యత్వం ఓ మంచి ఆర్థిక నేస్తంతో బంధుత్వం
KAPIL GROUP కపిల్ చిట్స్ Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం
: fb.com/vaartha Digital

Published from Kadapa, Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

1-12-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 300 పేజీలు: 10+4 వెల: 6.50



# దూసుకొస్తున్న 'దిత్వా'

### నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
### చెన్నైకి దక్షిణాన 300 కి.మీ దూరంలో తుఫాన్ కేంద్రీకృతం
### గంటకు 70 కి.మీ. వేగంతో ఈదురుగాలులకు అవకాశం

**విజయవాడ,నవంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** దిత్వా తుఫాన్ నైరుతి బంగాళాఖాతం, ఉత్తర శ్రీలంక ప్రాంతాల్లో ఉత్తర వాయువ్య దిశగా కదులుతోంది. పుదుచ్చేరికి దక్షిణఆగ్నేయంగా 220 కిలోమీటర్లు, చెన్నైకు దక్షిణాన 300 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది. గడిచిన 6 గంటల్లో గంటకు 10 కి.మీ వేగంతో ఉత్తరం వైపు కదులుతోంది. ఇది ఉత్తర వాయువ్య దిశగా పయనిస్తూ ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తా తీరాలకు సమీపంలో నైరుతి బంగాళాఖాతం ప్రాంతానికి విస్తరించే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

దిత్వా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ సూచనలను అధికారులు వెల్లడించారు. ఉత్తర కోస్తాలో పలుచోట్ల రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా జల్లులు కురిసే అవకాశముంది. దక్షిణ కోస్తాలో అనేకచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముంది. ఒకటి లేదా రెండుచోట్ల భారీ నుంచి అతి భారీవర్షాలు కురిసే అవకాశముంది. గంటకు 60-70 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయొచ్చని అధికారులు తెలిపారు రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముంది. భారీ నుంచి అతి భారీవర్షాలు ఒకటి లేదా రెండుచోట్ల కురిసే అవకాశముందని >>2



## అమరావతిలో భూగర్భ విద్యుత్ లైన్లు

### ప్రపంచస్థాయి ప్రమాణాలతో నిర్మాణం: మంత్రి లోకేష్

**విజయవాడ, నవంబరు 30, ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి రాజధాని అమరావతి ప్రతి అంశంలోను ఆధునాతన పద్ధతుల ప్రవేశ పెడుతున్నామని మానవ వనరులు శాఖా మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఈ క్రమంలో పవర్ సప్లయిరంగంలో పలు మార్పులు, సంస్కరణలు చేపట్టామన్నారు. ప్రపంచ స్థాయి అండర్ గ్రౌండ్ పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి లోకేష్ ఎక్స్ వేదికగా తెలిపారు. అండర్ గ్రౌండ్ పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వేగంగా రూపుదిద్దుకుంటోందని >>2

### తమిళనాట తుఫాన్ ఎఫెక్ట్..

## విమాన సర్వీసులు, విద్యా సంస్థలు బంద్

**చెన్నై, నవంబరు 30:** దిత్వా తుఫాను ప్రభావంతో తమిళనాడులోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాల కారణంగా పలు విమానసర్వీసులను రద్దుచేశారు. ఇండిగో, ఎయిరిండియాసంస్థలు ఇప్పటికే ప్రయాణికులకు సూచనలు జారీచేశాయి. ప్రభుత్వం రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించింది. భారీ వర్షాల నేపథ్యంలో వివిధ జిల్లాలకు నడిచే 54 విమాన సర్వీసులను రద్దు చేసినట్లు చెన్నై విమానాశ్రయ అధికారులు వెల్లడించారు. విమానాశ్రయానికి బయలుదేరే ముందు విమాన సర్వీసు స్టేటస్‌ను పరిశీలించుకోవాలని ఎయిరిండియా, ఇండిగో సూచించాయి. భారీవర్షాలు, ఈదురు గాలుల కారణంగా చెన్నైతో సహా దక్షిణాది నగరాల నుంచి రాకపోకలు సాగించే సర్వీసులపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆయా సంస్థలు పేర్కొన్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే కూడా అప్రమత్తమైంది. దిత్వా ప్రభావం అటు ఆంధ్రప్రదేశ్; >>2



### రెండు బస్సులు ఢీ:

## 12 మంది మృతి

### 40 మందికి తీవ్ర గాయాలు

### శివగంగలో దుర్ఘటన


**శివగంగ(తమిళనాడు),నవంబరు 30:** తమిళనాడులో ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శివగంగ జిల్లాలోని తిరుపత్తూర్ సమీపంలో రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో ఒక చిన్నారితో సహా 11 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. 40 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఒక బస్సు తిరుప్పూర్ నుంచి కారైకుడి వస్తుండగా మరో బస్సు >>2

## నకిలీ మద్యం కేసు: కీలక నిందితుడు తలారి రంగయ్య అరెస్టు

**విజయవాడ, నవంబరు 30,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో గత కొన్ని నెలలుగా సంచలనం సృష్టిస్తున్న నకిలీ మద్యం కేసులో మరో కీలక అరెస్టు జరిగింది. నకిలీ బ్రాండెడ్ మద్యం బాటిళ్లకు ఒరిజినల్ లాగా లేబుల్స్ సరఫరాచేసిన ఎ14నిందితుడు తలారి రంగయ్యను ఎక్సైజ్ శాఖ సిఐడి అధికారులు ఇవాళ అరెస్టు చేశారు. అరెస్ట్‌కు ముందు ముందస్తు బెయిల్ కోసం రంగయ్య ఎపి హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ వ్యవహారాన్ని కింది కోర్టులోనే తేల్చుకోవాలంటూ హైకోర్టు ఆ పిటీషన్‌ను కొట్టివేసింది. తర్వాత విజయవాడలోని 6వ అదనపు మేజిస్ట్రేట్ కోర్టులో కూడా ఆయన బెయిల్ పిటీషన్ రిజెక్ట్ అయింది. దాంతో ఎట్టకేలకు నేడు ఎక్సైజ్ అధికారులు రంగయ్యను అదుపులోకి తీసుకున్నారు. నకిలీ మద్యం తయారీ చైన్‌లో రంగయ్యదే కీలకపాత్ర అని పోలీసులు ఆరోపిస్తు >>2

# బాధ్యత మరిస్తే చర్యలే

### పార్టీ అవసరం తమకు లేదనుకొంటే బయటకు వెళ్లొచ్చు
### కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులకు సిఎం చంద్రబాబు హెచ్చరిక
### తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడిపై ఆగ్రహం
### మంత్రి సంధ్యారాణి పిఎ విషయంలోనూ సిఎం సీరియస్
### నేటి నుంచి టిడిపి కార్యాలయంలో కేడర్‌కు శిక్షణ తరగతులు



**విజయవాడ,నవంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** శాసనసభ్యులైన,మంత్రులైన బాధ్యతను విస్మరించి ప్రవర్తిస్తే వారి వ్యవహారంలో చాలా కఠినంగా వ్యవహరించడానికి వెనుకాడనని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.ఎవ్వరు ఎలా ప్రవర్తిస్తున్నారో తాను నేరుగా తెలుసుకుంటున్నానని, తనను తప్పు చేసి మోసగించలేరని మండిపడ్డారు. మహిళల గౌరవానికి భంగం కలిగించినా, వేధింపులకుపాల్పడినా సహించేదనిలేదని కఠినంగా ఉంటామని సిఎం చంద్రబాబు హెచ్చరించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు అప్రమత్తంగా ఉంటూ కుటుంబ సభ్యులు, వారి దగ్గర పనిచేసే వారు ఎలాంటి తప్పులూ చేయకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో అందుబాటులో ఉన్న కొందరు నాయకులు, పార్టీ కార్యాలయ సిబ్బందితో సిఎం చంద్రబాబు వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. మంత్రిదగ్గర పనిచేస్తున్న వ్యక్తిపై ఆరోపణలు వచ్చి, అంత ట్రోలింగ్ జరుగుతున్నప్పుడు వెంటనే తొలగించాలని స్పష్టంచేశారు. తప్పుడు ఆరోపణలైతే నిజం తేలే వరకు పక్కన పెట్టాల్సిందేనని అన్నారు. ఎంతటి వారైనా మహిళల విషయంలో ప్రవర్తన సరిగ్గా లేకపోతే ఊరుకోబోమని తేల్చి చెప్పారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అనధికారిక పిఎ సతీష్ ఒక మహిళను వేధించినట్టు ఆరోపణలపై వెంటనే తొలగించకుండా తాత్సారం చేయడం సబబు కాదని సిఎం అభిప్రాయపడినట్లు తెలిసింది. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుని ఎన్నిసార్లు హెచ్చరించినా ఆయన వ్యవహారశైలిలో మార్పు రాకపోవడంపై సిఎం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. తనను గెలిపించింది ప్రజలేనంటూ ఇటీవల మళ్లీ ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంపై సిఎం మండిపడినట్లు తెలిసింది. వ్యక్తిగతంగా బలవంతులమని, పార్టీ అవసరం తమకు లేదని భావించినవారు బయటకు వెళ్లి బల నిరూపణ చేసుకోవచ్చునని హితవు పలికారు. పార్టీతో అవసరం లేదనుకున్నప్పుడు సొంతగా పోటీ చేసి గెలవాల్సిందని వ్యాఖ్యానించారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినా, పార్టీకి అతీతులమన్నట్టు ఎవరు వ్యవహరించినా సహించేది లేదని స్పష్టంచేశారు. కొలికపూడిని పిలిపించి మాట్లాడతానని సీఎం అన్నట్లు సమాచారం.

డిసెంబరు ఒకటి నుంచి పార్టీ కార్యాలయంలో నిర్వహించే శిక్షణ తరగతుల ద్వారా కొత్త తరం నాయకుల్ని తయారు చేయాలని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. శిక్షణ తీసుకున్న వారిలో 10 శాతం మందైనా స్వశక్తితో ఎదిగేలా ఉండాలని సూచించారు. సమస్య వచ్చినప్పుడు చర్చించటం కాకుండా అసలు తలెత్తకుండా వ్యూహరచన ఉండాలని తేల్చిచెప్పారు. ప్రత్యర్థుల ఎత్తుగడల్ని ముందే పసిగట్టేలా ఉండాలని ఆకాంక్షించారు. సోమ, మంగళవారాల్లో 100మంది పార్టీ మండలాధ్యక్షులకు శిక్షణ ఇస్తారని చెప్పారు. కుప్పం, మంగళగిరి, వినుకొండ, పాల >>2

### 2027 జూన్ 26 నుంచి

## గోదావరి పుష్కరాలు

### ఆగమ, వైదిక పండితుల ఏకాభిప్రాయం

**విజయవాడ, నవంబరు 30, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో గోదావరి పుష్కరాలను 2027 జూన్ 26 నుంచి జులై 7వరకు నిర్వహించాలని ఆగమ, వైదిక పండితులు సూచించారు. ఈ మేరకు తేదీలతో కూడిన నివేదికను దేవాదాయ శాఖ ప్రభుత్వానికి పంపింది. ఈ నివేదికను అనుసరించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశాలున్నాయి. గోదావరి పుష్కరాలను ఏయే తేదీల్లో నిర్వహించాలనే దానిపై ఇటీవలన దేవాదాయ శాఖ అధికారులు సమావేశం నిర్వహించారు. తూర్పు గోదావరి,పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు జిల్లాలకు చెందిన ఆగమ,వైదిక పండితులు టిటిడి ఆస్థాన సిద్ధాంతితో కలిసి మొత్తం 18 మంది పాల్గొన్న సమావేశంలో పుష్కరాల తేదీలపై ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి పంపారు. దీనిపై ప్రభుత్వం అధికారికంగా >>2



ఆదివారం న్యూఢిల్లీలో అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్. చిత్రంలో జెపి నడ్డా, రిజుజు తదితరులు

## సర్, ఢిల్లీ పేలుడుపై వాడి, వేడి చర్చలు!

### నేటినుంచి పార్లమెంటు
### సభ సజావుగా సాగడానికి సహకరించాలని విపక్షాలకు ప్రభుత్వం వినతి
### రాజ్‌నాథ్ అధ్యక్షతన అఖిలపక్ష భేటీ

**న్యూఢిల్లీ, నవంబరు 30:** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 19 వరకు అంటే 15 రోజుల పాటు సమావేశాలుజరుగనున్నాయి. సాధారణంగా జరిగే 20 సమావేశాలకంటే ఈ సంఖ్య గణనీయంగా తగ్గింది. దీనిపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. శీతాకాల సమావేశాలు వాడీవేడిగా సాగడం ఖాయంగా కనిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వం మొత్తం 14 బిల్లులు ప్రవేశపెట్టేందుకు సిద్ధంకాగా, ఓటరుజాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై నిలదీస్తామని విపక్షాలు ప్రకటించాయి. ఢిల్లీ పేలుడు నేపథ్యంలో జాతీయ భద్రత, రైతు సమస్యలను ప్రస్తావిస్తామని స్పష్టం చేశాయి. బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, ఇవిఎంలు, ఎస్ఐఆర్, మావోయిస్టులపై కేంద్రం అనుసరిస్తున్న వైఖరి తదితరఅంశాలను లక్ష్యం చేసుకుని అధికార పక్షాన్ని ఇరుకున పెట్టేందుకు ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలు అస్త్రశ >>2

# 104 కోట్ల ధాన్యం కొనుగోలు



ఆదివారం అత్తోట, శివలూరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల

### ధాన్యం ఎగుమతికి తెనాలిలో గూడ్స్ రైలు ఏర్పాటు
### దళారులను నమ్మి మోసపోకండి
### రైతులతో మాట్లాడిన మంత్రి నాదెండ్ల

**కొల్లిపర (గుంటూరు జిల్లా), నవంబరు 30, ప్రభాతవార్త:** గత ఖరీఫ్ సీజనులో రూ.104 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు.ఆదివారం మండలంలోని అత్తోట, శివలూరు ప్రాంతాలలో మంత్రి పర్యటించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. గోనెసంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివలూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మనోహర్ మాట్లాడుతూ గత సంవత్సరం 44 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు.గత వైసీపి ప్రభుత్వంలో కేవలం 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారని రూ.10 కోట్లు మాత్రమే రైతులకు చెల్లించారని ఆయన గుర్తు చేశారు.రైతులు అకాల వర్షాల వలన ఇబ్బంది పడి దళారులకు ధాన్యం విక్రయించి ఆర్థికంగా మోసపోవద్దని చెప్పారు.

ప్రభుత్వ భరోసాను నిండు మనసుతో స్వీకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.పతి రైతును తప్పనిసరిగా ఎంత ఆలస్యమైనా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఆదుకుంటామని ఆయన ప్రకటించారు. ఖచ్చితంగా 1792 ధరకే ధాన్యం కొనుగోలు చేస్తామని కేవలం ఐదారు గంటలలోనే రైతుల బ్యాంకు ఖాతాకు జమచేస్తామని ఆయన తెలిపారు.ప్రస్తుత ఖరీఫ్ సీజనుకు సంబంధించి రాష్ట్రంలో ఇప్పటి వరకు 11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలియజేశారు.రైతుల ఖాతాలలో రూ.2600 కోట్లు జమ చేయటం జరిగిందన్నారు. క్షత్ర స్థాయిలో అందరం పర్యటిస్తూ రైతులకు సమస్యలు లేకుండా చేస్తున్నామన్నారు. తక్కువ ధనకు ధాన్యాన్ని విక్రయిస్తూ దళారులను ప్రోత్సహించరాదని రైతులను ఆయన కోరారు. రెండు మూడు రోజులలో 21 వ్యాగిన్లతో ఓ గూడ్స్ రైలును తెనాలిలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 1800 లారీల సరుకు వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆదివారం ఉదయం నుంచి తెనాలి ప్రాంతంలో 85 లారీల ధాన్యాన్ని సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఎగుమతి చేసేందుకు >>2

# పరకామణి కేసు నివేదిక రెడీ



### నేడు హైకోర్టుకు సమర్పించనున్న సిఐడి
### జడ్జి ఆదేశాలపై అందరిలో ఉత్కంఠ

**తిరుపతి,నవంబరు 30ప్రభాతవార్తప్రతినిధి:** వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి భక్తులు కానుకలుగా సమర్పించిన వాటిని చోరీచేసిన కేసులో సమగ్ర దర్యాప్తు చేపట్టిన సిఐడి అధికారులు ఆ నివేదికలను మంగళవారం(రేపు)హైకోర్టుకు సమర్పించనున్నారు. నవంబరు 6వతేదీ నుండి పలు కోణాల్లో ,పలువురిని విచారణ చేసి రాబట్టిన ఆధారాలు, వివరాలను రికార్డుచేసిన సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ బృందం నివేదికలను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ముందు ఉంచనున్నారు. తదుపరి న్యాయమూర్తి ఎలాంటి ఆదేశాలిస్తారనేది అందరిలోనూ ఉత్కంఠతగా మారింది. 2023 ఏప్రిల్‌లో జరిగిన తిరుమల పరకామణిలో 920 అమెరికన్ డాలర్ల దొంగతనం, ఆ తరువాత విజిలెన్స్ అధికారులు పట్టుకోవడం, తిరుమల వన్‌టౌన్ పోలీసులకు అప్పగించడం జరిగింది. దీనిపై తదుపరి సమగ్రంగా చట్టప్రకారం నిందితుడు సివి రవికుమార్‌పై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు, అప్పటి టిటిడి పెద్దలు నిర్లక్ష్యంగా వ్యవహరించి, లోక్‌అదాలత్ ద్వారా రాజీకుదుర్చుకున్నారు. ఈ వ్యవహారంలో నిందితుడు నుండి 14కోట్ల రూపాయలు విలువైన ఆస్తులు శ్రీవారికికానుకగా టిటిడి పెద్దలు రాయించుకోవడం పెద్ద వివాదాంశంగామారింది. 2023-24లో వైఎస్సార్సీ ప్రభుత్వం, >>2

## మారుతున్న రాష్ట్ర రూపురేఖలు

### - మంత్రి నారాయణ

**నెల్లూరు, నవంబర్ 30, ప్రభాతవార్త (వైద్యం):** ప్రజా ఆదరణతో కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే సీఎం చంద్రబాబు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టమని ఆదేశించినట్లు రాష్ట్ర అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు.. ఈ సందర్భంగా ఆయన నెల్లూరులో సుడిగాలి పర్యటన చేపట్టారు.. దిత్వ తుఫాన్ హెచ్చరికలు ఉన్నప్పటికీ మంత్రి నారాయణ పలు ప్రాంతాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు.. వర్షాలు వల్ల ఎలాంటి ఇబ్బందులు వచ్చినప్పటికీ టిడిపి నేతలు దృష్టికి తీసుకుని వస్తే తక్షణమే సాయం అందజేస్తామని మంత్రి భరోసా కల్పించారు. అందులో భాగంగా ముందుగా 13వ డివిజన్ ప్రణతి అపార్ట్మెంట్‌వద్ద సైడ్ కాలువలను పరిశీలిం >>2



ఆదివారం కురుక్షేత్రలోని భద్రకాళి శక్తిపీఠ్ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపిన ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

# ధాన్యం కొనుగోలు

>> చర్యలు తీసుకున్నామని మంత్రి మనోహర్ తెలిపారు.ఇంత భారీ స్థాయిలో ఇబ్బంది ఎందుకు వస్తుందంటే 90 రోజుల పాటు జరగాల్సిన ప్రక్రియను కేవలం వారం రోజుల వ్యవధిలోనే పూర్తిచేయాలని భావించటమే ప్రధాన కారణమన్నారు. క్షేత్రస్థాయిలో గోనె సంచులను ఉచితంగా పంపిణీ చేయిస్తున్నామన్నారు. హమాలీలు,కూలీల సమస్య ఉందని సోమవారం ఆ సమస్య తీరుతుందని మంత్రి చెప్పారు. రైస్ మిల్లుల ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్ రైతులకు అండగా నిలవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమం త్రి పవన్ కల్యాణ్ సూచనల మేరకు క్షేత్రస్థాయిలో రెవెన్యూ శాఖ,వ్యవసాయ శాఖ,పౌర సరఫరాల శాఖ అనుసంధానంతో ప్రగతి సాధిస్తున్నామని మంత్రి మనోహర్ వివరించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గుమ్మడి సిద్ధార్థ, మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, ఎంపిటిసి హరికృష్ణ,అత్తోట ఉప సర్పంచ్ దివ్వెల ఏడుకొండలు,నాయకులు అడపా నారాయణరెడ్డి,వై.వెంకయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం దిత్వా తుఫాన్పై సమీక్ష జరుపుతున్న హోంమంత్రి అనిత

# బాధ్యత మరిస్తే చర్యలే

>> కొల్లు, గజపతినగరం నియోజకవర్గాల్లో అమలవుతున్న క్యాడర్ ఎంపవర్మెంట్ విధానం అన్ని నియోజక వర్గాల్లో అమలు కావాలని అన్నారు. తాను, లోకేశ్ ఒకటికి రెండుసార్లు చెప్పడంతో నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు గ్రీవెన్స్ డేలు నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడం, పార్టీ కేడర్తో సమావేశాలు పెట్టడం గతంతో పోలిస్తే పెరిగిందని సీఎం తెలిపారు. గతంలో ఇది 58 శాతం ఉంటే, ఇప్పుడు మరో 5 శాతం పెరిగిందన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారం వేగవంతం చేయాలని, ఎమ్మెల్యేల స్థాయిలో పరిష్కారం కానివాటిని పైకి పంపాలని ఆయన స్పష్టంచేశారు. పార్టీ నిర్దేశించిన కేలండర్ ప్రకారం గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తల సమావేశాలు జరగాలని స్పష్టంచేశారు. ప్రజలు, కార్యకర్తల అవసరాలు, ఆకాంక్షలు రోజు రోజుకీ పెరుగుతున్నాయని, నాయకులు వాటికి తగ్గట్టుగా పనిచేయాలని తెలిపారు. కల్తీనెయ్యి, పరకామణిలో చోరీ వ్యవహారంలో కోర్టు ఆదేశాలతో దర్యాప్తు జరుగుతోందన్నారు. అసలేం జరిగిందో మొత్తం ఆధారాలతో ప్రజలకు వివరించాలని సీఎం సూచించారు.

**వినూత్న ఆలోచనలతో ముందుకు:**

ఇంటికో ఎంటర్ప్రెన్యూర్ని తయారు చేయాలన్న లక్ష్యంలో వివిధ నియోజక వర్గాల్లో 100 మందిని ఎంపిక చేసి, పైలట్ ప్రాజెక్టుగా కార్యక్రమం చేపట్టాలని సీఎం ఆదేశించారు. కొందరు మంత్రులు, ఎమ్మెల్యేల్లోని 20 మంది పారిశ్రా మిక, వ్యాపార వేత్తలతో ఆయన ఆన్లైన్ వేదికగా మాట్లాడారు. పార్టీ అవసరం లేదనుకుంటే బయటకు వెళ్లి నిరూపించుకోవచ్చని ఎమ్మెల్యే కొలికపూడి వ్యవహారంపై సిఎం మండిపడినట్లు తెలిసింది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్టీ శిక్షణ తరగతులు 2029 ఎన్నికల అజెండాగా జరగాలని సీఎం స్పష్టం చేశారు. మంత్రి బిసి జనార్దన్రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సహా పలువురు పాల్గొన్నారు. తాను బ్యాంక్ నుంచి రుణాలు ఇప్పించి నలుగురికి టిప్పర్లు కొనిచ్చానని, మొత్తం 40 మందికి ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నానని మంత్రి జనార్దన్రెడ్డి తెలిపారు. ఆయనను సీఎం అభినందించారు. వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని నేతలకు సూచించారు.

పోలవరం లాంటి ప్రాజెక్టులు పూర్తైతే సాగునీటి లభ్యత పెరిగి సాగు విస్తీర్ణం పెరిగుతుందన్నారు. పంటలకు మార్కెటింగ్ సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకో వాలన్నారు. పార్టీ రాష్ట్ర, జిల్లా కమిటీల జాబితాలు సిద్ధంగా ఉన్నాయని, వివిధ సామాజిక సమీకరణాల్ని బేరీజు వేసుకుని డిసెంబరు 16 నాటికి తుది జాబితాలు సిద్ధం చేస్తామని సీఎంతో సమావేశం అనంతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. 17న లోకేశ్ వాటిపై సమీక్షిస్తారని, ఆ తర్వాత జాబితాల్ని ప్రకటిస్తామని తెలిపారు.

**తుఫాన్ సహాయక చర్యలు పకడ్బందిగా తీసుకోండి**

దిత్వా తుపాను దృష్ట్యా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, హోం మంత్రి అనిత, మంత్రి గొట్టిపాటి రవి అధికారులను ఆదేశించారు. తుపాను వల్ల నష్టం జరగకుండా ప్రణాళిక ప్రకారం జాగ్రత్తలు తీసుకోవాలని సిఎం సూచించారు. ఇన్ఛార్జి మంత్రులు వారికి కేటాయించిన జిల్లాల్లో ఉండి పర్యవేక్షించాలని తెలిపారు.

'దిత్వా' తుపాను హెచ్చరికల నేపథ్యంలో విపత్తుల ప్రతిస్పందన సంస్థ కార్యాలయంలో హోం మంత్రి అనిత ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. తుఫాన్ నేపథ్యంలో అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని, అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి అనిత అదేశించారు. ఎక్కువగా ప్రభావం చూపే తిరుపతి, చిత్తూరు, కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలకు హోంమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని సూచించారు.

# రాష్ట్ర రూపురేఖలు

>> చారు.. పనుల్లో వేగం పెంచాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. అనంతరం 8వ డివిజన్ రెబల వారి వీధిలోని పార్కుల ఆధునీకరణ పనులను పరిశీలించారు. పార్కులో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ జిమ్లను పర్యవేక్షి ంచి పలు మార్పులు చెయ్యాలని చెప్పారు. అయితే అక్కడ చేరుకున్న స్థానికులు అభ్యర్థన మేరకు పార్కు సమీపంలో సైడ్ రెయిన్ ఏర్పాటుకు మంత్రి నారాయణ ఆమోదం తెలిపారు. తదనంతరం ఆత్మకూరు బస్టాండ్ అండర్ పాస్ వద్ద రోడ్డు పనులను పరిశీలించారు. నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సిరి థియేటర్ వద్ద జరుగుతున్నటువంటి కమ్యూనిటీ హాల్ పనులను అనంతరం పరిశీలించారు. కమ్యూనిటీ హాల్ ముందున్న ట్రాన్స్ఫార్మర్ను వెనకాల వైపునకు మార్చాలని అధికారులకు సూచనలు జారీ చేశారు.. అదేవిధంగా అమరావతి హోటల్ సందులో నిర్మిస్తున్న సైడ్ రైన్ సిమెంట్ రోడ్డు పనులను కూడా మంత్రి పరిశీలించారు.. అయితే వర్షాన్ని కూడా లెక్కచేయకుండా తమ ప్రాంతాల్లో పర్యటిస్తున్న మంత్రికి స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ డాక్టర్ పొంగూరు నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. దిత్వా తుఫాన్ నేపథ్యంలో నెల్లూరులోని పలు ప్రాంతాల్లో పర్యటించటం జరిగిందన్నారు. డ్రైన్లలో సిల్టు తీయటం వల్ల నగరంలో ఎక్కడా వర్షపు నీరు నిలువలేదని తెలిపారు. పనులన్నీ పూర్తయితే నెల్లూరుకు ముంపు సమస్య తీరిపోతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజా సమస్యలపై దృష్టిపెట్టమని సిఎం చంద్రబాబు గారు ఆదేశించారని తెలియజేశారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో 150 కోట్లతో కాలువల పూడికతీత పనులు చేపట్టామన్నారు. గత ప్రభుత్వం ప్రజాకంతక పాలన సాగించిందని దుయ్యబట్టారు. ప్రజావసరాలను గాలికి వొదిలేసిందని మండిపడ్డారు. మా పై కోపంతో వాళ్ళు ఆపేసిన అభివృద్ధి పనులన్నీ తిరిగి చేపట్టామన్నారు. తనకున్న అపార అనుభవంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ముఖ్యమంత్రి గాడిలో పెడుతున్నారని తెలియజేశారు. ప్రజలు కాస్త ఓపిక పడితే ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నెల్లూరు నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మంత్రి నారాయణ సిటీలోని పలు ప్రాంతాల్లో పర్యటించారన్నారు. దిత్వా తుఫాన్ ప్రభావంతో నెల్లూరు నగరంలో ఎక్కడ ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో మంత్రి నారాయణ ప్రజలను అప్రమత్తం చేశారని తెలిపారు. మంత్రి నారాయణ చేసిన అభివృద్ధితో నగరంలో చుక్క వర్షపునీరు నిలవడం లేదని చెప్పారు. నెల్లూరు అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి ఎమ్మెల్యే కావడం మన అందరి అదృష్టమని రూప్ కుమార్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు.

# వాడి, వేడి చర్చలు!

>> స్త్రాలను సిద్ధం చేసుకొంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం మొత్తం 14 బిల్లులు ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది.

పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆదివారం పార్లమెంట్ హౌస్లో కేంద్ర రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, కేంద్ర మంత్రులు జెపి నడ్డా, అర్జున్ రామ్ మేఘవాల్, ఎల్.మురుగన్, అనుప్రియ పటేల్తోపాటు జైరామ్ రమేశ్ (కాంగ్రెస్), లావు శ్రీకృష్ణ దేవరాయలు (టిడిపి), మిథున్ రెడ్డి (వైసీపీ), సురేశ్ రెడ్డి (బిఆర్ఎస్), బాల శౌరి(జనసేన), కమల్ హాసన్, డెరాక్ ఒబ్రెయిన్, తిరుచ్చి శివ, టి.ఆర్ బాలు, కళ్యాణ్ బెనర్జీ సహా పలు పార్టీల పార్లమెంటరీ పక్ష నేతలు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో సభలో అనుసరించాల్సిన వ్యూహంపై వివిధ రాజకీయ పార్టీల సభ్యులకు ఆయా పార్టీల అధినేతలు ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్, ఢిల్లీ పేలుడు, ప్రభుత్వ విదేశాంగ విధానాలు, రైతాంగ సమస్యలపై చర్చకు అవకాశమి వ్వాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. మరోవైపు ఎన్నికల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ (సర్), ఢిల్లీ కారు బాంబుపేలుడు, ప్రభుత్వ విదేశాంగ విధానాలు, ఇతర అంశాలపై గళమెత్తేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి. అయితే సమావేశాల వ్యవధితక్కువగా ఉండటంతో సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరించాలని ప్రభుత్వం కోరింది. అలాగే ఈ సమావేశాల్లో సభలో ప్రవేశపెట్టిన బిల్లులను ఆమోదించేందుకు మద్దతుఇవ్వాలని వారికి విజ్ఞప్తి చేసింది. ఈ సమావేశాల్లో కొత్తగా మొత్తం 14 బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. నాలుగు ఆర్థిక సవరణ బిల్లులతో పాటు కాలం చెల్లిన మొత్తం 120 చట్టాలను రద్దు చేసే బిల్లు, హోం, అణుశక్తి, విద్య, రహదారులకు సంబంధించి మరో ఐదు కీలక బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. అలాగే పార్లమెంటు వర్షాకాల సమా వేశాల్లో ప్రవేశపెట్టి పార్లమెంట్ సెలెక్ట్ కమిటీల పరిశీలనకు పంపిన మరో రెండు బిల్లులు ఈ శీతాకాలసమావేశాల్లో కేంద్రం ఆమోదించేందుకు రంగసిద్ధం చేసింది.

**చర్చకు ప్రభుత్వం సిద్ధంగా లేదు: ప్రతిపక్షాలు**

కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ అంశాలపై చర్చించేందుకు సుముఖంగా లేదనే విషయం అఖిలపక్ష సమావేశంలో అర్థమైందని కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గొగోయ్ వ్యాఖ్యానించారు. ఎస్ఐఆర్పై చర్చ చేపట్టాల్సిందేనని తృణమూల్ కాంగ్రెస్ కూడా డిమాండ్ చేసింది. "ఎస్ఐఆర్ అంశాన్ని విపక్షాల్లో ప్రతిఒక్కరూ ప్రస్తావిస్తున్నారు. విపక్షాలు ప్రస్తావించిన అనేక అంశాలపై చర్చిస్తున్నప్పుడు ఎస్ఐఆర్పై ఎందుకు చర్చించరు. మీకు ఈ విషయం తెలుసా? కొద్దిరోజులుగా ఎస్ఐఆర్ విషయంలో 40 మంది చనిపోయారు. పది నుంచి 12 మంది పరి స్థితి విషమంగా ఉంది. ఇది చాలా తీవ్రమైన అంశం. దీనిపై చర్చించాల్సిన అవసరం ఉంది. ఓటరు జాబితాలో పేర్లు తొలగించే విషయంలో ఎస్ఐఆర్ ప్రక్రియ ఏకపక్షంగా సాగడానికి వీల్లేదు. గతంలో వీలైనన్ని ఎక్కువ పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చాలనే ఉద్దేశం ఎన్నికల సంఘానికి ఉండేది. ఇప్పుడేమో వీలైనన్ని ఓట్లు తొలగించాలని చూస్తోంది. ఈ వ్యవహారంపై చర్చించాలి" అని టీఎంసీ సభ్యుడు కల్యాణ్ బెనర్జీ డిమాండ్ చేశారు.

**విపక్షాలతో సంప్రదింపులు కొనసాగిస్తాం: కిరణ్ రిజిజు**

మరోవైపు శీతాకాల సమావేశాలు సజావుగా సాగేందుకు విపక్షాలు సహకరించా లని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు కోరారు. ఈ విష యంలో విపక్షాలతో సంప్రదింపులు కొనసాగిస్తామని ఆయన తెలిపారు. "విపక్షాలు అనేక అంశాలను ప్రస్తావించాయి. అందులో ఎస్ఐఆర్ ఒకటి. ఎస్ఐఆర్ అంశంపై పార్లమెంటును సాగనివ్వబోమని ఏ పార్టీ కూడా చెప్పలేదు. ఎవరైనా బయట చెప్పి ఉంటే దానిని సామూహిక ప్రకటనగా భావించడానికి వీల్లేదు. శీతాకాల సమావేశాలు సజావుగా సాగుతాయని నేను విశ్వసిస్తున్నాను. ఈ మేరకు ప్రభుత్వంకోరింది. విపక్షాలుకూడా అనేక మంచి సలహాలు ఇచ్చాయి. అంతా కలిసి శీతాకాల సమావేశాలను సజావుగా నడపాలనే అభిప్రాయంతో ఉన్నాం."అని పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు.

**కాంగ్రెస్ పార్లమెంటరీ స్ట్రాటజీ సమావేశం...**

పార్లమెంట్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఆదివారం సాయంత్రం సోనియా గాంధీ నివాసంలో కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశాన్ని నిర్వహించింది. ముఖ్యంగా దేశవ్యాప్తంగా చర్చానీయాంశంగా మారిన ఎస్ఐఆర్ విధానంపై పార్లమెంట్ను స్తంభింపజేయాలని విపక్షాలు భావిస్తున్నాయి. దీనితో పాటు ఢిల్లీ వాయు కాలుష్యం అంశం కూడా పార్లమెంట్నూ కమ్మేయనుందన్న చర్చ జరుగుతోంది. ఓట్ల చోరీ అంశాన్ని రాహుల్గాంధీ మరోసారి పార్లమెంట్లో ప్రస్తావించాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలురాష్ట్రాలు సుప్రీం కోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తున్నాయి. ఇదే అంశాన్ని పార్లమెంట్లో ప్రస్తావించి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని యోచిస్తోంది. కలిసివచ్చే పార్టీలను కలుపుకొని ఉభయ సభలలో ప్రభుత్వ తీరును ఎక్కడికక్కడ ఎండగట్టాలని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం.

# నివేదిక రెడీ

>> అప్పటి టిటిడి బోర్డు కలసి పరకామణి చోరీకేసును రాజీతో మూసేశారనేది ప్రధాన ఆరోపణలు.దీనిపై హైకోర్టుకు కేసు చేరడంతో సమగ్ర దర్యాప్తుకు సిఐడి డిజికి ఆదేశించింది. అయితే ఈ కేసులో పూర్తిస్థాయిలో దర్యాప్తుకు సిఐడి చీఫ్ రవిశంకర్అయ్యన్నార్, ఎస్పి, డిఎస్పీలు, సిబ్బంది కలసి నవంబర్ 6వతేదీ నుండి రంగంలోకి దిగారు. తొలుత నిందితుడు రవికుమార్ను, అతని కుటుంబసభ్యులను విచారణ చేశారు. చోరీ ఎప్పటినుండి జరుగుతోంది, ఎలా ఆస్తులు సంపాదించారు వంటి అంశాలపై కూలంకుషంగా వివరాలు రాబట్టారు. ఆ తరువాత కీలకమైన విజిలెన్స్ పూర్వ ఎవిఎస్ఒ వై.సతీశ్కుమార్ను ఒకసారి సిఐడి విచారణ చేసింది. విజిలెన్స్ ప్రమేయం కేవలం జరుగుతున్న నేరాలపై నిఘా ఉంచి పట్టుకోవడం,ఆ తరువాత టిటిడి పై అధికారుల ఆదేశాలతో పోలీసులకు అప్పగించడం వరకేనని సమాచారం. అయితే రెండవసారి విచారణకు తిరుపతికి వస్తుండగా ఆయన్ను తాడిపత్రి వద్ద ఆగంతుకులు హత్యచేశారనేది పోలీసులు నిర్ధారణ.వరుసగాతిరుమలలో పనిచేసిన మాజీ ఇఒ ఏవి ధర్మారెడ్డిని, మాజీ ఛైర్మన్లు భూమన కరుణాకర్రెడ్డిని, వైవి సుబ్బారెడ్డిని, మాజీ సివిఎస్ఒ నరసింహకిశోర్ను, అప్పటి తిరుమలలో పనిచేసిన సిఐలు జగన్మోహన్రెడ్డి,చంద్రశేఖర్, ఎస్ఐ లక్ష్మీరెడ్డిని కూడా సిఐడి విచారణ చేపట్టింది. వీరందరి నుండి సేకరించిన వివరాలు, రాబట్టిన ఆధారాల వాంగ్మూలాలను రికార్డుచేసింది. ఆ రికార్డులను ,ఎవరి తప్పిదాలు, ఎవరి ప్రమేయం ఎంతవరకు ఉందనే విషయాలను సిఐడి హైకోర్టు ధర్మాసనంకు సమర్పించనున్నారు.వీటిని పరిశీలించిన తరువాత తదుపరి హైకోర్టు ప్రధానన్యాయమూర్తి వెలువడించే ఆదేశాల ప్రకారం ఎవరెవరిని అరెస్ట్ చేస్తారనేది ఇప్పుడు పెద్ద సంచలనంగా మారింది.

భక్తులు కానుకలుగా సమర్పించిన వాటిని జాగ్రత్తగా కాపాడాల్సిన బాధ్యత ఉన్న వ్యక్తి ,అమెరికన్ డాలర్లు చోరీచేసినా చర్యలు ఎందుకు తీసుకోలేక పోయారని, పోలీస్ కేసు నమోదైన తరువాత చట్టప్రకారం చర్యలు తీసుకోలేక పోవడం,రాజీచేయడం వెనుక ఎవరి పాత్ర ఉందనే కోణంలో టిటిడి మాజీ పెద్దలను, పోలీసు అధికారులను సిఐడి చీఫ్ రవిశంకర్అయ్యన్నార్ ప్రశ్నించి రాబట్టిన సమాచారం ఇప్పుడు కీలకం కానుంది. మాజీలు కూడా ఈ కేసులో ప్రమేయం ఎవరిదీ లేదని, చోరీ జరిగినవిషయం తనకు తెలియదని, తదుపరి పరిణామాలతో తనకెలాంటి సంబంధంలేదని పలు రకాలుగా సిఐడికి వాంగ్మూలం ఇవ్వడం కూడా జరిగింది. మరి రేపు న్యాయమూర్తి ఇచ్చే ఆదేశాలపై తదుపరి సిఐడి చర్యలు ఏంటనేది ఉండబోతోంది.

# గోదావరి పుష్కరాలు

>> నిర్ణయం తీసుకొని, నోటిఫికేషన్,జారీ చేయాల్సి ఉంది. గత పుష్కరాలు 2015లో జులై 14 నుంచి 5 వరకు జరిగాయి.రాష్ట్రంలో అల్లూ రి సీతారామరాజు, ఏలూరు, తూర్పు గోదా వరి, పశ్చిమ గోదావరి,డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ,జిల్లాల్లో గోదావరి ప్రవహిస్తుంది. వివిధ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు పుష్కరస్నానం ఆచరించేందుకు తరలిరాను న్నారు. ఈ నేపథ్యంలో వివిధ శాఖలు సమన్వ యంతో పనిచేసేలా ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది. మంత్రుల కమిటీని వివిధ శాఖల కార్యదర్శులతో కమిటీని ఏర్పాటు

# భూగర్భ విద్యుత్ లైన్లు

>> చెప్పారు. భూగర్భంలో హైటెన్షన్ లైన్లు వేయడం ద్వారా భద్రత పెరుగుతుందని వివరిం చారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచు కొని అమరావతిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. అత్యా ధునిక మౌలిక వసతుల నగరంగా అమరావతి పెరుగుతోందన్నారు. ప్రపంచస్థాయి ప్రమాణా లతో అమరావతి రూపుదిద్దుకుంటోందని లోకేష్ చేశారు. జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో ఒక నమునాగా అమరావతి మహానగరం ఆవిర్భ విస్తుందన్నారు.రాష్ట్రంలో ప్రత్యామ్నాయ విద్యుత్తు ఉత్పత్తి రంగంలో ప్రభుత్వం కీలక అడుగులు వేసినట్లు వివరించారు.

# రంగయ్య అరెస్టు

>> న్నారు. పెద్ద ఎత్తున ఒరిజినల్ బ్రాండ్ల లేబుల్స్ను అతనే ముద్రించి, నకిలీ మద్యం నింపిన బాటిళ్లకు అతికించేందుకు సరఫరా చేశాడని ఆధారాలు లభించాయి. ఈ కేసులో ఇప్పటివరకు 50కి పైగా అరెస్టులు జరగగా, తలారి రంగయ్య అరెస్టుతో దర్యాప్తు మరింత లోతుగా సాగే అవకాశం ఉంది.

## వారం - వర్జ్యం

01-12-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
ఏకాదశి సా.6.55
రేవతి రా.11.13, అనూరాధ కార్తె
వర్జ్యం : సా.5.12-6.38
దు.మ.12.20-1.05, రా.2.35-3.20
శుభసమయం : ఉ.9.15-10.10
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం** :వృత్తి, వ్యాపారాలలో ఊహించని మార్పులు చేటు చేసుకుంటాయి. పోటీ పరీక్షలలో పాల్గొంటారు.పెట్టుబడులకు తగిన సమయం.

**వృషభం:** పారిశ్రామిక రంగాల వారికి అనుకూలంగా వుంటుంది. మీ ప్రతిభా పాటవాలు వెలుగులోకి వస్తాయి. ప్రయాణాలు జాగ్రత్త.

**మిథునం:** సంఘంలో గౌరవ ప్రతిష్ఠలు పెరుగుతాయి. రాజకీయ పరిచయాల వలన లాభనష్టాలు సరిసమానంగా వుంటాయి.

**కర్కాటకం**:వ్యాపారాలలో మెలకువలు అవసరం. రాజకీయ పరిచయాల వలన లాభనష్టాలు సరిసమానంగా వుంటాయి.

**సింహం**: ఏ సంగతీ తేల్చకుండా వాయిదా వేస్తూ వస్తున్న ఒక విషయం మీ నిర్ణయాలను స్పష్టంగా తేల్చి చెప్పలేరు.

**కన్య** : జీవిత భాగస్వామితో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆభరణాలు, విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.

**తుల** :జీవితం ఒకేగాడిలో సాగుతున్నట్లుగా భావిస్తారు. కొత్తదనాన్ని కోరుకుంటారు. ఊహాలోకాలలో విహరిస్తారు.వస్తులాభం.

**వృశ్చికం**:శారీరక, మానసిక శ్రమ అధికంగా ఉంటుంది. ఆధ్యాత్మిక కార్య క్రమాలలో పాల్గొంటారు. ప్రయాణాలు.

**ధనుస్సు**: మంచితో మీరు చేసే ఒక పనిని మీ ప్రత్యర్థి వర్గం చెడుగా ప్రచారం చేస్తుంది. సోదరుల కలయిక.

**మకరం**: సంతానాన్ని క్రమశిక్షణలో నడిపించడానికి గాను మీరు చేసే ప్రయత్నాలు మంచి ఫలితాన్ని ఇస్తాయి. వస్త్రలాభం కలదు.

**కుంభం**: అదృష్టాన్ని ఎక్కువగా నమ్ముతారు. వార్తాపత్రికలలోని ఒక వార్త మిమ్మల్ని విస్మయానికి గురి చేస్తుంది. వాహనయోగం.

**మీనం**:లీజులు, సబ్లీజులు లైసెన్స్లను పొడిగించు కోవడానికి గాను చేసే యత్నాలు కొంతవరకు లభిస్తాయి.బంధువుల కలయిక.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# దూసుకొస్తున్న 'దిత్వా'

>> వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. మత్స్యకారులు ఎవరూ సముద్రంలో వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. తుపాను దృష్ట్యా నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, ప్రకాశం, కడప, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

**తక్షణం పునరావాస కేంద్రాలకు తరలించాలి: హోంమంత్రి అనిత**

తుఫాను బాధితులను తక్షణం పునరావాస కేంద్రాలకు తరలించాలని హోంమంత్రి అధికారులను ఆదేశించారు. విద్యుత్తు సరఫరా ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దిత్వా తుపానుపై సచివాలయంలో ఆర్టీజీఎస్ స్టేట్ సెంటర్ నుంచి హోంమంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. నెల్లూరు, తిరుపతి, కడప, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్లో మాట్లాడారు. తుపాను నేపథ్యంలో ఇవాళ, రేపు అధికారులు మరింత అలర్ట్గా ఉండాలని హోంమంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలను ఎప్పటి కప్పుడు అప్రమత్తం చేయాలని, ప్రాణనష్టం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సహాయం కోసం కంట్రోల్ రూమ్కువచ్చే కాల్స్కు వెంటనే స్పందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రమాదాలు జరిగే అవకాశాలున్న ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులను నియమించాలని దిశానిర్దేశం చేశారు. ఈదురు గాలుల ధాటికి విరిగిన కొమ్మలు, హోర్డింగ్స్ వంటివి వెంటనే తొలగించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే వెంటనే పునరుద్ధరణ చేయాలని తెలిపారు. అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నామని కలెక్టర్లు మంత్రికి వివరించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించడానికి కూడా ఏర్పాట్లు చేశామన్నారు.

**తిరుమల కొండపై పై కుండపోత వర్షం**

దిత్వా తుఫాన్ప్రభావంతో తిరుపతి జిల్లాలో తిరుమల,తిరుపతి,చంద్రగిరి, శ్రీకాళహస్తి,గూడూరు ప్రాంతాల్లో ఆదివారం వేకువజాము నుండి ఎడతెరపిలేని వర్షం కురుస్తోంది. సప్తగిరులపై కూడా ఆదివారం ఉదయం నుండి భారీగా వర్షం కురుస్తోంది. తుఫాన్తో వరుణదేవుడు కొండపై తీవ్రరూపం దాల్చాడు. ఓ వైపు జోరువర్షం మరోవైపు విపరీతమైన చలితో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారాంతం కావడంతో తిరుమలలో భక్తులసంఖ్య పెరిగింది. ఉదయంనుండి కురుస్తున్న వర్షాలకు భక్తులు షెడ్లలోనే తలదాచుకుం టున్నారు. వానతో వాతావరణంమారి చలితీవ్రత పెరిగింది. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు చలికి వణుకుతు న్నారు. వర్షంతో భక్తులు ఆలయంలోపలకు శ్రీవారి దర్శనానంతరం ఆలయం వెలుపలకు వర్షంలో తడిసి లడ్డూవితరణ శాలకు చేరుకోవాల్సి వస్తోంది. భారీ వర్షాల కారణంగా తిరుమల ఘాట్రోడ్లలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం వుందని, వాహనదారులు,భక్తులు అప్రమత్తంగా ఉండాలని టిటిడి విజిలెన్స్ హెచ్చరిస్తు న్నారు. వర్షం తగ్గుముఖం పట్టేవరకు భక్తులు తిరుమలలో సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని కోరుతున్నారు. కురుస్తున్న వర్షాలకు కొండల్లోంచి జలపాతాలు జోరున పరవళ్లుతొక్కుతూ ప్రవహిస్తున్నాయి.

# విమాన సర్వీసులు, విద్యా సంస్థలు బంద్

>> ఒడిశా రాష్ట్రాలవరకూ ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీచేసింది. తమిళనాడులో ఉన్న కోస్తా తీర జిల్లాలన్నింటినీ మరింత అప్రమత్తంచేసింది. మత్స్యకారులు సముద్రం లోపలికి వెళ్లవద్దని, చేపలవేట నిలిపివేత ఉత్తర్వులు జారీచేసింది. చెన్నై పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో జనజీవనం అస్తవ్యస్తం అయింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా స్టాలిన్ప్రభుత్వం ముందుగానే విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించింది.

# ఛత్తీస్గఢ్లో 37 మంది మావోయిస్టులు లొంగుబాటు



**రాయ్పూర్, నవంబరు 30:** ఛత్తీస్గఢ్లోని దంతేవాడ జిల్లాలో ఆదివారం 37 మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వచ్చారు. జిల్లా ఎస్పీ గౌరవ్ రాయ్ ఎదుట వీరంతా సరెండర్ అయ్యారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో 12 మంది మహిళలు ఉన్నారు. వీరిపై రూ.67 లక్షల మేర రివార్డు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వ పాలసీ ప్రకారం తక్షణ సాయం కింద రూ.50 వేలు చొప్పున నగదు సాయం అందిస్తామన్నారు.

# దిత్వాపై వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తం

## ప్రభావిత జిల్లాల్లో ప్రసవానికి దగ్గర్లో 7,871 మంది గర్భిణులు ఉన్నట్లు గుర్తింపు

## ఆసుపత్రులకు 375 మంది తరలింపు

## ఉన్నతాధికారులతో మంత్రి సత్యకుమార్ సమీక్ష

**విజయవాడ, నవంబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** దిత్వా తుఫాన్ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. ముఖ్యంగా రానున్న 15 రోజుల్లో ప్రసవానికి దగ్గర్లో ఉన్న గర్భిణుల విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. తుపాన్ ప్రభావిత జిల్లాలైన అన్నమయ్య, చిత్తూరు, నెల్లూరు, తిరుపతి, కడప, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, కోనసీమ, వెస్ట్ గోదావరి జిల్లాల్లో వచ్చే 15 రోజుల్లో ప్రసవానికి అవకాశం ఉన్న వారు 7,871 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరిని ముందు జాగ్రత్తగా సమీపంలోని ఆసుపత్రులకు తరలించే ప్రక్రియ మొదలైంది. ఆదివారం రాత్రికి 375 మంది గర్భిణులు ఆసుపత్రులకు చేరుకున్నారని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ ఓ ప్రకటనలో తెలిపారు. మిగిలిన వారు కూడా ఆసుపత్రులకు రావాలని సూచిస్తున్నామని పేర్కొన్నారు. దిత్వా తుపాన్ ప్రభావిత పది జిల్లాల్లోని వైద్యులు, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. ఆసుపత్రుల్లో విద్యుత్తు సరఫరాకు అవరోధం లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలని ఆసుపత్రులు సూపరింటెండెంట్లకు కమిషనర్ సూచించారు. వైద్య శిబిరాల నిర్వహణ దిత్వా తుఫాన్ ప్రభావానికి అనుగుణంగా వైద్య శిబిరాల నిర్వహణకు కూడా అధికారులు కూడా చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్ యాదవ్కూడా దిత్వా తుపాన్ సన్నా హక ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ రూములో ఇతర శాఖల వారితోపాటు వైద్య ఆరోగ్య శాఖ సీనియర్ అధికారులు కూడా ఉంటున్నారు.

# 12 మంది మృతి, 40 మందికి గాయాలు

>> కారైకుడి నుంచి దిండిగల్కు ప్రయాణిస్తోంది. తిరుపత్తూర్ వద్దకు రాగానే ఈ రెండు బస్సులు ఢీకొన్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సహాయక చర్యలు చేపట్టి, క్షతగాత్రులను శివగంగ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో వారం రోజుల వ్యవధిలోనే ఇలాంటి ఘోర ప్రమాదం జరగడం ఇది రెండోసారి కావడం గమనార్హం. నవంబరు 24న తెన్కాశి జిల్లాలో రెండు ప్రైవేట్ బస్సులు ఢీకొన్న ఘటనలో ఐదుగురు మహిళలు సహా ఆరుగురు మరణించగా, 56 మంది గాయపడ్డారు. ఆ ప్రమాదానికి డ్రైవర్ అతివేగమే కారణమని పోలీసులు నిర్ధారించారు. ఆ ఘటనలో మృతుల కుటుంబాలకు సిఎం ఎంకే స్టాలిన్ రూ. 3 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. క్షతగాత్రుల్లో కొందరిపరిస్థితి విషమంగా మారడంతో మృతుల సంఖ్య పెరుగవచ్చని తెలుస్తున్నది. ఈ ప్రమాదంలో రెండు బస్సుల్లోని ప్రయాణికులు చిక్కుకున్నారు. స్థానికుల సహాయంతో పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. మరోవైపు గాయపడిన 40 మందిని శివగంగై ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొంతమంది ప్రయాణికుల పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పోలీస్ అధికారి తెలిపారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# సర్జికల్ బ్లేడును లోపలే ఉంచి శస్త్రచికిత్స చేసిన వైద్యుడి సస్పెన్షన్

## స్టాఫ్ నర్సు కూడా..

## మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆగ్రహం

**విజయవాడ,నవంబరు 30 ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా తునిలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఓ యువకుడికి శస్త్రచికిత్స సమయంలో సర్జికల్ బ్లేడును లోపలే పెట్టి కుట్టేసిన ఘటనలో ఆర్థోపెడిక్ వైద్యుడు సత్యసాగర్, స్టాఫ్ నర్సు పద్మావతిని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సస్పెండ్ చేసింది. మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ అధికారులు సస్పెండ్ ఉత్తర్వులు జారీచేశారు. ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి, శస్త్రచికిత్స ద్వారా స్టీలురాడ్డు వేయించుకోగా నొప్పి ఎక్కువగా ఉందని రావడంతో వైద్యుడు సత్యసాగర్ ద్రూను నవంబరు 27న తొలగించారు. అయితే శస్త్రచికిత్స సమయంలో ఉపయోగించిన సర్జికల్ బ్లేడును అలాగే లోపలే ఉంచి, కుట్టువేశారు. యువకుడికి మళ్ళీ నొప్పి ఎక్కువైంది. X-ray ద్వారా బ్లేడ్ లోపల ఉన్నట్లు తేలింది. విధుల నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విచారణ జరిపి, నివేదించాలని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధరబాబును ఆదేశిం చారు. ఈ మేరకు అయన విచారణ జరిపించారు. ఈ ఘటనపై అసుపత్రి సూపరింటెండెంట్ ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదు. డిస్ట్రిక్ట్ అధికారి ద్వారా మరింత లోతుగా విచారణ చేయించారు. తద్వారా వైద్యుడు సత్యసాగర్, స్టాఫ్ నర్సు పద్మావతి శస్త్రచికిత్స సమయంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినట్లు తేలింది.

## సైనిక వెల్ఫేర్‌లో సహచర అధికారిపై దౌర్జన్యం

# హైకోర్టు మండిపాటు

**విజయవాడ,నవంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** తన సహచర అధికారి పట్ల మరో అధికారి దౌర్జన్యంగా వ్యవహరించిన ఘటనపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాలకు భిన్నంగా జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా మజ్జి కృష్ణారావు బాధ్యతలు స్వీకరించే ప్రయత్నం చేయడాన్ని ఆక్షేపించింది. అదే స్థానంలో ఉన్న మరో ఆఫీసర్ కెవిఎస్ ప్రసాదరావు పట్ల దౌర్జన్యంగా, దురుసుగా ప్రవర్తించడాన్ని తప్పుపట్టింది. తిరిగి ఉత్తర్వులు జారీ చేసే వరకు ప్రసాదరావును అదే స్థానంలో కొనసాగించాలని హోంశాఖ ముఖ్యకార్యదర్శి, సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్లను ఆదేశించింది. కృష్ణారావు తీరు ఎపి స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్‌కు వ్యతిరేకమంది. విజయనగరం జిల్లా కలెక్టరు, జిల్లా ఎస్‌పి, వన్‌టౌన్ పిఎస్ సిఐలను సుమోటో ప్రతివాదులుగా చేర్చింది. వీరితోపాటు ప్రభుత్వం, మజ్జి కృష్ణారావు తమ వాదనలతో కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. విచారణను డిసెంబరు 2కు వాయిదా వేస్తూ జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ ఎ హరిహరనాథ శర్మతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. విజయనగరం జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న మజ్జి కృష్ణారావు కాకినాడకు బదిలీ అయ్యారు. విజయనగరం జిల్లాకు కెవిఎస్ ప్రసాదరావు నియమితులయ్యారు. కృష్ణారావు కాకినాడలో జాయిన్ కాలేదు. తర్వాత విజయనగరంలోనే కొనసాగించాలంటూ హోంశాఖ ముఖ్యకార్యదర్శి ప్రొసీడింగ్స్ జారీ చేశారు. దీనిని సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ అమలు చేయలేదని కృష్ణారావు హైకోర్టుకు వచ్చారు. హోంశాఖ ప్రొసీడింగ్స్ అమలు చేయాలని సింగిల్ జడ్జి గతంలో ఆదేశించారు. ఈ ఉత్తర్వులను ప్రసాదరావు డివిజన్ బెంచ్ వద్ద అప్పీల్ చేశారు. తనను ప్రతివాదిగా కూడా చేయకుండా కృష్ణారావు పిటిషన్ వేస్తే సింగిల్ జడ్జి ఆర్డర్ ఇవ్వడం చెల్లదన్నారు. దీనిపై డివిజన్ బెంచ్ ఈ నెల 27న స్టేటస్‌కో ఆర్డర్ ఇచ్చింది. ఈ సమయంలోనే కృష్ణారావు 20 మందితో దౌర్జన్యంగా వచ్చి ప్రసాదరావు చాంబర్‌లో చొరబడ్డారని న్యాయవాది చెప్పారు. ప్రసాదరావును సీటులోంచి లేపి బయటకు తోసేశారని చెప్పారు. ప్రభుత్వ న్యాయవాది వాదిస్తూ, ఈ నెల 27న మధ్యాహ్నమే బాధ్యతలు స్వీకరించారని చెప్పారు. దీనిపై ప్రసాదరావు న్యాయవాది స్పందిస్తూ, డైరెక్టర్ సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ అందలేదన్నారు.

# రాష్ట్ర అంశాలపై పార్లమెంట్‌లో గట్టిగా గళం విప్పాలి

## పోలవరం, అమరావతి ప్రాజెక్టులపై దృష్టి సారించాలన్న డి.సిఎం పవన్

**విజయవాడ,నవంబరు30,ప్రభాతవార్తప్రతినిధి:** పార్లమెంటులో రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్లను ప్రస్తావిస్తూ,మనం గుర్తించిన ఇతర సమస్యలను పరిష్కరించే దిశలో జనసేన వాణి ఉండాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్రంలోని ప్రతి అంశంపై ఎన్డీఏ కూటమి సభ్యులు సమాలోచన చేయాలని,తరువాత పార్లమెంటులో ప్రస్తావించాలన్నారు.డిసెంబర్ 1 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల నేపథ్యంలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పార్టీ ఎంపీలకు కీలక దిశానిర్దేశం చేశారు. అమరావతిలో లోక్‌సభ సభ్యులు బాలశౌరి, తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌తో ఆయన ప్రత్యేకంగా సమావేశమై, పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్




మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై పార్లమెంట్‌లో గట్టిగా గళం విప్పాలని సూచించారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన చర్చల్లో చురుగ్గా పాల్గొనేందుకు ముందస్తుగా సిద్ధం కావాలని ఎంపీలకు తెలిపారు. రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి ప్రాజెక్టులను వేగవంతం చేసేందుకు సంబంధిత కేంద్ర మంత్రులతో సమావేశమై, వివరణాత్మక నివేదికలు అందించాలని స్పష్టం చేశారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్ట్, రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం అందిస్తున్న సహకారం చాలా కీలకమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు కేంద్ర పథకాల ద్వారా రావాల్సిన నిధులపై రాష్ట్ర అధికారులతో సమీక్షి ంచి, ఆ వివరాలను కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

# మాతృత్వ ఆరోగ్య సంరక్షణలో రాష్ట్ర వైద్యారోగ్యశాఖకు అంతర్జాతీయ గుర్తింపు

## ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనరు వీరపాండియన్



**విజయవాడ,నవంబరు30,ప్రభాతవార్తప్రతినిధి:** మాతృత్వ ఆరోగ్య సంరక్షణ విధానం అమల్లో వైద్యారోగ్యశాఖకు అంతర్జాతీయ గుర్తింపు లభించిందని ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనరు వీరపాండియన్ వెల్లడించారు. గర్భిణులకు సహజ ప్రసవాలు జరిగేలా చేసేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై చేపట్టిన మిడ్ వైఫర్తీ శిక్షణ కార్యక్రమాన్ని అత్యుత్తమ విధానం కింద ఇంటర్నేషనల్ కాన్ఫడరేషన్ ఆఫ్ మిడ్ వైఫ్స్ ఎంపిక చేసిందని ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది జూన్ 14 నుంచి 18వ తేదీ మధ్య పోర్చుగల్ దేశం లిస్బాన్ నగరంలో జరిగే కార్యశాలలో వివరిం చాలని వైద్యారోగ్య శాఖను ఆహ్వానించినట్లు వెల్లడించారు. మాతృ ఆరోగ్య సంరక్షణ, ఇతర కేటగిరిల్లో అనుసరిస్తున్న ఉత్తమ విధానాల (బెస్ట్ ప్రాక్టీస్) వివరాలు పంపాలని నెదర్లాండ్ కేంద్రంగా ఉన్న ఇంటర్నేషనల్ కాన్ఫడరేషన్ ఆఫ్ మిడ్వైఫ్స్ దరఖాస్తులను ఆహ్వానించిందని తెలిపారు. మిడ్వైఫరీ శిక్షణ కార్యక్రమం, దాని ఫలితాలపై ఇంటర్నేషనల్ సంస్థకు మూడు నెలల కిందట పంపినట్లు వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన 6,188 వివరాలు పరిశీలించిన ఇంటర్నేషనల్ కాన్ఫడరేషన్ ఆఫ్ మిడ్వైఫ్స్ సంస్థ తాము చేపట్టిన శిక్షణ కార్యక్రమం, ఫలితాలను పరిగణనలోకి తీసుకుని అత్యుత్తమ విధానంగా ఎంపిక చేసిందని తెలిపారు. యూనిసెఫ్, ఫెర్నాండెజ్ ఫౌండేషన్‌తో కలిసి సహజ ప్రసవాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎంపిక చేసిన నర్సులకు ప్రత్యేకంగా మిడ్‌వైఫరీ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారుల చొరవను వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు.

# నేడు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం

**విజయవాడ,నవంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని డిసెంబర్ 1 సోమవారం ఉదయం 9.30గంటల నుండి ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కార్యక్రమాలను నగరంలోని స్థానిక తుమ్మలపల్లి కళాశాలలో నిర్వహించడం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా హెచ్ఐవి/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడం, అలాగే ప్రపంచవ్యాప్తంగా ఏకత్వం మరియు సంఘీభావాన్ని ప్రదర్శించడం కార్యక్రమ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మెడకల్ ఎడ్యుకేషన్ శాఖ మంత్రి, సత్య కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారన్నారు. ఆ శాఖ ప్రధాన కార్యదర్శి సౌరబ్ గౌర్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, మిషన్ డైరెక్టర్ (ఎన్ఎచ్ఎం) జి వీర పాండ్యన్, డైరెక్టర్ సెకండరీ హెల్త్ కేబీఎన్ చక్రధర బాబు, జిల్లా కలెక్టర్ డా . జి లక్ష్మీశా, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖఉన్నతాధికారులు పాల్గొననున్నారని తెలిపారు.ఉదయం 9గంటలకు విజయవాడ లోని పాత ప్రభుత్వ ఆసుపత్రి (ఓల్డ్ జిజిహెచ్) నుండి తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు ప్రారంభమయ్యే ర్యాలీని మంత్రి సత్య కుమార్ యాదవ్, శాసనసభ్యులు ఇతర అధికారులు ప్రారంభించనున్నారని తెలిపారు. అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అధికారులు ఆ ప్రకటనలో తెలిపారు.

# రాష్ట్రానికి జల్ జీవన్ మిషన్ నిధులు రావాల్సి ఉంది

## లోక్‌సభ సభ్యుడు వల్లభనేని శౌరి


**విజయవాడ,నవంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో అనేక జిల్లాలకు జల్ జీవన్ మిషన్ కింద నిధులు రావాల్సి ఉందని జనసేనకు చెందిన లోక్‌సభ సభ్యుడు వల్లభనేని శౌరి వ్యాఖ్యానించారు. ప్రతి ఇంటికి మంచినీటిని అందించే జల్ జీవన్ మిషన్ కొనసాగించాలన్నారు.సోమవారం నుండి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఈరోజు ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు, జనసేన పార్టీ ఫ్లోర్ లీడర్ వల్లభనేని బాలశౌరి పాల్గొన్నారు. ఏపీలో మొంతా తుఫాను, దిత్వా తుఫానుల వల్ల జరిగిన నష్టంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని అఖిలపక్ష సమావేశంలో కోరారు.దీనిపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని ఆయన విన్నవించారు. జల జీవన్ మిషన్ పథకం కింద ఏపీకి కేంద్ర సహకారం కావాలని, ఎస్ఐఆర్ (ఎన్నికల జాబితా సవరణ) పై పార్టీలో చర్చించి మా పార్టీ నిర్ణయాన్ని అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కేంద్రానికి చెబుతారని కూడా అఖిలపక్షానికి బాలశౌరి తెలియజేశారు.



పోలవరం ప్రాజెక్టును 2027 లోపు పూర్తి చేయాలని, అమరావతి రాజధాని నిర్మాణం 2028 లోపు పూర్తయ్యేలా సహకారం అందించాలని కేంద్రం దృష్టికి తీసుకెళ్లానని కూడా బాలశౌరి వెల్లడిం చారు. రాజధాని, పోలవరం, ఔటర్ రింగ్ రోడ్డు సహా అనేక విషయాల్లో రాష్ట్రానికి కేంద్ర సహకారం ఉందని ఆయన చెప్పారు. ఖచ్చితంగా ఎన్డీఏలో భాగస్వాములుగా ఉన్నాం.. రాష్ట్రం వెనుకబడి ఉంది.. కేంద్రం సహకారాన్ని మరింత పెంచాలని కోరామని ఎంపీ తెలిపారు.

# హత్యకేసులో ఆరుగురు నిందితుల అరెస్టు

**కావలి,(నెల్లూరు)నవంబరు 30 ప్రభాతవార్త :** టిడిపి నేత గొట్టిపాటి ప్రసాద్ నాయుడు హత్యకేసులో ఆరుమంది నిందితులను అరెస్టు చేసినట్లు స్థానిక డిఎస్‌పి శ్రీధర్ తెలిపారు. ఆదివారం స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన డిఎస్‌పి మాట్లాడుతూ జలదంకి మండలం గట్టుపల్లి చింతలపాలెంలో భూవివాదం హత్యకు కారణమని తెలిపారు. గత కొద్ది సంవత్సరాల క్రితం గట్టుపల్లి చింతలపాలెంలో మామిడితోటలను క్రిష్ణాజిల్లాకు చెందిన గారపాటి సదా



శివరావు, తలశిల వెంకటనరసింహారావులు కొనుగోలు చేశారని సదాశివరావు, వెంకట నరసింహారావుల మధ్య గత కొద్ది రోజులుగా భూ వివాదాలు తలెత్తేవన్నారు. గొటిపాటి ప్రసాద్‌నాయుడు, సదాశివరావుకు సపోర్టుగా న్నారని హత్యకు వెంకటనరసింహారావు ప్లాన్ చేయడం జరిగిందన్నారు. బాపట్లకు చెందిన యువకుకు సుఫారి ఇచ్చి హత్యకు పాల్పడడం జరిగిందన్నారు. గొట్టిపాటి ప్రసాద్‌నాయుడు కోళ్లఫారంలో ఉండగా కోడి కత్తితో హత్య చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో కలిగిరి సిఐ వెంకటనారాయణ, సిసిఎస్ సిఐ సీతారాములు, కావలి వన్‌టౌన్ సిఐ ఫిరోజ్, టూటౌన్ సిఐ గిరిబాబు, రూరల్ సిఐ రాజేశ్వర్‌రావు, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

# ఫిల్మ్, టూరిజం రంగాల్లో పెట్టుబడులే లక్ష్యం

## నేడు, రేపు ముంబైలో మంత్రి దుర్గేష్ పర్యటన

## సిఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్‌కు హాజరుకానున్న మంత్రి

**విజయవాడ, నవంబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌ను సినిమా షూటింగ్‌లకు, పర్యాటకానికి ప్రధాన కేంద్రంగా మార్చడమే లక్ష్యంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా "ది ఏఐ ఎరా - బ్రిడ్జింగ్ క్రియేటివిటీ అండ్ కామర్స్" థీమ్‌తో డిసెంబర్ 1, 2 తేదీల్లో ముంబయి జుహూలోని జేడబ్ల్యు మారియట్ హోటల్‌లో జరగనున్న ప్రతిష్టాత్మక "సిఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్ 2025"లో పాల్గొనేందుకు ఆయన ఆదివారం రాజమహేంద్రవరం ఎయిర్ పోర్ట్ నుండి బయలుదేరారు.



కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) సభ్యులు, దేశ విదేశాలకు చెందిన మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగ ప్రముఖులు, అంతర్జాతీయ పెట్టుబడిదారులు పాల్గొనే ఈ ప్రతిష్టాత్మక సమ్మిట్‌లో ఎపిలో సినిమా పరిశ్రమను బలోపేతం చేయడానికి ప్రభుత్వం రూపొందిస్తున్న కొత్త "ఫిల్మ్ టూరిజం పాలసీ" గురించి మంత్రి దుర్గేష్ వివరించనున్నారు. రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయి ఫిల్మ్ స్టూడియోలు, డబ్బింగ్ థియేటర్లు మరియు పోస్ట్ ప్రొడక్షన్ యూనిట్ల ఏర్పాటు ఆవశ్యకతను తెలిపి పెట్టుబడిదారులను ఆహ్వానించనున్నారు. అంతేగాక పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, రాయితీలను వివరించి వారికి భరోసా కల్పించనున్నారు. సినిమాల ద్వారా పర్యాటక రంగాన్ని ఎలా అభివృద్ధి చేయవచ్చో మంత్రి దుర్గేష్ ప్రసంగించనున్నారు. ఎపిలోని చారిత్రక కట్టడాలు, ప్రకృతి అందాలను వెండితెరపై చూపించడం ద్వారా రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు తేవచ్చని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా భారతీయ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాన్ని 100 బిలియన్ల స్థాయికి చేర్చడంలో ఎపి తన వంతు సహకారం అందిస్తుందని, రాష్ట్రాన్ని సృజనాత్మక రంగానికి కేంద్రంగా మారుస్తూ "ఆంధ్రా వ్యాలీ"గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.

# ఉద్భవ్‌కు అంతా సిద్ధం: ఏర్పాట్లు పరిశీలించిన గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి

**విజయవాడ, నవంబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్స్ స్కూల్స్ జాతీయ సాంస్కృతిక, సాహిత్య, కళా ఉత్సవ్.. ఉద్భవ్ 2025కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది. డిసెంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు జరగనున్న ఈ పోటీలకు వేదికైన గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కెఎల్ యూనివర్సిటీలో ఏర్పాట్లను గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.మల్లికార్జున నాయక్, ఎపిటిడబ్ల్యూఆర్ఇఐఎస్(గురుకులం) కార్యదర్శి ఎం.గౌతమితో కలిసి పరిశీలించారు. ప్రారంభ, ముగింపు వేడుకలు జరిగే వేదికల పనులతో పాటు పోటీలు జరిగే ఆడిటోరియంలు, విద్యార్థులకు వసతి గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వేదికలను పరిశీలించిన అనంతరం కె.ఎల్ యూనివర్సిటీ ప్రాగంణంలోని జాస్మిన్ ఆడిటోరియంలో విద్యార్థులు, అధికారులకు కల్పించే వసతి, రవాణా, పోటీల నిర్వహణ, ప్రోటోకాల్, మీడియా కమిటీలతో చర్చించి ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని కమిటీలు పూర్తి సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సమీక్షా సమావేశం అనంతరం ఉద్భవ్2025కి సంబంధించిన ప్రోమోను మల్లికార్జున నాయక్ విడుదల చేశారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ విద్యార్థుల నైపుణ్యాలను తెలియజేస్తూ ఉద్భవ్2025 పోటీల ప్రాముఖ్యతను తెలియజెప్పేలా ప్రోమో ఉందని ఆయన కొనియాడారు. ఈ సమావేశంలో నేషనల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ కుమది కష్వాహా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## శ్రీవారిసేవలో సుజయానిధి తీర్థస్వామి



**తిరుమల,నవంబరు 30ప్రభాతవార్తప్రతినిధి:** భగవంతుని నామస్మరణతోనే అంతా శుభాలు కలుగుతాయని ములబాగల్ శ్రీపాదరాజమఠం పీఠాధిపతి 1008 సుజయానిధి తీర్థస్వామి తెలిపారు. ఆదివారం ఉదయం శిష్యులతో కలిసి ఆలయం వద్దకు విచ్చేసిన స్వామివారికి టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం ఆలయ మర్యాదలతో మహాద్వారం వద్ద స్వాగతం పలికారు. స్వామి ఆలయంలోపలకు చేరుకుని తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఇఒ సింఘాల్ ,ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ బాలసుబ్రమణ్యం, గురురాజారావు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## భగవంతుని ఆశీస్సులు పొందడం ఆనందం

### శ్రీవారి సేవలో తమిళనాడు గవర్నర్ రవి



**తిరుమల,నవంబరు 30ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు పొందడంతో ఆనందంగా ఉందని తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి తెలిపారు. దేవుని కరుణాకటాక్షాలు అందరిపై కలగాలని వేడుకున్నట్లు తెలిపారు. గవర్నర్ రవి దంపతులు ఆదివారం ఉదయం ఆలయంలోనికి చేరుకున్నారు. విఐపి బ్రేక్ దర్శన సమయంలో టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి ,ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం తిరుమలలో ఓ నూతన అతిధిగృహాన్ని ఆయన ప్రారంభించారు.

## అందరిపై శ్రీవారి ఆశీస్సులుండాలి



**తిరుమల,నవంబరు 30ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు అందరిపై ఉండా లని స్వామివారిని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు.ఆదివారం ఉదయం తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి దంపతులు, సినీనిర్మాత అంబికా కృష్ణ, నటుడు రఘు ఆలయంలోనికి చేరుకుని వేర్వేరుగా శ్రీవారిదర్శనం చేసుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## 4న కార్తీకపర్వదీపోత్సవం

### సహస్ర దీపాలంకార సేవ, గరుడసేవ రద్దు



**తిరుమల,నవంబరు 30ప్రభాతవార్తప్రతినిధి:** కొండల రాయుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో డిసెంబర్ 4వతేదీ గురువారం సాలకట్ల కార్తీక పర్వదీపోత్సవం నిర్వహిస్తారు. కార్తీకపౌర్ణమిరోజు సాయంకాలం కైంకర్యాలు ,నివేదనలు పూర్తయిన తరువాత ఈ దీపోత్సవం జరిపించడం పరిపాటి. సాయంత్రం నేతి ఒత్తులతో దీపాలు వెలిగించి ఛత్రచామర, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా విమా నప్రదక్షణచేస్తూ ఆనందనిలయంలో శ్రీవారికి హారతి ఇస్తారు. ఆ తరువాత వరుసగా గర్భాలయంలో అఖండం, కులశేఖరపడి, రాములవారిమేడ, ద్వారపాలకులు, గరుడాళ్వారు, వరదరాజస్వామి సన్నిధి, వకుళ మాత,బంగారుబావి, కల్యాణమండపం, ఇలా వరుసగా వెండివాకిలి, ధ్వజస్తంభం, మహాద్వారం వరకు ఆలయంలోపల దీపాలు వెలిగిస్తారు. ఆలయం వెలుపల బేడి ఆంజనేయస్వామి ఆలయం, వరాహస్వామి ఆలయం, పుష్కరిణి వద్ద దీపాలను ఏర్పాటుచేస్తారు. ఎంతో పవిత్రంగా ఈ దీపోత్సవం నిర్వహిస్తారు. ఆరోజు సాయంత్రం తిరుమలలో జరిగే సహస్రదీపాలంకారసేవ, పౌర్ణమి గరుడసేవ రద్దయ్యాయి. **3న కపిలతీర్థంలో కృత్తికాదీపోత్సవం:** తిరుపతిలోని శైవాలయం కపిలతీర్థంలో డిసెంబర్ 3వతేదీ కృత్తికాదీపోత్సవం జరగనుంది. కృత్తికానక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో సాయంత్రం దీపారాధన, కృత్తికా దీపోత్సవం నిర్వహిస్తారు.ఆలయ శిఖరంపై దీపారాదన చేపడతారు.

## బాలాజీ ఆరోగ్యవరప్రసాదినికి రూ.50లక్షలు విరాళం



**తిరుమల,నవంబరు 30ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న ట్రస్టులు, పథకాలకు దాతలు తమవంతుగా భారీ విరాళాలందిస్తున్నారు. ఆదివారం సాయంత్రం ముంబైకి చెందిన జీన్ బొమ్మాన్జీ దుబాష్ ఛారిటీట్రస్ట్ బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని పథకానికి 50లక్షలు విరాళం అందించారు. ఈ విరాళాల డిడిని ట్రస్ట్ సిఎఫ్ఒ చంద్రశేఖర్ కృష్ణమూర్తి ఆలయ అధికారులకు అందజేశారు.

# ఒక హిడ్మాను చంపితే వందమంది పుట్టుకొస్తారు!

## తిరుమల పరకామణి కేసులో భూమన, వైవిపై క్రిమినల్ కేసులు పెట్టాలి: సిపిఐ నారాయణ సంచలన వ్యాఖ్యలు



**తిరుచానూరు,నవంబరు 30ప్రభాతవార్త:** ఒక హిడ్మాను చంపితే వంద మంది హిడ్మాలు పుడతారని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఐబొమ్మలో తాను కూడా సినిమాలు ఉచితంగా చూశానని అన్నారు. ఆరేడువందలు పెట్టి ఎలా సినిమా చూసేది అని చూశానని, అద్భుతమైన తెలివితేటలు ఉన్న రవి అలా మారడానికి వ్యవస్థలు కారణమని పేర్కొన్నారు. వ్యవస్థలో లోపాలు సరిదిద్దకుండా ఎంటే ఎలాంటి రవిలు పుట్టుకువస్తారని అన్నారు. ఆదివారం బైరాగిపట్టెలోని సిపిఐ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. దేవునికి భక్తులు సమర్పించే కానుకలు చోరీ చేసిన నిందితుడు రవికుమార్‌కు అన్ని రకాలుగా మద్దతు తెలిపి అరెస్ట్ చేయకుండా, లోక్‌అదాలత్‌లో రాజీచేసుకోవడం వెనుక మాజీ ఛైర్మన్లు భూమన కరుణాకర్‌రెడ్డి, వైవి సుబ్బారెడ్డిలపై క్రిమినల్ కేసులుపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. లోకాయుక్తలో కేసును రాజీచేసిన వైసిపి నేతలు భూమన, వైవిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆగ్రహం వెలిబుచ్చారు. పరకామణి కేసువిచారణను తక్షణమే పూర్తిచేసి నిందితులను శిక్షించాలని డిమాండ్‌చేశారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ఆడుకుంటారా,ఈ కేసును రాజీచేసిందెవరు,అసలు దొంగతనంలో ఎందుకు రాజీచేశారని నారాయణ ప్రశ్నించారు. తప్పులన్నీ చేసి అబద్ధపు సాక్ష్యాలు ,సిఐడి విచారణలో అబద్దాలు చెబుతున్నారని మండిపడ్డారు.భూమన చెప్పే నీతివాక్యాలు ఎవరూ నమ్మరని అన్నారు. పరకామణి కేసులో మాజీ ఏవిఎస్ఒ సతీశ్‌కుమార్ అనుమానాస్పద మృతి వెనుక వైసిపి నేతల హస్తం ఉందని తాము అనుమానిస్తున్నామని నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. పరకా మణి కేసు మళ్ళీ విచారణ చేయాలని హైకోర్టు న్యాయస్థానం సిఐడిని ఆదేశించడం ప్రశంసనీయమని అన్నారు.

# ఎపిలోనూ 'ఎస్ఐఆర్' చేపట్టాలి

## ఎంపి శ్రీకృష్ణదేవరాయలు

**విజయవాడ నవంబరు 30,ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)ను స్వాగతిస్తున్నట్లు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. ఏపీలోనూ ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టాలన్నారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నేతృత్వంలో అఖిలపక్ష భేటీ జరిగింది. సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని విపక్షపార్టీలకు కేంద్రం విజ్ఞప్తి చేసింది. అఖిలపక్ష భేటీ అనంతరం శ్రీకృష్ణదేవరాయలు మీడియాతో మాట్లాడారు. కృష్ణా జలాల పంపిణీలో గందరగోళం వల్ల ఏపీ నష్టపోతోందని, దీనిపై పార్లమెంట్ సమావేశాల్లో చర్చించాలని కోరినట్లు చెప్పారు.ఇక రాష్ట్రంలోని కీలక సమస్యలన్నింటిని పార్లమెంటులో ప్రస్తావిస్తామన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు,ఇతర అంశాలపై తమ వాణి విన్పిస్తామన్నారు.

వార్త


కృతజ్ఞత మూడు రూపాల్లో ఉంటుంది. అది గుర్తుంచుకోవడంలోనూ, మాటల వ్యక్తీకరణలోనూ, తిరిగి ఇవ్వడంలోనూ కనిపిస్తుంది.

-ఆర్ స్టీలీ

# మొక్కుబడి సదస్సు

ప్రతిఏటలాగే ఈసారి కూడా 'కాప్' సదస్సు ఎలాంటి ప్రాధాన్యత నిర్ణయాలు తీసుకోకుండానే ముగిసింది. బ్రెజిల్లో బెలెమ్లో ఐక్యరాజ్యసమితి నేతృత్వంలోకాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ 30వ సదస్సు జరిగింది. ఇంతవరకు జరిగిన 'కాప్' సదస్సులన్నిటిలో 2,3 తప్పితే చేసే ఏవిధమైన కీలక నిర్ణయాలు తీసుకోకుండానే మొక్కుబడిగా ముగిసాయి. 2030నాటికి శిలాజ ఇంధనాలపై ఆధారపడకుండా కాలుష్య ఉద్గారాలను తగ్గించుకునే క్రమంలో ఈ సదస్సులు జరుగుతున్నాయి. మితిమీరిన శిలాజ ఇంధన వినియోగం వల్ల ప్రపంచవ్యాప్తంగా వాయుకాలుష్యం బాగా పెరిగిపోవడమే ఇందుకు కారణం. పునరుత్పాదక శక్తిని మూడు రెట్లు పరిమాణానికి పెంచుకోవడమే లక్ష్యంగా జరిగే సదస్సులో 2015నాటి పారిస్ ఒప్పంద లక్ష్యాలపై ఆయా దేశాలు పురోగతిని చర్చించుకునేవారు.కానిమారిన దేశ కాలమాన పరిస్థితుల రీత్యా ఏదేశం ఏమేరకు లక్ష్య సాధనకు చేరిందో చూసి భవిష్యత్ ప్రణాళికలకు రూపొందించుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉద్గారాల విషయమై అమెరికా ఐరాస నిర్ణయాధికారాన్ని తోసిపుచ్చింది. ఆదిలో వాతావరణ ఒప్పందాల విషయంలో ఎంతో జాగరూకతతో వ్యవహరించిన అమెరికా రానురాను సదస్సు నిర్ణయాలను విభేదిస్తూ వచ్చింది. అందుకే శ్వేత సౌధాధినేత ట్రంప్ ఆఖరుకి ఈ యేడాది మొదట్లో తమ దేశం పారిస్ ఒడంబడికలు 2015నుంచి బయటకు వచ్చేస్తున్నట్లు ఇకపై జరిగే సదస్సుల నిర్ణయాలతో తమకేమీ సంబంధం లేదని ట్రంప్ స్వయంగా చెప్పారు. గ్రీన్హౌస్ గ్యాస్ ఉద్గారాల విషయమేకాదు ఆర్థిక సంబంధిత అంశాలపై కూడా ఇతర దేశాలన్నీ స్పందించాయి.గత సదస్సులోనే భారత్,సౌదీ అరేబియాలు కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. వర్ధమాన దేశాలకు బాగా నిధుల కొరత ఉంది. అభివృద్ధి చెందిన దేశాలతో వర్ధమాన దేశాలు చేతులు కలిపిందే అందుకే. సదస్సులోనూ, ప్రయోగాత్మకంగానూ ఎదురయ్యే సమస్యలను, సవాళ్లను ఎదుర్కోవడానికి ముందడుగు వేసేందుకు ఈసదస్సులోనే సహకరిస్తున్నాయి.వర్ధమాన దేశాలకు సదస్సు లక్ష్యాలను నెరవేర్చుకునేందుకు అవసరమైన నిధులు లేవు. అమెరికా తాను ఇప్పటివరకు నిధుల్లో తొలి విడత మాత్రమే ఇచ్చింది. తాజా పరిస్థితుల్ని బట్టి ఇక్కడ అమెరికా కూడా నిధులు ఆశించలేదు. ఇది మిగిలిన దేశాలకు కూడా అవకాశంగా మారుతుంది. సమష్టి కృషి నినాదంతో ఈ సదస్సు జరిగినా ఫలితం చెప్పుకోదగినది లేదనే చెప్పాలి. పారిస్వ్యాగాం అమలు, ఆచరణ క్రమంలో ప్రత్యేక దృష్టి సారించాలి. గ్లోబల్ క్లైమేట్ విషయంలో పర్యావరణ పరిరక్షణదర్శులు, క్లైమేట్ మార్పులపై తీసుకోదగిన చర్యలు చర్చించాల్సివుంది. చర్వితచర్వణంగా పారిస్ 2015 ఒడంబడిక్లలోని అంశాలనే చర్చించుకున్నాయి. వివిధదేశాల మధ్య ఐక్యత లోపించడం అంతకన్నా ముఖ్యంగా నిధుల లేమి గురించి చర్చలు సాగాయి. ప్రపంచ దేశాలు 1.5డిగ్రీల సెంటిగ్రేట్ ఉష్ణోగ్రతపెరుగుదలను నియంత్రించుకోవాల్సి ఉంది.శిలాజ ఇంధనాల వినియోగంలో కొన్నిసందేహాలకు నివృత్తిలేదు. భూగోళం వేడెక్కడానికి శిలాజ ఇంధన వాడకమేనన్నది తేటతెల్లమైనా కొన్ని వర్ధమాన దేశాలు ఈ విషయంలో ఒక స్థిరమైన అభిప్రాయానికి రాలేదు. శిలాజ ఇంధనాల విషయమై సదస్సు ద్వారా కాక బయటి నుంచే వివిధ దేశాలు నిర్ణయం తీసుకుంటారని ప్రకటించడం వల్ల దాని గురించి చర్చించేదేమీ లేకపోయింది. కాగా వచ్చే యేడాది ఏప్రిల్లో మరో సదస్సు జరగనుంది. ఆ సదస్సులో మరికొన్ని అంశాలమీద వివిధదేశాలు తమఅభిప్రాయాలు వ్యక్తం చేస్తాయి. వర్ధమాన దేశాలకు వాతావరణ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ఆర్థిక సహాయం పెంచే విషయంలో హామీ దొరలేదు. ప్రస్తుతం వివిధ దేశాలు సమకూర్చిన నిధులు 12వేల కోట్ల డాలర్లు. కాగా మరో 30 వేల కోట్లకు పెంచాలి. అలా జరిగితేనే వాతావరణ సంక్షోభం నుంచి గట్టెక్కే పరిస్థితి లేదు. సంపన్న దేశాలు తొలుత ఎంతో జోష్గా హామీలిచ్చినా తర్వాత నిధుల ప్రస్తావనలో పాల్గొనలేదు. ఇప్పుడు అమెరికా ధోరణి వలన రానున్న సదస్సు పర్యవసానం ఎలా ఉంటుందో చెప్పలేం. అభివృద్ధి దేశాల సహాయ నిరాకరణ వలన కర్బన ఉద్గారాలను తగ్గించడంలో ఎలాంటి పురోగతి లేదు. పైగా ప్రకృతి బీభత్సాలు అడవుల విధ్వంసం కార్చిచ్చులు కారణంగా వాతావరణ సమతుల్యత దెబ్బతింటోంది. శిలాజ ఇంధనాల సంగతేసరేసరి. ఇతరత్రా ప్రకృతి పరిహాసాలు దేశీయుల్ని నష్టపాలు చేస్తోంది. ఇప్పుడు సదస్సు అటవీ ప్రాంతంలో జరిగిన విషయం తెలిసిందే. సదస్సు వేదిక ఎంపికలో నిర్వాహకులు మంచి ఆలోచన చేసినట్లు భావించాలి. దీనితో అడవుల నిర్మూలన గురించి వాటి పర్యవసానాల గురించి 92 దేశాలకు తెలియ చెప్పడమే ఇది. ఉష్ణమండల అరణ్యాల రక్షణ విషయమై వివిధదేశాలకు తేటతెల్లం చేయాలన్న ఉద్దేశంతో బ్రెజిల్ ఏకంగా ఈ సదస్సును తమ దేశంలోని అటవీప్రాంతంలో సదస్సు నిర్వహించడంలోని ఔచిత్యమేమిటో దాదాపు సదస్సు దేశాలన్నీ అర్థం చేసుకున్నాయి. దీంతో నిర్వాహకుల లక్ష్యం నెరవేరినట్లే వాతావరణ మార్పుల నేపథ్యంలో వివిధ దేశాలు తమ ప్రణాళికలు, ఆచరణ ఎజెండా ప్రకటిస్తారని అనుకున్నా వారికి తాలూకు ఛాయలేవీ కనబడుటలేదు. అడవులు, మూలవాసుల రక్షణకు ఉష్ణమండల అరణ్యాలకోసం 2500కోట్ల డాలర్ల నిధిని ప్రతిపాదించినా 660 కోట్ల డాలర్లను పొందగలిగింది. వాతావరణ ప్రకృతి సంరక్షణ నిధుల నుంచి పది శాతం వినియోగించుకునేందుకు సదస్సు అంగీకరించింది. చెప్పాలంటే సదస్సు నిర్వాహకులు తమ లక్ష్యాన్ని ఎంతో కొంత సాధించుకున్నట్లే.

పనిని ఎందుకు తప్పుగా చేశారో తెలియచేయడానికి పట్టే కాలం కంటే ఆ పనిని సరిగ్గా చేయడానికి తక్కువ సమయం పడుతుంది.



లాంగ్‌ఫెలో

ఒకరితో స్నేహం చేసేటప్పుడు నెమ్మదిగా ప్రారంభించాలి.స్నేహం కలిసిన తర్వాత మరెన్నడూ విడిచిపెట్టకూడదు.



సోక్రటీస్

# ప్రజావాక్కు



## వరి ఎగుమతులపై వెనుకడుగు

**తెలంగాణలో** ఈ ఏడాది వరిఉత్పత్తి సుమారు 80 లక్షల మెట్రిక్ టన్నులు దాటింది. రైతులు భారీగా సాగు చేసి మంచి దిగుబడి సాధించినా,అంతర్జాతీయ మార్కెట్లో వరి ధరలు పడిపోవడంతోరాష్ట్రం ఎగుమతులపై నిర్ణయాత్మక అడుగు వేయలేకపోయింది. ఈ పరిస్థితి రైతుల ఆశలను దెబ్బతీసేలా మారింది.వరిఎగుమతులపై రాష్ట్ర ప్రభుత్వం గతంలోప్రత్యేక దృష్టిపెట్టినా, ఈసారి మార్కెట్ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ఆ నిర్ణయం నిలిచిపోయింది.ప్రపంచవ్యాప్తంగా బియ్యం ధరలు తగ్గటానికి ప్రధాన కారణాలు ఆసియాదేశాల్లో పెరిగిన దిగుబడులు, గ్లోబల్ డిమాండ్ తగ్గుదల, రవాణా ఖర్చుల్లో మార్పులు. ఈ ప్రభావం నేరుగా భారత రాష్ట్రాలకు, ముఖ్యంగా వరి ప్రధాన పంటగా ఉన్న తెలంగాణకు పడింది. లాభాలు తక్కువగా ఉండే అవకాశం ఉన్నప్పుడు ఎగుమతులు చేపట్టడం ఆర్థికపరంగా భారమవుతుందనే భావన ప్రభుత్వాన్ని వెనక్కి నడిపింది.ఇప్పటికే రైతు కష్టపడి పండించిన ధాన్యంమార్కెట్లో ధరఅందక ఆందోళన వ్యక్తమవుతోంది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## నిధులు పెంచాలి

**సుప్రీంకోర్టు** తీర్పు ప్రకారంఅంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ కు గ్రాట్యుటీ ఇవ్వాలి.45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసుల ప్రకారం కార్మికచట్టాల పరిధిలోకి తీసుకురావాలి. ప్రీ ప్రైమరీ పీఎంశ్రీ మొబైల్ అంగన్వాడీ సెంటర్స్ పేరుతో ఐసీడీఎస్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసే విధానాలను కేంద్రప్రభుత్వం అవలంబిస్తోంది. నాలుగు లేబర్ కోడ్‌లనురద్దుచేయాలని,అంగన్వాడీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి వారి హక్కుల సాధన, సమాన పనికిసమానవేతనంవంటిసమస్యలపైకేంద్రంస్పందించాలి

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## వ్యాక్సిన్లు ప్రమాదకరం

**వ్యాక్సిన్లు** ఉపయోగించడం ప్రమాదకరమని అమెరికాకు చెందిన ప్రముఖ ఫీజర్ ఫార్మాస్యూటికల్స్ కంపెనీ మాజీ వైస్ చాన్సలర్ మైఖేల్ యాడ్నీ పేర్కొన్నారు. మందులు వాడడం, వ్యాక్సిన్లు తీసుకోవడం ప్రమాదకరం. సరైన ఆహారం, వ్యాయామం, విశ్రాంతి నిజమైన మందులుఅని ప్రజలు గుర్తించాలి. జంక్ ఫుడ్ తక్కువగా తినాలి.

-పుట్లూరి రాం నర్సింహారెడ్డి, నల్లగొండ

## సంస్థలను నిందించడం భావ్యంకాదు

**ఎన్నికల** ఫలితాలు తమకు అనుకూలంగా రాకపోతే, ప్రతిపక్ష పార్టీలు ముఖ్యంగా కాంగ్రెస్ తక్షణం ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ సంస్థలను నిందించడం ఒక సులభ మార్గంగా తీసుకుంటున్నాయి. అయితే ఇండియా కూటమి కీలక నాయకుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ ఇచ్చిన సూచన ఈ సందర్భంలో ప్రత్యేకప్రాధాన్యం పొందుతోంది.బీహార్‌లో మహాకూటమి ఎదుర్కొన్నపరాజయాన్ని ఆయనస్పష్టంగా విశ్లేషిస్తూ, ఎన్నికల విజయానికి ప్రజాసంక్షేమ పనులు,సామాజిక ఐక్యత, స్పష్టమైనరాజకీయ సందేశం చివరి వరకూ నిర్వహణలో అంకితభావం అవసరమని చెప్పారు.బీహార్‌లో మహాకూటమి చేసిన తప్పులు స్పష్టంగా కనిపించాయి. ముఖ్యమంత్రి అభ్యర్థిపై ఆలస్యం, భాగస్వామ్య పక్షాల మధ్య పోటీ, అసమన్వయం, బలహీన ప్రచారం. ఓటరుకు ఒకే సందేశం అందించడంలో, ఒకే దిశగా పనిచేయడంలో విఫలమవడం వారి పెద్ద వైఫల్యం. ప్రతిపక్షం ఎన్నికల ముందు మాత్రమే చురుకుదనం చూపడం ప్రజలకునమ్మకాన్ని కలిగించదు.నిరంతరం ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించడం, ప్రత్యామ్నాయాలను చూపించడం, ప్రజా సమస్యలపై కేంద్రీకృత ధోరణి చూపించడం ప్రతిపక్ష ధర్మం.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## వికలాంగులకు న్యాయం చేయాలి

**వికలాంగులకు** అన్యాయం జరిగి ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేసిన ప్రభుత్వ కార్యాలయంలో ఉన్న పెండింగ్ దరఖాస్తులు 3 డిసెంబర్ 2025 ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా పరిష్కారం చేయాలి.రెవిన్యూ డిపార్ట్మెంట్‌లో వికలాంగుల ఇండ్ల స్థలాల కబ్జాలు, వికలాంగులకు సంబంధించి అప్పులివ్వాలి.2016వికలాంగులచట్టంఅమలుచేయాలి.ప్రభుత్వ కార్యాలయంలోకూడా వికలాంగుల దినోత్సవం నిర్వహించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

## రైళ్ల సంఖ్యను పెంచాలి

**చాలా** రూట్‌లలోపగటిపూట రైళ్లు అంతంతమాత్రమే ఉన్నాయి. ప్రతి సామాన్యుడు రైలుప్రయాణం కోరుకుంటున్నాడు. ప్రయాణికులకు తగ్గట్టు పగటి పూట రైళ్లు లేకపోవడం శోచనీయం. మనకు స్వాతంత్ర్యం సిద్ధించి ఏళ్లు గడుస్తున్నా ఇంకా అరకొర రైళ్లుఉండటం విస్మయం కలిగిస్తుంది. రైలుమార్గం ఉన్న రూట్‌లలో పగటిపూట పలురైళ్లను నడుపుటకు చర్యలు తీసుకోవాలి. కనీసం పలు రైళ్లను ఆ మార్గం గుండా మళ్లించాలి.

- షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# స్వచ్ఛమైన గాలి 'తెర' తీయలేరా?

*నగరంలోని 16పర్యవేక్షణ కేంద్రాల మధ్య400కన్నా ఎక్కువ ఎంక్యూఐ నమోదైంది. ఒక చోటైనా గాలి చలనం సరిగ్గా లేదు. పైగా శీతాకాలం గాలి నాణ్యత ప్రమాదకరస్థాయిలోకి చేరిపోయింది. ఢిల్లీ ప్రజలు శుద్ధమైన ప్రాణవాయువును,స్వచ్ఛమైన గాలిని కోరుకోవడమే తప్పా! అనేపరిస్థితి చర్చనీయాంశంగా ఉంది. పంటలు పండించి అన్నప్రసాదాన్ని అందిస్తున్నాడుకదా! అని పద్ధతికివిరుద్ధంగా పంటవ్యర్థాలు తగలబెడుతుంటే చూస్తూ ఊరుకోగలమా? అన్న సుప్రీం ధర్మాసనమే తాజాగా కాలుష్య నివారణకు ఇతరత్రా విధానాలపై సమీక్షిద్దాం. అని విశేషంగా యోచిస్తోంది.యేటా చలికాలం రాగానే ఈ వాయుకాలుష్యం నగరప్రజలపై విషం చిమ్ముటాన్ని ఎవరూ హర్షించడంలేదు.తాము అనారోగ్యంతో కునారిల్లాల్సిందేనా?అని నిట్టూర్పుల మాత్రమే వినబడుతున్నాయి.కేవలం ఢిల్లీలో విద్యుత్ వాహనాలు ప్రవేశపెట్టడం వల్లనో, పంటవ్యర్థాల దహనంపై నిషేధం విధించడం వల్లనో ఢిల్లీ కాలుష్యానికి పరిష్కారం దొరుతుందని చెప్పలేం.*

వరిగొండ కాశీవిశ్వేశ్వర రావు

అత్యంత నివాస యోగ్యమైన టాప్ 100 నగరాల్లో ఢిల్లీ 54వ స్థానంలో ఉండి,మౌలిక వనరులకు సంబంధించి ఇక చూసుకోనక్కర్లేని నగరంగా వాసికెక్కింది. 2026 ప్రపంచ ఉత్తమ నగరాల ఎంపికలో జరిపిన అధ్యయన నివేదికలో రాజధానికి ఆ రకమైన ఖ్యాతి దక్కింది. అన్నీ బాగుండినా అయిదోతనమే తక్కువన్నట్లు ఢిల్లీని కాలుష్యం కమ్మేసి అక్కడ నివాసితులకు మతిస్థిమితం లేకుండా చేస్తోంది. నిన్నగాక మొన్న ఢిల్లీకాలుష్యాన్ని తగ్గించాలంటూ ఢిల్లీలోని ఇండియా గేట్‌వద్ద జననిరసన వ్యక్తంచేశారు. ఇదేమి నిన్నో ఇవాళో పుట్టుకొచ్చిన సమస్యకాదు. దశాబ్దాల తరబడి ఉన్నదే.పాలకులు ఎన్ని చేసినా కాలుష్యకాసారాలు రాజధానిని వదిలిపెట్టడం లేదు. ఎంక్యూఐ నాలుగువందలు దాటిపోతోంది. ఢిల్లీ కాలుష్యం తగ్గించే విషయంలో పాలకులు చేయని ప్రయత్నంలేదు. అప్రయత్నంగా దేశ అత్యున్నత ధర్మాసనం కూడా తమ జోక్యంవల్ల ఢిల్లీ కాలుష్యానికి అడ్డుకట్ట పడుతుందేమోనని భావించింది. అంతర్జాతీయ కాలుష్య బృందాలు, సుప్రీం నియమించిన అమికస్ క్యూరీలు ఎన్నో నివేదికలిచ్చినా అవేమీ కాలుష్య నివారణకు పనికి రాలేదు. చివరికి సుప్రీం కోర్టు కూడా కాలుష్య నియంత్రణకు చట్టాలకు అందని పరిష్కారంగా గురించి, ప్రత్యామ్నాయలు ఆలోచించాలని నిర్ణయించింది. ఢిల్లీ కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు 2019లో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సిఎపి) ద్వారా విశ్వప్రయత్నం చేసినా ఫలితం సున్నా. తక్కువ కాలుష్య నగరాలకు ఈ పథకం లక్ష్యాలకు లోబడి భారీగా కేటాయించారు. యథావిధిగా నిధులు ఖర్చుయిపోయినా ఫలితం దక్కలేదన్నది నిర్వివాదాంశం. తాజా పరిస్థితులే ఆ అంశాన్ని తెలుపు తున్నాయి. కేంద్ర పర్యావరణ, అటవీ,వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ చేపట్టిన ఈ కార్యక్రమంతో 2024 నాటికి వాయు నాణ్యతా సూచిక అమలులో కాలుష్య రేణువుల పి.ఎం 20 నుంచి 30 శాతానికి తగ్గించే ప్రయత్నం. గాలిలో పెరిగిన వాయు కాలుష్య రేణువులు పీల్చినప్పుడు లేదా శోషణ కలిగినప్పుడు ప్రజలెవరికైనా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులెదురౌతాయి. ఇప్పుడు ఢిల్లీలో జరిగిందిదే. అతిపెద్ద సంఖ్యలో శ్వాసకోశరోగులు ఆసుపత్రుల పాలయ్యారు. ఘన, ద్రవ, కాలుష్య అణువులు ప్రమాదస్థాయిలో గాలిలోకి చేరిపోయి తేలియాడుతున్నాయి. పర్టిక్యులేట్ మేటర్ 10 సురక్షిత స్థాయిని దాటిఉంది. ఇదే సమయంలో దేశంలోని 131నగరాలో ఈ బాపతు కాలుష్యాన్ని నియంత్రించేందుకు నిధులిచ్చినా వాటిని రోడ్డుమీద దుమ్ము తొలగించడానికి మాత్రమే వినియోగించారు. అప్పట్లోనే ఈరకమైన కాలుష్యాని కన్నా అతి ప్రమాదకారి పంట వ్యర్థాలే నని మరో నిర్ధారణకొచ్చారు. బయోమాస్‌గా పేర్కొనబడే పంట వ్యర్థాల విషయంలో రైతాంగం తమ బాధ్యతను విస్మరిస్తున్నారనే ఆందోళన కూడా ప్రధానంగా పాలకుల దృష్టికి వచ్చింది. ఢిల్లీ పరిసర ప్రాంతాల్లోని ఇతర రాష్ట్ర ప్రాంతాలు హర్యానా, పంజాబ్ వంటి రాష్ట్రాలో పంటల సాగు పూర్తయ్యాక పంట వ్యర్థాలను చేలోనే తగలబెట్టడం ఆనవాయితీ. దానివలనే ఢిల్లీకాలుష్యం పెరిగిపోతోందన్న ఏకైక ఆలోచనతో పాలకులు చేపట్టిన కార్యాచరణలో భాగంగా అలా చేలోపంట వ్యర్థాలను తగలబెట్టిన భారీ మొత్తాల్లో జరిమానాలువేశారు. అయినా వారిని కట్టడిచేసే వ్యవస్థను రూపొందించలేకపోయారు. చేలో దహనాల నివారణకు దాదాపు 15 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం వ్యయపరిచినా, కనీస స్థాయిలో కూడా వాటిని నిర్మూలించలేకపోయారు. ఉత్తరాది రాష్ట్రాలలో రైతులు తమ చేలలో పంట మార్పిడి వలన పంట వ్యర్థాల స్థాయి తగ్గించడానికి వీలవుతుందని



భావించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ సంస్థ చైర్ ప్రొఫెసర్ సూచనల మేరకు అలాంటి ప్రయత్నామూ జరిగింది. ఆ ప్రాంతంలోని భారీ పరిశ్రమలు సైతం కాలుష్యనివారణ నిబంధనలు పాటించడంలో విఫలమయ్యాయి. ప్రపంచంలోని అత్యంత కాలుష్యనగరాల్లో ఢిల్లీ ఇప్పటికే తనస్థానం నుంచి తప్పుకోలేకపోయింది. కేవలం ఢిల్లీ వంటి ప్రధాన నగరాలు,పారిశ్రామిక నగరాలు,జల,వాయు, ధ్వని కాలుష్యాలలో ఏమాత్రం స్వచ్ఛతస్థాయిని దక్కించుకోలేని పరిస్థితుల్లో ప్రపంచకాలుష్య భరిత దేశాలలోఇండియా ఐదో స్థానాన్ని చేరుకుంది. ఇటీవలనే 'క్లౌడ్‌బరస్' ప్రక్రియ కోసం కోట్లు వెచ్చించినా కనీస ఫలితాలను కూడా రాబట్టలేకపోయింది. ప్రపంచంలోనే కాలుష్య ఉద్గారాలను 45 శాతం తగ్గించుకునే ప్రయత్నంలో ఉన్న భారతదేశం హరిత ఇంధనాల వినియోగాన్ని పెంచుకునేందుకు ఎన్నో నిర్ణయాలు తీసుకోవడంలో ముందుంది. అయినా ఢిల్లీకాలుష్యాన్ని లొంగదీసుకునే ఏ ప్రణాళికను జయప్రదం చేసుకోలేకపోతోంది. ఇక్కడ గాలికాలుష్యం ప్రజల ఆయుర్దాయం, ఆరోగ్యంపై తీవ్రప్రభావం చూపిస్తోంది. ఈ మధ్య వార్తల్నిబట్టి అక్టోబరు నెలలో ఢిల్లీ ఎన్‌సిఆర్ ప్రాంతంలోని 80 శాతం ఇళ్లల్లోకి విషపు గాలిసోకిందని సమాచారం.తాజాగా స్పోర్ట్స్ యాక్టివిటీస్ మీదనిషేధం విధిస్తూ సుప్రీంకోర్టు ఆదేశించింది. ఢిల్లీ స్కూల్స్ చలికాలంలో ఎక్కువస్థాయిలో స్పోర్ట్స్ మీట్స్ నిర్వహించడం ఆనవాయితీ. కాలుష్యం పెరిగిన రీత్యా నవంబరు, డిసెంబరు నెలల్లో వాటిని నిర్వహించడాన్ని నిషేధించినట్లు ఢిల్లీలోని అన్ని స్కూళ్లకు ఉత్తర్వులు పంపింది. గాలి ప్రాణాంతకంగా మారిన పరిస్థితులుమెండుగా కన్పిస్తున్నందున ప్రభుత్వ ఉద్యోగులకు కూడా రోజు విడిచి రోజు కార్యాలయాల్లో విధి నిర్వహణకు రావాలని, మిగిలిన రోజుల్లో ఇంటి నుంచే పనులు నిర్వహించాలనే వెసులుబాటునిచ్చింది. ఒకపక్క కాలుష్యం మరో పక్క పొగమంచు ఢిల్లీ ప్రజల్ని వేధిస్తున్నాయి. గత యేడాది ఇదే నెలలో పంట వ్యర్థాలు దహనం చేయడంతో ఎగసిపడిన మంటల నుంచి కాలుష్య రేణువులు జనాన్ని చిరాకుపెట్టాయి. ఉత్తరాది రాష్ట్రాలలో పంట వ్యర్థాలదహనం నిరాఘాటంగా సాగుతాయనడంలో అతిశయోక్తి లేదు. రైతులెవరూ ఇలాంటి వాటివిషయంలో వచ్చిన హెచ్చరికలేమీ లక్ష్యపెట్టరు. జరిమానాలకు, కేసులకు భయపడరు. వారికి కావలసింది ఇస్తేతప్ప మాటవినే పరిస్థితి లేదు.రైతాంగానికి కావలసిందేమిటి? అవన్నీ సమకూర్చినా కాలుష్య నివారణకు తగు హామీలుకానీ భరోసాలు కానీ ఇవ్వలేని పరిస్థితి ఉంది. అప్పట్లోపంట దహనాలకుతోడు దీపావళి బాణసంచా కాల్చడంవలన ఏర్పడిన దహన వ్యర్థాలు అవశేషాలు కూడా ప్రమాదకారకమే. ఆ సమయంలో ఢిల్లీతోసహా ఏడునగరాల్లో కాలుష్యస్థాయి ఘనమీటర్‌కు 500 మైక్రో గ్రాముల స్థాయికి పెరిగిపోయింది. మళ్లీ ఈయేడాది అదే సమయంలో ఇప్పుడూపరిస్థితులు చేయిదాటి పోకుండా జాగ్రత్త పడాలన్నా పాలకులకు తోచడంలేదు. మన అవస్థలుచూసి ఇటీవలనే చైనావారు మనకు బాసటగా ఉంటామని, కాలుష్య నియంత్రణలో చైనా అనుభవాలు ఇండియాకు పనికి వస్తాయని ప్రతిపాదించింది. ఉత్తరాది రాష్ట్రాలను ప్రధాని సంప్రదించి ఇందుకు వారు సహకారం తీసుకోవాలని పాండిచ్చేరి మాజీ గవర్నర్ కిరణ్‌బేడీ విజ్ఞప్తిచేశారు. భగవత్ సంకల్పిత, మానవ ప్రేరేపిత పరిస్థితులను ఏమేరకు సరిచేయగలమన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఢిల్లీలో మాస్కులు, ఎయిర్ ప్యూరిఫైయర్‌ల వినియోగం ఎక్కువగానే ఉంది. ప్రస్తుత వాతావరణ కాలుష్యాన్ని కేంద్ర కాలుష్యనియంత్రణ మండలి 'వెరీపూర్' కేటగిరి కింద వర్గీకరించింది.నగరంలోని 16పర్యవేక్షణ కేంద్రాల మధ్య400కన్నా ఎక్కువ ఎంక్యూఐ నమోదైంది. ఒక చోటైనా గాలి చలనం సరిగ్గా లేదు. పైగా శీతాకాలం గాలి నాణ్యత ప్రమాదకరస్థాయిలోకి చేరిపోయింది. ఢిల్లీ ప్రజలు శుద్ధమైన ప్రాణవాయువును, స్వచ్ఛమైన గాలిని కోరుకోవడమే తప్పా! అనేపరిస్థితి చర్చనీయాంశంగా ఉంది. పంటలు పండించి అన్నప్రసాదాన్ని అందిస్తున్నాడు కదా!అని పద్ధతికివిరుద్ధంగా పంటవ్యర్థాలు తగలబెడుతుంటే చూస్తూ ఊరుకోగలమా?అన్న సుప్రీం ధర్మాసనమే తాజాగా కాలుష్య నివారణకు ఇతరత్రా విధానాలపై సమీక్షిద్దాం.అని విశేషంగా యోచిస్తోంది. యేటా చలికాలం రాగానే ఈ వాయుకాలుష్యం నగర ప్రజలపై విషం చిమ్ముటాన్ని ఎవరూ హర్షించడం లేదు. తాము అనారోగ్యంతో కునారిల్లాల్సిందేనా? అని నిట్టూర్పులు మాత్రమే వినబడుతున్నాయి.కేవలం ఢిల్లీలో విద్యుత్ వాహనాలు ప్రవేశపెట్టడం వల్లనో, పంట వ్యర్థాల దహనంపై నిషేధం విధించడం వల్లనో ఢిల్లీ కాలుష్యానికి పరిష్కారం దొరుతుందని చెప్పలేం. ●

# రిటైర్మెంట్ బకాయిల చెల్లింపులు ఎప్పుడు?



మేకిరి దామోదర్

ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య వారధులుగా పనిచేసిన ఉద్యోగులే నేడు అదే ప్రభుత్వాల నిర్లక్ష్యానికి బలవుతున్నారు. మూడు నుంచి నాలుగు దశాబ్దాల పాటు సేవలందించి పదవీ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు చట్టబద్ధంగా రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇప్పటికీ అందకపోవడం రాష్ట్ర పాలనను ప్రశ్నార్థకంగా నిలిపింది.2024 మార్చి నుంచి పదవీ విరమణ చేసిన సుమారు 14 వేల మందికిపైగా పెన్షనర్లకు సంబంధించిన బకాయిలు నెలల తరబడి నిలిచిపోవడం కేవలంపరిపాలనా లోపం కాదు! మానవీయ వైఫల్యం. ఉద్యోగి రిటైర్ అయిన రోజు ప్రభుత్వం అతడిని గౌరవంగా ఇంటికి సాగనంపాలి.ఆ సమయంలో ఇవ్వాల్సిన గ్రాట్యుటీ, కమ్యూటేషన్, టీఎస్‌జీఎల్ఐ, జీపీఎఫ్, లీవ్ ఎన్‌కాష్‌మెంట్ వంటి మొత్తాలు ఉద్యోగి ప్రభుత్వాల దయాదాక్షిణ్యాల మీద ఇచ్చేవి కావు. తన జీవన కాలంలో నెలనెలా జీతం నుంచి మినహాయించుకున్న సొమ్మే. అవి ఆలస్యం కావడం అంటే? వృద్ధాప్యంలో పెన్షనర్లను మనోవేదనకు గురి చేయడమే. పెన్షనర్ అనగానే ఈ దేశంలో ఇప్పటికీ 'భారం' అన్న దృక్కోణం ఉంది. కానీ వాస్తవంగా చెప్పాలంటే ప్రభుత్వ వ్యవస్థను నిలబెట్టిన వేర్లు పెన్షనర్లే. పాఠశాలల్లో విద్యాబోధన నుంచి రెవెన్యూ కార్యాలయాల వరకు, పోలీస్ స్టేషన్ల నుంచి జిల్లా పరిపాలన వరకు, వ్యవస్థలను నడిపించిన వారు పదవీ విరమణ అనంతరం మాత్రం పరాయి వారిగా మారుతున్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఆలస్యం కావడం కారణంగా వృద్ధ పెన్షనర్లు అప్పుల ఒత్తిళ్లలో చిక్కుకుంటున్నారు. ఇంటి అవసరాల కోసం, వైద్య చికిత్స కోసం, పిల్లల భవిష్యత్తు కోసం ఆశించిన సొమ్ము రాకపోవడంతో బ్యాంకుల ఈఎంఐలు, ప్రైవేట్ అప్పుదారుల వేధింపులు భరించలేమనే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ మానసిక వేదన చివరకు ప్రాణాంతకంగా మారి ఇప్పటివరకు సుమారు 26 మంది పెన్షనర్లు మరణించారన్న విషయం సమాజాన్ని కలచివేసే అంశం.ఇన్ని జరు




గుతున్నా ప్రభుత్వం మౌనంగా ఉండటం అమానవీయం. ఎన్నికల ముందు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఇచ్చిన హామీలను గుర్తు చేసుకోవడానికైనా పాలకులు సిద్ధంగా లేనట్లే కనిపిస్తోంది. 'ఆర్థిక లోటు' అన్న ఒకే ఒక వాదన పెన్షనర్ల హక్కులపై దాడి చేసే ఆయుధంగా మారింది. ఆశ్చర్యకరమేమంటే - సేవ పేరుతో రాజకీయాలకు వచ్చి ఒక్కొక్కరు రెండు మూడు పెన్షన్లు తీసుకుంటున్న వారి వేతనాలు, అలవెన్సులు, అధికార విలాసాలకు ఈ ఆర్థిక లోటు అడ్డు రావడం లేదు. పెన్షనర్లు ప్రజాస్వామ్య పద్ధతిలోనే తమ గోడును వినిపించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మంత్రులు, ముఖ్యమంత్రి కార్యాలయానికి వినతిపత్రాలు అందించారు. 'సమస్య వాస్తవమే, పరిష్కరించాల్సిందే" అనే మాటలు వినిపించాయి. కానీ చర్యలు మాత్రం కనిపించలేదు. చివరకు హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో నిర్వహించిన ధర్నాలో వేలాది వృద్ధ పెన్షనర్ల గుండెల్లోని బాధ రోడ్డుమీదకు వచ్చింది. మా బకాయిలనుఇవ్వండి మమ్మల్ని చంపవద్దు' అన్న ప్లకార్డులు ఈ రాష్ట్ర ప్రజాపాలనకు అద్దం పట్టాయి.ప్రజాస్వామ్యంలో పోరాడలేని వృద్ధుల సమస్యలకు స్వరంఇవ్వాల్సిన బాధ్యత మీడియా పై ఉంది. కానీ పెన్షనర్ల విషయంలో ఆ బాధ్యత ఎక్కడో తప్పిపోయింది. ఇది వ్యవస్థల వైఫల్యం కాకపోతే మరేమిటి? తమ వైకల్యాన్ని సైతం లెక్కచేయకుండా ప్రభుత్వానికి వినతులు సమర్పించినా స్పందన లేకపోవడం పాలకుల నిర్లక్ష్యాన్ని మరింత స్పష్టం చేస్తోంది. పెన్షనర్లు అడుగుతున్నది దానం కాదు. వారి శ్రమకు లభించే న్యాయమైన హక్కు మాత్రమే. ప్రజాస్వామ్యంలో పాలకులు గుర్తుంచుకోవలసిన మూల సూత్రం ఇదే. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఆలస్యం అనేది ఒక ఆర్థిక నిర్ణయం కాదు,ఒక మానవతా పరీక్ష.పాలకులే తాము చెప్పుకున్నట్టుగా తల్లిదండ్రులపట్ల బాధ్యతను గుర్తిస్తే, జీవితాంతం ప్రభుత్వానికి సేవ చేసిన పెన్షనర్లు కూడా తల్లిదండ్రులాంటి వారేనని గుర్తించాలి. ఇకనైనా ప్రభుత్వం చొరవ తీసుకొని పెండింగ్‌లోఉన్న రిటైర్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి.మరింత ఆలస్యం జరిగితే జరిగే నష్టానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సిఉంటుంది. ప్రజాస్వామ్యంలో హక్కుల కోసం వృద్ధులు రోడ్ల మీద నిలబడాల్సి వస్తే, అదిపాలన ఓటమి. ఆ ఓటమిని ఒప్పుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందా!.లేదంటే? ఇప్పటికైనా మానవీయ నిర్ణయం తీసుకొని పెన్షనర్ల కన్నీళ్లకు ముగింపు పలకాలి. ●

# బయోబ్యాంకింగ్ జన్యు శాస్త్రంలో ముందడుగు

డా. కృష్ణ కుమార్ వేపకొమ్మ

ఆరోగ్య రంగంలో వేగంగా జరుగుతున్న మార్పుల నేపథ్యంలో, 'బయోబ్యాంక్' అనే భావన వైద్య రంగంలో కొత్త ప్రాధాన్యం సంతరించుకుంది. మనుషుల నుంచి సేకరించే రక్తం, కణాలు వంటి జీవ నమూనాలను భద్రపరచి, వాటికి సంబంధించిన వ్యాధుల కారణాలు, జన్యు ప్రభావాలు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను అర్థం చేసుకోవడానికి వినియోగించడం ఇప్పుడు పరిశోధనలో ఒకముఖ్య భాగంగా మారింది. 1996లో స్టెఫెన్ లాఫ్ట్ హెన్రిక్ పొల్సెన్ 'బయోబ్యాంక్' అనే పదాన్ని పరిచయం చేసిన తర్వాత, ఈ రంగం ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ నేపథ్యంలో భారత్ కూడా తన జన్యు వైవిధ్యాన్ని శాస్త్రీయ పరిశోధన కోసం వినియోగించేందుకు కీలకమైన అడుగు వేసింది. ఫీనోమ్ ఇండియా నేషనల్ బయోబ్యాంక్ దేశంలోని వివిధ ప్రాంతాలు, సమాజాలు, సాంస్కృతిక నేపథ్యాలు, జీవనశైలి అలవాట్లు, సామాజిక-ఆర్థిక పరిస్థితులను ప్రతిబింబించే జన్యు, ఆరోగ్య డేటాను సేకరిస్తోంది. యుకే బయోబ్యాంక్ నమూనాను భారత ఆరోగ్య అవసరాలకు సరిపోయేలా మార్చుకొని, దేశవ్యాప్తంగా 10,000 మంది నుంచి నమూనాలు సేకరించే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్ కొనసాగుతోంది. ఈ డేటా ద్వారా భారతీయుల ఆరోగ్య ప్రత్యేకతలు, వ్యాధుల ప్రమాదాలు, వాటి వెనుక ఉన్న జన్యు-పర్యావరణ ప్రభావాలపై మరింత స్పష్టమైన గణాంకపరమైన అవగాహన లభిస్తోంది. భారత జనాభాలో కనిపించే ఆరోగ్య నమూనాలు ఎన్నాళ్లుగానో అంతర్జాతీయ పరిశోధకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. తక్కువ బరువులోనే మధుమేహం రావడం, హృద్రోగాలు తక్కువ వయస్సులోనే కనిపించడం, ఒకే వ్యాధి వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు రీతుల్లో కనిపించడం వంటి విషయాలకు ఇంకా స్పష్టమైన శాస్త్రీయ కారణాలు పూర్తిగా బయటపడలేదు. ఈ నేపథ్యంలో, జాతీయ బయోబ్యాంక్ సేకరిస్తున్న దీర్ఘకాలిక డేటా జన్యు పర్యావరణ కారకాలు కలిసి ఆరోగ్యంపై ఎలా ప్రభావం చూపుతాయో అర్థం చేసుకోవడంలోసహాయపడుతోంది. క్యాన్సర్, హృద్రోగాలు, మధుమేహం,అరుదైన జన్యు రుగ్మ



తల పరిశోధనలో బయోబ్యాంక్‌లు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. సిఆర్‌ఐఎస్‌పిఆర్ ఆధారిత జీన్ థెరపీలు, అలాగే కృత్రిమ మేధస్సు ఆధారిత నిర్ధారణ మోడళ్లకు కావాల్సిన పెద్ద పరిమాణంలో జన్యుడేటాను ఇవే అందిస్తాయి. కొవిడ్-19 చేపట్టిన జీనోమ్ సీక్వెన్సింగ్ భారత శాస్త్రీయ సామర్థ్యాన్ని స్పష్టంగా చూపించింది. ఇదే విధంగా, ఇప్పుడు అభివృద్ధి చెందుతున్న నేషనల్ బయోబ్యాంక్ భవిష్యత్ వైద్య పరిశోధనలు, ఖచ్చితమైన నిర్ధారణ పద్ధతులు కొత్త చికిత్సా ఆవిష్కరణలకు ఒక స్థిరమైన ఆధారంగా నిలుస్తోంది.బయోబ్యాంకింగ్ వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, గోప్యత నైతికతకు సంబంధించిన సవాళ్లు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ 2023 వ్యక్తిగత డేటా రక్షణకు ఒక ప్రాథమిక వ్యవస్థను అందించినా, జెనోమిక్ డేటా వంటి అత్యంత సున్నితమైన సమాచారానికి అవసరమైన ప్రత్యేక మార్గదర్శకాలు ఇంకా పూర్తిగా రూపుదిద్దుకోలేదు.అంతర్జాతీయ పరిశోధనల కోసం డేటాను పంచుకునే సమయంలో పారదర్శకత చాలాముఖ్యం.ఎందుకంటే బీమా సంస్థలు లేదా ఉద్యోగదాతలు ఈ సమాచారాన్ని దుర్వినియోగం చేసే ప్రమాదం కూడా ఉంది. ఈ నేపథ్యంలో ప్రజల నమ్మకాన్ని కాపాడేందుకు కమ్యూనిటీ భాగస్వామ్యం, అలాగే డేటా ఎలా ఉపయోగించబడుతుందో స్పష్టంగా వివరించడం అత్యవసరం. హైదరాబాద్‌లో ఇటీవల ప్రారంభమైన భారత తొలి జంతు స్టెమ్‌సెల్ బయోబ్యాంక్ దేశం బయోటెక్నాలజీ రంగంలో ఒక ముఖ్యమైన ముందడుగు. ఈ కేంద్రాన్ని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ నిర్వహిస్తోంది. వివిధ జంతు జాతుల నుంచి స్టెమ్ సెల్స్‌ను సేకరించి భద్రపరచడం ద్వారా వెటర్నరీ వైద్యం, కల్చర్డ్ మీట్ పరిశోధనలు, జీవవైవిధ్య సంరక్షణ, వ్యాధి నమూనాల అధ్యయనాలకు ఇది అవసరమైన ఆధారాలను అందిస్తోంది. ఇలాంటి సదుపాయాలు పెరగడం వల్ల భారతదేశంలో ఆరోగ్య పరిశోధనలు భవిష్యత్ చికిత్సా విధానాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. ఖచ్చితమైన నిర్ధారణలు, వ్యక్తిగతీకరించిన చికిత్సలు వ్యాధులను ముందుగానే గుర్తించే పద్ధతులు ఇవి అన్నీ బయోబ్యాంక్‌ల ద్వారా లభించే సమాచారంతో వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. శాస్త్రీయ బాధ్యత, నైతికత, గోప్యత ప్రజల విశ్వాసం బలంగా కొనసాగితే, బయోబ్యాంకింగ్ భారత ఆరోగ్య వ్యవస్థకు దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించే ఒక ప్రధాన శక్తిగా నిలుస్తుంది. ●

# జన్‌జడ్ సంకల్పం వికసిత్ భారత్‌కు కీలకం

## వివిధరంగాల్లో యువత అద్భుత ప్రతిభ..
## ఎంతో స్ఫూర్తినిచ్చిన నవంబరు నెల: మన్‌కీబాత్‌లో ప్రధాని మోడీ




**న్యూఢిల్లీ, నవంబరు 30:** ఇస్రో డ్రోన్ కాంపిటీషన్‌లో జెన్‌జడ్ యువత కనబరిచిన పట్టుదల నేటి యువతరానికి మరింత స్ఫూర్తి అని ప్రధాని నరేంద్రమోడీ వ్యాఖ్యానించారు. అంగారక గ్రహంలో ఎదురయ్యే పరిస్థితుల్లో పనిచేయగలిగే డ్రోన్స్ కోసం ఇస్రో ఈ కాంపిటీషన్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా ఒక టీమ్‌కు పలు మార్లు ఎదురుదెబ్బలు తగిలినా లెక్కచేయక పట్టుదలగా ప్రయత్నించిందని ప్రధాని మోదీ ప్రశంసించారు.ఆదివారం ప్రధాని నరేంద్రమోడీ 123వ మన్‌కీబాత్‌లో జెన్‌జడ్ సంకల్పం వికసిత్‌భారత్‌కు కీలకమని అన్నారు. 'గాల్లోకి లేచిన డ్రోన్స్ కొంతసేపటి వరకూ స్థిరంగా ఉండేవి. ఆ తరువాత కింద పడిపోయేవి. వాటికి జీపీఎస్ సపోర్టు లేకపోవడంతో ఇలా జరిగేది. అంగారక గ్రహంపై జీపీఎస్ ఉండదు. కాబట్టి అవి కేవలం కెమెరా, ఇన్‌బిల్ట్ సాఫ్ట్‌వేర్ సాయంతో ల్యాండింగ్ చేయాల్సి వచ్చింది' అని ఆయన వివరించారు. ఇలా పలుమార్లు ఎదురుదెబ్బలు తగిలినా తట్టుకుని నిలబడ్డ పుణే టీమ్ ఒకటి చివరకు పోటీలో విజేతగా నిలిచిందని ప్రధాని తెలిపారు. వికసిత్ భారత దేశానికి యువత పట్టుదలే అతిపెద్ద బలమని ప్రధాని వ్యాఖ్యానించారు. యువత దృఢ చిత్తం, పోరాటపటిమకు దేశ ప్రగతి ప్రతిబింబమని అన్నారు. 11 ఏళ్లలో విజ్ఞానం, క్రీడలు, సామాజిక సేవ, సంస్కృతి వంటి వివిధ రంగాల్లో యువత అద్భుతమైన ప్రతిభ కనబరిచారని ప్రధాని ప్రశంసించారు. కష్టతరమైన వాటిని కూడా భారత్ సాధిస్తోందని చెప్పారు. స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి సంస్కరణలతో భారత యువత వికసిత్ భారత్ కలను సాకారం చేస్తారని తాను బలంగా విశ్వసిస్తున్నట్లు ప్రధాని చెప్పారు. కొన్ని రోజుల క్రితం సోషల్ మీడియాలోని ఓ వీడియో తన దృష్టిని ఆకర్షించిందని ప్రధాని చెప్పారు. అంగారక గ్రహంపై ఉన్న వాతావరణ పరిస్థితులను కృత్రిమంగా రూపొందించిన చోట డ్రోన్లను ఎగరవేయడానికి మన యువత ప్రయత్నించారని అన్నారు. జీపీఎస్ మద్దతు లేక డ్రోన్‌లు నేల కూలుతున్నప్పటికీ పుణెకు చెందిన విద్యార్థుల బృందం పట్టుదలతో పలుమార్లు యత్నించి డ్రోన్లు కొంత సమయం ఎగిరేలా చేసినట్లు వెల్లడించారు. యువతలో ఉన్న ఇలాంటి గొప్ప సంకల్పబలమే దేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చేందుకు తోడ్పడుతుందన్నారు. నవంబర్ నెలలో దేశంలో వెలుగుచూసిన ఎన్నో అంశాలు తనకు స్ఫూర్తినిచ్చాయని ప్రధాని మోడీ చెప్పారు. జాతిని జాగృతం చేసిన వందేమాతరం గీతం రచించి నవంబర్‌లో 150 ఏళ్ల పూర్తయిన సందర్భాన్ని ప్రధాని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో ఇంజన్ మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్ (ఎమ్ఆర్ఓ) కేంద్రం కూడా ఓ మైలురాయి అని వ్యాఖ్యానించారు. మాహే నౌకను నావికా దళంలో ప్రవేశపెట్టడం, స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్ ప్రారంభం కావడం భారతీయ సృజనాత్మకతకు, యువత శక్తికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. గత పదేళ్లల్లో ధాన్యం ఉత్పత్తి 100 మిలియన్ టన్నుల నుంచి 357 మిలియన్ టన్నులకు పెరగడం వ్యవసాయ రంగంలో ఒక మైలురాయి అని అభివర్ణించారు. కామన్‌వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వనున్న భారత్ క్రీడా రంగంలో తన సత్తా ప్రపంచవ్యాప్తం చేస్తోందని అన్నారు. మనసులో పట్టుదల, వైఫల్యాలను తట్టుకుని నిలబడగలిగే ధైర్యం ఉంటే విజయం తప్పక సాధిస్తామని ప్రధాని తెలిపారు. పరిశోధన రంగంలో భారత్ దూసుకుపోతున్న దని ప్రధాని అన్నారు. ప్రపంచంలో ఏదైనా సాధించే సత్తా భారత్‌కు ఉందని చెప్పారు. మన యువత అసమాన శక్తి, బలమైన సంకల్పంతో దేశ అభివృద్ధి పథంలో నడిపిస్తోందని పేర్కొన్నారు. భారత క్రీడా రంగానికి గడచిన నెల ఒక సూపర్ హిట్ నెలగా నిలిచిపోయిందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అభివర్ణించారు. అంతర్జాతీయ క్రీడా పోటీలలో భారత క్రీడాకారులు సాధించిన అద్భుత విజయాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. క్రికెట్ నుంచి కబడ్డీ, బాక్సింగ్ వరకు వివిధ రంగాల్లో మన అథ్లెట్లు దేశానికి గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. భారత క్రీడా రంగం పరంగా ఈ నెల ఒక సూపర్ హిట్‌గా నిలిచింది. ఐసీసీ మహిళల ప్రపంచ కప్ గెలవడంతో ఈ నెల ప్రారంభమైంది. ఆ తర్వాత కూడా క్రీడా మైదానాల్లో మన వాళ్ల జోరు కొనసాగింది. కొద్ది రోజుల క్రితం టోక్యోలో జరిగిన డెఫ్లింపిక్స్‌లో భారత క్రీడాకారులు 20 పతకాలు సాధించి, ఇప్పటివరకు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారన్నారు. భారత మహిళా కబడ్డీ జట్టు ప్రపంచ కప్‌ను కైవసం చేసుకోవడంపై ప్రధాని హర్షం వ్యక్తంచేశారు. టోర్నమెంట్ ఆరంభం నుంచి చివరి వరకు ఆధిపత్యం ప్రదర్శించిన మన అమ్మాయిలు, గ్రూప్ స్టేజ్‌లోని అన్ని మ్యాచ్‌లలో విజయం సాధించారు. సెమీ ఫైనల్‌లో ఇరాన్‌పై 33-21 స్కోరుతో గెలిచి ఫైనల్‌కు దూసుకెళ్లారు. తుదిపోరులో చైనీస్ తైపీ జట్టును 35-28 తేడాతో ఓడించి విశ్వ విజేతగా నిలిచారు. మన మహిళా క్రీడాకారులు కబడ్డీ ప్రపంచ కప్ గెలిచి చరిత్ర సృష్టించారు. టోర్నమెంట్ అంతటా వారి అద్భుతమైన ప్రదర్శన ప్రతి భారతీయుడి హృదయాన్ని గెలుచుకుందని మోదీ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ, గ్రేటర్ నోయిడాలో జరిగిన వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లోనూ భారత బాక్సర్లు పతకాల పంట పండించారు. ఈ టోర్నమెంట్‌లో మనక్రీడాకారులు మొత్తం 20పతకాలు సాధించారు.ఇందులో తొమ్మిదిస్వర్ణాలు, ఆరు రజతాలు, ఐదు కాంస్య పతకాలు ఉన్నాయి. ఈ విజయాలన్నింటిలోనూ అంధుల మహిళా క్రికెట్ జట్టు సాధించిన ప్రపంచ కప్ విజయం అత్యంత ప్రత్యేకమైనదని ప్రధాని మోడీ అభివర్ణించారు. టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా అజేయంగా నిలిచి కప్ గెలవడం వారి అసామాన్య ప్రతిభకు నిదర్శనమని అన్నారు.

## నేషనల్ హెరాల్డ్ కేసులో
# సోనియా, రాహుల్‌కు మరిన్ని చిక్కులు



**న్యూఢిల్లీ, నవంబరు 30:** నేషనల్ హెరాల్డ్ మనీ లాండరింగ్ కేసులో కాంగ్రెస్ సీనియర్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి చిక్కులు మరింత పెరిగాయి. వీరిద్దరిపై క్రిమినల్ కుట్ర ఆరోపణలతో ఢిల్లీ పోలీసుల ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ) తాజాగా ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో మొత్తం ఆరుగురు వ్యక్తులు, మూడు కంపెనీలను నిందితులుగా చేర్చారు. గాంధీలతో పాటు శామ్ పిట్రోడా, మరో ముగ్గురు వ్యక్తుల పేర్లను కూడా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. వీరితో పాటు అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్), యంగ్ ఇండియన్, డోటెక్స్ మర్చండైజ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలపైనా కేసు నమోదైంది. నేషనల్ హెరాల్డ్ పత్రిక మాతృ సంస్థ అయిన ఏజేఎల్‌ను మోసపూరితంగా చేజిక్కించుకునేందుకు క్రిమినల్ కుట్ర పన్నారన్నది ప్రధాన ఆరోపణ. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అందించిన దర్యాప్తు నివేదిక ఆధారంగా అక్టోబర్ 3న ఈ ఎఫ్ఐఆర్ దాఖలైంది. కోల్‌కతాకు చెందిన డోటెక్స్ అనే షెల్ కంపెనీ నుంచి యంగ్ ఇండియన్ సంస్థకు రూ. కోటి అందిందని, ఈ నిధులతో కాంగ్రెస్ పార్టీకి రూ. 50 లక్షలు చెల్లించి, సుమారు రూ. 2,000 కోట్ల విలువైన ఏజేఎల్ ఆస్తులను యంగ్ ఇండియన్ నియంత్రణలోకి తీసుకుందని ఎఫ్ఐఆర్‌లో ఆరోపించారు. యంగ్ ఇండియన్‌లో సోనియా, రాహుల్ గాంధీలకు 76 శాతం వాటాలు ఉన్నాయి. 2012లో బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి దాఖలు చేసిన పిటిషన్‌తో ఈ కేసు మొదలైంది. అయితే, ఏజేఎల్ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ రూ. 90 కోట్ల రుణం ఇచ్చిందని, ఆ అప్పును తిరిగి చెల్లించలేకపోవడంతో దానిని ఈక్విటీగా మార్చి లాభాపేక్ష లేని సంస్థ అయిన యంగ్ ఇండియన్‌కు బదిలీ చేశామని కాంగ్రెస్ పార్టీ వాదిస్తోంది. ఈ కేసులో ఢిల్లీ కోర్టు తీర్పును డిసెంబర్ 16కు వాయిదా వేసిన మరుసటి రోజే ఈ కొత్త ఎఫ్ఐఆర్ విషయం వెలుగులోకి రావడం గమనార్హం.

# టిఆర్‌పి కోసం రూ.100 కోట్ల లంచాలా?
## కేరళ టివి ఛానెల్‌పై రేటింగ్స్ కుంభకోణం



**తిరువనంతపురం, నవంబరు 30:** కేరళ మీడియా రంగంలో టీవీ చానల్ తమ రేటింగ్స్‌ను కృత్రిమంగా పెంచుకునేందుకు ఏకంగా రూ.100 కోట్లు లంచం ఇచ్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ మొత్తాన్ని బ్రాడ్‌కాస్ట్ ఆడియెన్స్ రీసెర్చ్ కౌన్సిల్ (బార్క్) ఉద్యోగికి క్రిప్టో కరెన్సీ రూపంలో చెల్లించినట్లు ట్వంటీఫోర్ న్యూస్ అనే మరో చానల్ సంచలన కథనాన్ని ప్రసారం చేసింది. ఈ కథనం ప్రకారం ప్రేమ్‌నాథ్ అనే బార్క్ ఉద్యోగికి చెందిన ట్రస్ట్ వాలెట్ అనే మొబైల్ యాప్‌లోకి, ఆరోపణలు ఎదుర్కొంటున్న చానల్ యాజమాన్యం యూఎస్డీటీ (టెదర్) అనే క్రిప్టో కరెన్సీలో విడతల వారీగా రూ.100 కోట్లు పంపినట్లు తెలిసింది. ఇందుకు ప్రతిగా ప్రేమ్‌నాథ్ ఏయే ప్రాంతాల్లో, ఏయే ఇళ్లలో రేటింగ్ మీటర్లు అమర్చారో పిన్‌కోడ్‌లతో సహా కీలక సమాచారాన్ని ఆ చానల్‌కు వారం ముందుగానే అందించేవాడని ట్వంటీఫోర్ న్యూస్ ఆరోపించింది. దీనికి సంబంధించిన వాట్సాప్ చాట్స్, చెల్లింపుల స్క్రీన్‌షాట్లను కూడా బయటపెట్టింది. అయితే ఈ ఆరోపణలను సదరు చానల్ ఖండించింది. స్థానిక కేబుల్ ఆపరేటర్ తమ చానల్‌ను ల్యాండింగ్ పేజ్‌గా (సెట్‌టాప్ బాక్స్ ఆన్ చేయగానే వచ్చే చానల్) పెట్టడం వల్లే రేటింగ్స్ పెరిగాయని ఓ ప్రకటనలో తెలిపింది. కానీ, ఆ కేబుల్ ఆపరేటర్‌కు కేవలం 20 వేల కనెక్షన్లు మాత్రమే ఉన్నాయని, 85 లక్షల కనెక్షన్లు ఉన్న రాష్ట్రంలో ఇంత తక్కువ మంది చూడటం వల్ల రేటింగ్స్ ఎలా పెరుగుతాయని ఇతర చానళ్లు ప్రశ్నిస్తున్నాయి. ప్రకటనల ఆదాయం కోసం టీవీ చానళ్లు బార్క్ రేటింగ్స్‌పైనే ఆధారపడతాయి. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. ఈ కుంభకోణంపై కేరళ టెలివిజన్ ఫెడరేషన్ (కేటీఎఫ్) ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు ఫిర్యాదు చేసింది. మరోవైపు బార్క్ కూడా ఈ ఆరోపణలపై ఓ స్వతంత్ర ఏజెన్సీతో ఫోరెన్సిక్ ఆడిట్‌కు ఆదేశాలు జారీ చేసింది.

# వరకట్నమా! పెళ్లి పేరిట వాణిజ్యమా?
## ఆందోళన వ్యక్తం చేసిన 'సుప్రీం' ధర్మాసనం



**న్యూఢిల్లీ, నవంబరు 30:** వరకట్నాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎంతో పవిత్రమైన వివాహ వ్యవస్థ వరకట్నంతో వాణిజ్య సాధనంగా మారిపోయిందని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. పరస్పర విశ్వాసం, సహవాసం, నమ్మకం, గౌరవాలపై నిర్మితమైన ఈ ఆదర్శ వ్యవస్థ ఇటీవలి కాలంలో వాణిజ్య లావాదేవీగా మారిపోవడం విచారకరమని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్. ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం పేర్కొంది. పెళ్లైన నాలుగు నెలలకే భార్యకు విషమిచ్చి చంపిన భర్తకు అలహాబాద్ హైకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని సుప్రీంకోర్టు ఆక్షేపించింది. భర్త విపరీత పోకడ, నేర తీవ్రత, బాధితురాలి వాంగ్మూలాన్ని హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదని మండిపడింది. వరకట్న మరణం కేవలం ఒక వ్యక్తిపై మాత్రమే కాకుండా సమాజం మొత్తంపై జరిగిన నేరం. స్వచ్ఛంద కానుకలు, బహుమతుల పేరుతో ఇచ్చే వరకట్నం సామాజిక హోదాను ప్రదర్శించుకునే ప్రయత్నం, వస్తు వ్యామోహాన్ని తృప్తిపరిచే తాపత్రయం. వరకట్నం సామాజిక దురాచారం. వివాహ పవిత్రతను ఇది భ్రష్టు పట్టించి, మహిళల్ని అణచివేతకు గురిచేస్తోంది. మరింత క్రూరంగా మారి నవ వధువుల అకాల మరణానికి కారణమవుతుంది. కేవలం వ్యక్తిగత విషాదమే కాదు, సమాజ ఉమ్మడి అంతరాత్మకు అవమానం. ఎటువంటి తప్పు చేయకున్నా గొంతెమ్మ కోరికలు తీర్చలేని ఒకే ఒక్క కారణంతో అత్తింటిలో కోడలి జీవితం బలైపోతోంది. మానవ గౌరవ మూలాలపై ఇది ఘోరమైన నేరం. సమానత్వం, గౌరవప్రదంగా జీవించే అవకాశం కల్పించే రాజ్యాంగంలో ఆర్టికల్ 14, 21 కల్పించిన హక్కులను ఇది హరిస్తోంది. సమాజ కూర్పును క్షీణింపజేసి, నాగరిక సమాజ పునాదుల్ని బలహీనపరుస్తోంది. న్యాయవ్యవస్థ ఇలాంటివాటిని ఉపేక్షించి వదిలిపెడితే నేరాలు చేసేవారికి ధైర్యం ఇచ్చినట్టువుతుంది. న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం సడలించినట్లవుతుంది కాబట్టి చట్టం నమ్మకం, గౌరవాన్ని నిలబెట్టడానికి న్యాయవ్యవస్థ స్పందన బలంగా ఉండాలి. ఈ కేసులో న్యాయంతో పాటు వరకట్న దురాచారాలను చట్టం, సమాజం అంగీకరించవని నిర్ద్వంద్వంగా సందేశం ఇవ్వాల్సిన బాధ్యత ఉంది. ఆందోళనకర రీతిలో వరకట్న మరణాలు పెరుగుతున్న తరుణంలో న్యాయసమీక్ష కఠినంగా ఉండాలి. నేరాలకు పాల్పడినవారిని స్వేచ్ఛగా వదిలేస్తే సెక్షన్ 304బీ, 498ఏ లక్ష్యమే నీరుగారి పోతుందని వ్యాఖ్యానించింది.

# 'సర్' గడువు 7రోజులు పొడిగింపు
## ఇసి తాజా నిర్ణయం

**న్యూఢిల్లీ, నవంబరు 30:** దేశవ్యాప్తంగా 9 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఏడు రోజులు పొడిగిస్తూ భారత ఎన్నికల కమిషన్ (ఇసి) నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆదివారం ఇసి అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఓటర్లు తమ వివరాలను తనిఖీ చేసుకునేందుకు, అప్‌డేట్ చేసుకునేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో ముసాయిదా ఎన్నికల జాబితా డిసెంబర్ 9వ తేదీకి బదులుగా డిసెంబర్ 16న విడుదల అవుతుంది. తుది ఓటర్ల జాబితా 2026 ఫిబ్రవరి 7వ తేదీకి బదులుగా ఫిబ్రవరి 14న విడుదలవుతుంది. ప్రస్తుతం ఎస్ఐఆర్ రెండో దశ అండమాన్ నికోబార్ ఐలాండ్స్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్‌లో జరుగుతోంది. తొలి విడత ఎస్ఐఆర్ బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు సెప్టెంబర్‌లో పూర్తయింది. ఎన్నికల జాబితా ఎస్ఐఆర్ రివైజ్డ్ షెడ్యూల్ ప్రకారం, ఎన్యూమరేషన్ పీరియడ్ డిసెంబర్ 11వ తేదీకి మారింది. రేషనలైజేషన్, రీ అరేంజ్‌మెంట్ ఆఫ్ పోలింగ్‌స్టేషన్స్ గడువు డిసెంబర్ 11వ తేదీ వరకూ ఉంటుంది. కంట్రోల్ టేబుల్ అప్డేషన్, ముసాయిదా జాబితా ప్రక్రియ డిసెంబర్ 12-15 వరకూ జరుగుతుంది. ముసాయిదా ఓటర్ల జాబితా డిసెంబర్ 16న ప్రచురితమవుతుంది. క్లెయిమ్స్, అభ్యంతరాల ప్రకటనకు డిసెంబర్ 16 నుంచి 2026 జనవరి 15వ తేదీ వరకూ గడువు ఉంటుంది. నోటీస్ ఫేజ్ డిసెంబర్ 16 నుంచి 2026 ఫిబ్రవరి 7 వరకూ ఉంటుంది. ఫిబ్రవరి 14న తుదిజాబితా విడుదల కానుంది.



## కాలిఫోర్నియాలో పుట్టినరోజు వేడుకల్లో కాల్పుల కలకలం
# నలుగురు మృతి,మరో 10 మందికి గాయాలు

**స్టాక్‌టన్, నవంబరు 30:** కాలిఫోర్నియాలోని స్టాక్‌టన్‌లో ఓ బాంక్వెట్‌హాల్‌లో ఓ కుటుంబం పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్న సమయంలో అకస్మాత్తుగా కాల్పుల సంఘటన చోటు చేసుకోగా నలుగురు వ్యక్తులు మృతి చెందగా మరో 10 మందికి గాయాలయ్యాయని షెరిఫ్స్ అధికారులు శనివారం తెలిపారు. ఈ సంఘటనలో మరణించిన వారిలో పెద్దలతో పాటు పిల్లలు కూడా ఉన్నారని శాన్‌జాక్విన్ కౌంటీ షెరిఫ్స్ కార్యాలయం అధికార ప్రతినిధి హీతర్ బ్రెంట్ వివరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుట్టిన రోజు వేడుకలు జరుగుతుండగా కాల్పులు సంఘటన ఉద్దేశపూర్వకంగా జరిపిందనే సూచనలు కనిపిస్తున్నాయని అన్నారు. కాల్పులు జరిపిన వ్యక్తి ఇప్పటివరకు పట్టుబడలేదని, అధికారులు అనుమానితుడిని గుర్తించేపనిలోనే ఉన్నారని స్థానిక అధికారులు తెలిపారు.

# సాధుగ్రామ్ కోసం మహావృక్షాలు నరికేస్తారా..
## కుంభ్‌మేళా నిర్వాకంపై నటుడు సాయాజి షిండే నిరసన




**నాసిక్, నవంబరు 30:** నాసిక్‌లో 2027లో జరగనున్న కుంభమేళా ఏర్పాట్ల కోసం గోదావరి నది ఒడ్డున సుమారు 1,825 చెట్లను నరికివేయాలన్న ప్రభుత్వ నిర్ణయం తీవ్ర వివాదానికి దారితీసింది. పర్యావరణవేత్తలు, స్థానిక పౌరులు ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. స్థానికంగా మొదలైన ఈ ఉద్యమానికి ప్రముఖ నటుడు, పర్యావరణ ప్రేమికుడు సాయాజీ షిండే మద్దతు పలకడంతో ఇది మరింత విస్తృతమైంది. 2027 కుంభమేళా కోసం మహారాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ. 3,700 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందులో భాగంగా సాధువులు, సంతుల బస కోసం తపోవన్ ప్రాంతంలో 'సాధుగ్రామ్' నిర్మించనున్నారు. దీని కోసమే పాత, దృఢమైన దేశీయ వృక్షాలను తొలగించాలని నగరపాలక సంస్థ నిర్ణయించింది. ఈ పనులను ఉత్తరప్రదేశ్‌లో జరిగిన కుంభమేళాకు దీటుగా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నిర్ణయంపై స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. నటుడు సాయాజీ షిండే స్వయంగా ఆ ప్రాంతాన్ని సందర్శించి, నిరసనకారులకు తన మద్దతు తెలిపారు. ఇప్పటికే దాదాపు ఏడు లక్షల మొక్కలు నాటిన సాయాజీ షిండే, ప్రభుత్వ మొక్కల పెంపకం కార్యక్రమాలను గతంలోనూ ప్రశ్నించారు. చెట్లను నరికేస్తున్న ప్రాంతానికి 'తపోవనం' అని పేరు ఉండటం గమనార్హం. ఇలాంటి పవిత్ర ప్రదేశంలోనే చెట్లను కూల్చడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగరపాలక సంస్థ తీరుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సాధుగ్రామ్ నిర్మించ తలపెట్టిన ప్రాంతం 'నోడెవలప్‌మెంట్ జోన్' పరిధిలోకి వస్తుందని, అభివృద్ధి ప్రణాళికలో మార్పులు చేయకుండానే పనులు చేపట్టారని ఆరోపణలు వస్తున్నాయి. నరకడానికి గుర్తించిన చెట్లలో కొన్నింటిని గతంలో నగరపాలక సంస్థే నాటినట్లు నిరసన కారులు ఆధారాలతో సహా బయటపెట్టారు. గంటల వ్యవధిలోనే దాదాపు 3,000 మంది ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా సంతకాలు చేయడంతో నగరపాలక సంస్థ ఒకింత వెనక్కి తగ్గింది. నరికే చెట్ల సంఖ్యను తగ్గిస్తామని చెబుతున్నా, కొత్త మొక్కలు నాటుతామన్న హామీని పర్యావరణవేత్తలు విశ్వసించడం లేదు. ఈ చెట్లు నగర ప్రజల ఉమ్మడి ఆస్తి అని, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వాటిని కాపాడుకోవాలని వారు వాదిస్తున్నారు.



## పాదరక్షల దుకాణంలో అగ్నిప్రమాదం: అన్నాచెల్లెలు సహా నలుగురు మృతి

**న్యూఢిల్లీ,నవంబరు 30:** దేశ రాజధాని ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దక్షిణ ఢిల్లీలోని టిగ్రీ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో ఈ దుర్ఘటనలో అన్నాచెల్లెలు సహా నలుగురు ప్రాణాలు కోల్పోగా, మరో మహిళ గాయపడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాలుగంతస్తుల భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న బూట్ల దుకాణంలో సాయంత్రం 6:24 గంటలకు మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే, అప్పటికే భవనం మొత్తం మంటల్లో చిక్కుకుంది. బూట్ల దుకాణంలో మొదలైన మంటలు వేగంగా పై అంతస్తులకు వ్యాపించినట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు మహిళలను పోలీసులు రక్షించి ఆసుపత్రికి తరలించగా, వారిలో ఒకరు చికిత్స పొందుతూ మరణించారు.

# 2080 నాటికి భారత్ జనాభా 190 కోట్లు..
## ఇండియా అసోసియేషన్ ఫర్‌ది స్టడీ ఆఫ్ పాపులేషన్ నివేదిక



**న్యూఢిల్లీ, నవంబరు 30:** భారత్‌లో జనాభా 2080 నాటికి సుమారు 180 నుంచి 190 కోట్లకు పెరుగుతుందని ఇండియన్ అసోసియేషన్ ఫర్ ది స్టడీ ఆఫ్ పాపులేషన్ ఐఎఎస్‌పి తెలిపింది. దేశంలో జననాల రేటు గణనీయంగా తగ్గడమే ఇందుకు కారణమని ఐఎఎస్పీ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇండియాలో 2000 ఏడాదిలో 3.5గా ఉన్న సంతానోత్పత్తి రేటు , రెండు దశాబ్దాల కాలంలో గణనీయంగా తగ్గి 2.1కిపడిపోయిందని ఐఏఎస్పీ పేర్కొంది. దీంతో దేశంలో జననాలు తగ్గిపోవడం సహా జనాభా పెరుగుదల నెమ్మదించిందని ఐఏఎస్పీ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్రన్ వివరించారు. భారత దేశ జనాభా 2080 నాటికి 180 నుంచి 190 కోట్లకు చేరుకుని, అక్కడే స్థిరపడే అవకాశముంది. దేశ జనాభా 200 కోట్లకంటే తక్కువగా ఉంటుందని తాజా అధ్యయనాలు కూడా అంచనా వేస్తున్నాయి. అభివృద్ధి, విద్య స్థాయిలు పెరగడమే సంతానోత్పత్తి తగ్గుదలకు ప్రధాన కారణం. ముఖ్యంగా మహిళలు అక్షరాస్యులు అవడంతో చిన్న కుటుంబాలు ఏర్పడుతున్నాయని చంద్రన్ చెప్పారు. జనాభా పెరుగుదల పట్ల ప్రజల్లో అవగాహన రావడంతో జననాల్ని విస్తృతంగా నియంత్రించగల్గుతున్నారని అనిల్ చంద్రన్ తెలిపారు. నిరక్షరాస్యులైన కొందరు మహిళల కుటుంబాలు ఇప్పటికీ ముగ్గురు లేదా అంతకుమించి సంతానాన్ని పొందుతున్నా యన్నారు. కానీ విద్యావంతులైన కుటుంబాల్లో ఈ రేటు 1.51.8కి పరిమితమైందని స్పష్టం చేశారాయన. కేరళ రాష్ట్రంలో 1987-89 మధ్య టీఎఫ్ఆర్ 2.1ఉండగా ప్రస్తుతం 1.5కి తగ్గిందని పేర్కొన్నారు. అలాగే పశ్చిమ్ బెంగాల్ లోనూ 2013లో 1.7నుంచి 2023నాటికి 1.3కిపతమైనదని ఆ రాష్ట్ర శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ గణాంకాలను వివరించారు. దీంతో బెంగాల్ ఇప్పుడు దేశంలోనే అత్యల్ప టీఎఫ్ఆర్ కలిగి ఉందన్నారు. ఆ తర్వాత తమిళనాడు, ఢిల్లీలోనూ అత్యల్ప జననాలరేటు ఉందని ఆయన తెలిపారు. అయితే దేశంలో జననాల రేటు తగ్గుతున్నప్పటికీ ఆరోగ్య సంరక్షణ చర్యలు చేపడుతున్న కారణంగా ఆయుష్షు క్రమంగా పెరుగుతోందని చెప్పారాయన.

# రష్యాలో వాట్సాప్‌పై పూర్తిస్థాయిలో నిషేధం!
## రష్యా మెసేజింగ్‌యాప్ 'మ్యాక్స్'కు మారాలని యూజర్లకు ఆదేశాలు



**మాస్కో, నవంబరు 30:** సోషల్ మీడియా ప్లస్ వైఫైకాలింగ్ వ్యవస్థ ఉన్న వాట్సాప్‌పై పూర్తిస్థాయిలో నిషేధం విధిస్తామని రష్యా హెచ్చరించింది. మెసేజింగ్ సర్వీసెస్‌లో అగ్రగామిగా ఉన్న వాట్సాప్ నేరపూరిత ఘటనలు కట్టడి చేయడంలో విఫలం అవుతోందని,అందువల్ల పూర్తిగా నిషేధం తప్పదని చెపుతూ మిలియన్ల కొద్దీ ఉన్న కస్టమర్లు ప్రత్యామ్నాయ దేశీయ మెసేజింగ్ సేవల యాప్‌ల్లోకి మారిపోవాలని సూచించింది. అమెరికా టెక్ దిగ్గజం మెటా అధీనంలోనే వాట్సాప్ నడుస్తోంది. తమ మెసేజ్ యాప్ ద్వారా సమాచారం తెలుసుకునే హక్కులను రష్యా ప్రభుత్వం తొక్కిపెట్టాలని చూస్తోందని,వీటన్నింటినీ తాము విఫలం అయ్యామని చెపుతోందని మెటా సంస్థ స్పష్టం చేసింది.

# సంక్షిప్తంగా..

## పాకిస్థానీయులకు వీసాలు నిలిపివేసిన యుఎఇ




**అబూదాబి, నవంబరు 30:** పాకిస్థాన్ పౌరులకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కొత్త వీసాలను నిలిపి వేసినట్లు తెలిసింది. యూఏఈకి చేరుకున్న తర్వాత అనేక మంది పాకిస్థానీయులు నేర కార్యకలాపాలు, భిక్షాటనలో పాల్గొంటున్నారనే ఆందోళనల నేపథ్యంలో ఈ కఠిన చర్యలు తీసుకున్నట్లు పాకిస్థాన్ అంతర్గత వ్యవహారాల సెక్రటరీ సల్మాన్ చౌద్రీ సెనేట్ ఫంక్షనల్ కమిటీ ఆన్ హ్యూమన్ రైట్స్ సమావేశంలో వెల్లడించారు. టూరిస్ట్ వీసాపై యూఏఈకి వస్తున్న అనేక మంది పాకిస్థానీయులు భిక్షాటనకు పాల్పడుతున్నట్లు అక్కడి ప్రభుత్వం గుర్తించింది. ఇలా వచ్చిన వేలాది మంది పాక్ బిచ్చగాళ్లను ఇప్పటికే వారి స్వదేశానికి పంపించింది. దీంతో నేరాలు పెరుగుతున్నాయని గ్రహించిన యూఏఈ సాధారణ పౌరులకు ఇచ్చే వీసాలను నియంత్రిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం బ్లూ, డిప్లొమాటిక్ పాస్‌పోర్టులు కలిగిన వారికి మాత్రమే వీసాలు ఇస్తున్నట్లు తెలిసింది. పాక్ సెనేటర్ సమీనా ముంతాజ్ జెహ్రీ కూడా అతి కష్టం మీద కొద్ది మంది పౌరులకే వీసాలు మంజూరవుతున్నాయని తెలిపారు.

## సిలిగురి కారిడార్‌లో మూడు సైనిక స్థావరాలు




**న్యూఢిల్లీ, నవంబరు 30:** దేశ రక్షణకు అత్యంత కీలకమైన సిలిగురి కారిడార్‌లో కేంద్ర ప్రభుత్వం భద్రతను మరింత పటిష్టం చేసింది. భారత్ ప్రధాన భూభాగాన్ని ఈశాన్య రాష్ట్రాలతో కలిపే 22 కిలోమీటర్ల ప్రాంతాన్ని సిలిగురి కారిడార్ అంటారు. బంగ్లాదేశ్‌కు సమీపంలోని ఈ ప్రాంతంలో తాజాగా మూడు కొత్త సైనిక స్థావరాలను ఏర్పాటు చేశారు. అక్కడి ధుబ్రీ, కిషన్‌గంజ్, చోప్రా ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. అత్యవసర సమయాల్లో వేగంగా సేనలను రంగంలోకి దింపేలా వివిధ సాయుధ దళాలు, మిలిటరీ, నిఘా బృందాలను సైనిక స్థావరాల్లో ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతానికి ఎలాంటి ముప్పు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. సిలిగురి కారిడార్‌కు పూర్తి రక్షణ ఇచ్చేలా వ్యూహాత్మక ప్రాంతాల్లో మిలిటరీ స్థావరాలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా చోప్రాలోని సైనిక స్థావరం బంగ్లాదేశ్ సరిహద్దుకు కేవలం 10 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. ఇటీవల కాలంలో బంగ్లాదేశ్‌తో దౌత్యఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో సిలిగురి కారిడార్ శత్రుదుర్భేద్యంగా మార్చేందుకు నడుం కట్టింది.

## మూడుదేశాల్లో ఫిన్‌ల్యాండ్ రాయబార కార్యాలయాలు మూసివేత



**హెల్సింకి, నవంబరు 30:** యూరోపియన్ దేశం ఫిన్లాండ్ కీలక నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్, అఫ్గానిస్తాన్, మయన్మార్‌లోని తమ రాయబార కార్యాలయాలను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. వ్యూహాత్మక కారణాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఫిన్లాండ్ విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఇస్లామాబాద్, కాబూల్, యాంగోన్‌లలోని తమ రాయబార కార్యాలయాలను మూసివేయాలని నిర్ణయించినట్లు ఫిన్లాండ్ విదేశాంగ మంత్రి ప్రకటించారు. ఆదేశాలలో రాజకీయ పరిస్థితుల్లో మార్పులు, తమతో ఆయా దేశాల పరిమిత వాణిజ్య, ఆర్థిక సంబంధాలు, వ్యూహాత్మక కారణాల వలన రాయబార కార్యాలయాలు మూసివేయనున్నట్లు ఫిన్లాండ్ ప్రకటించింది. అలాగే మూడు దేశాల్లోని రాయబార కార్యాలయాలను మూసివేయడానికి సన్నాహాలను ఇప్పటికే ప్రారంభించినట్లు తెలిపింది. 2026లోగా మూసివేస్తామని వెల్లడించింది. మరోవైపు ఫిన్లాండ్ విదేశాంగ విధానం, భద్రతా విధానాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ దేశ విదేశీ వ్యవహారాల శాఖ పేర్కొంది.

## యుకెలో హర్యానా విద్యార్థి దారుణ హత్య



**లండన్, నవంబరు 30:** యునైటెడ్ కింగ్‌డమ్‌లో భారత్‌కు చెందిన విద్యార్థి దారుణ హత్యకు గురయ్యాడు. వోర్‌స్టర్ ప్రాంతంలో నవంబర్ 25న ఈ ఘటన జరిగింది. హర్యానాకు చెందిన విజయ్ కుమార్ షియోరాన్ (30) అనే యువకుడిపై గుర్తుతెలియని దుండగులు కత్తులతో దాడి చేశారు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ కేసులో పోలీసులు ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని చెప్పారు. హర్యానాకు చెందిన విజయ్ కుమార్ షియోరాన్ ఈ ఏడాది ప్రారంభంలో ఉన్నతచదువులకోసం యూకేకు వెళ్లినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. విజయ్ అంతకు ముందు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్‌లో ఉద్యోగం చేసేవాడని, ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి జనవరిలో బ్రిటన్‌కు వెళ్లాడని చెప్పారు.

# హెచ్ఐవి నియంత్రణలో ఏపి ఫస్ట్



- 2015-16లో 2.34 పాజిటివిటీ • 2024-25లో 0.58కు తగ్గుదల
- 88.72 శాతం మేర మరణాల తగ్గుదల • గర్భిణుల్లో 0.04కు తగ్గిన సంక్రమణ
- ఒక్కొక్కరి చికిత్సకు యేడాదికి రూ.35-40వేలు వ్యయం
- 42వేల మందికి పింఛన్లు • సంపూర్ణ సురక్ష కేంద్రాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి • నేడు ప్రపంచ ఎయిడ్స్ దినం

విజయవాడ, నవంబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి: హెచ్ఐవీ కేసుల నియంత్రణలో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (న్యాకో) నిర్దేశించిన 80శాతం లక్ష్యంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ (ఏపీ శాక్స్) 76.96శాతం సాధించిందని తెలిపారు. అలాగే సాధారణ జనాభాలో పరీక్ష వచ్చిన వారిలో హెచ్ఐవీ పాజిటివిటీ రేటు 2015-16లో 2.34శాతం ఉండగా 2024-25నాటికి అది 0.58శాతాని తగ్గిందని వెల్లడించారు. కండోమ్ వంటి సురక్షిత విధానాలపై తీసుకొచ్చిన అవగాహన వంటి చర్యల వల్ల పాజిటివిటీ తగ్గుతూ వస్తున్నదని పేర్కొన్నారు. 2010లో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల మరణాలతో పోల్చితే 2024-25 నాటికి 88.72శాతానికి తగ్గినట్లు న్యాకో ఇటీవల జారీచేసిన 2024-25 వార్షిక అంచనాల్లో పేర్కొందని సత్యకుమార్ వెల్లడించారు. గర్భిణుల్లో హెచ్ఐవీ పాజిటివిటీ రేటు 2015-16లో 0.10శాతం ఉండగా 202425 నాటికి 0.04శాతంకు తగ్గిందని చెప్పారు. ప్రపంచ ఎయిడ్స్ దినం (డిసెంబరు1, సోమవారం) పురస్కరించుకుని మంత్రి ప్రకటన జారీచేశారు.

### 24,957 నుంచి 13,3835కు తగ్గుదల

2015-16లో కొత్తగా 24,957 కేసులు, 2018-19లో 21,982 చొప్పున కేసులు వచ్చాయన్నారు. 2024-25లో కొత్త కేసులు 13,383 వచ్చినట్లు మంత్రి సత్యకుమార్ తెలిపారు. బాధితుల్లో అవగాహన కల్పించడం, ఉచితంగా మందులు ఇవ్వడం ద్వారా ఎయిడ్స్ సంబంధిత మరణాలను కూడా తగ్గించగలిగినట్లు చెప్పారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఉన్న హెచ్ఐవీ కేసుల్లో మహారాష్ట్ర (3,62,392) తరువాత ఏపి (2,75,528) రెండో స్థానంలో ఉంది. అయితే కొత్త కేసులు పెరగకుండా నిరోధించడంలో రాష్ట్ర ప్రభుత్వం మంచి పురోగతిని సాధిస్తోంది. మరోవైపు ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల్లో 42,008 మంది ప్రభుత్వ పింఛన్లు పొందుతున్నారు. ఇంకొంతమంది పింఛన్ల కోసం దరఖాస్తు చేసి, ఉన్నారు. ఇవి ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి.

### యూఎన్ ఎయిడ్స్ లక్ష్యాల సాధనలోనూ...!

ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన లక్ష్యాల (యూఎన్ ఎయిడ్స్ 95శాతం- 95శాతం- 95శాతం) మేరకు బాధితుల గుర్తింపులో, గుర్తించిన వారికి మందులు ఇప్పించడంలో, వారి శరీరంలో వైరస్ తగ్గించడంలోనూ రాష్ట్ర ప్రభుత్వం పురోగతి సాధిస్తోంది. జాతీయ స్థాయిలో 81శాతం లక్ష్యం నమోదు కాగా ఏపి శాక్స్ 86శాతం సాధించింది. అలాగే... వైరల్ లోడు తగ్గించడంలో జాతీయ స్థాయిలో 97శాతం లక్ష్యం నమోదుకాగా రాష్ట్రంలో 95శాతం వరకు నెరవేర్చింది. బాధితులకు మందులు ఇప్పించడంలో జాతీయ స్థాయి లక్ష్యం 88శాతం కాగా ఏపిలో 87శాతం వరకు నమోదైనట్లు ఏపి శాక్స్ ప్రాజెక్టు డైరెక్టర్ నీలకంఠారెడ్డి తెలిపారు.

### అన్ని కార్యక్రమాల్లో పురోగతి

న్యాకో వెల్లడించిన 2024-25 స్కోర్కార్డులో ఏపి ప్రభుత్వం రెండోస్థానంలో ఉంది. హెచ్ఐవి నియంత్రణకు సంబంధించిన అన్ని రకాల కార్యక్రమాల్లో పురోగతి ఉన్నట్లు న్యాకో తెలిపిందని నీలకంఠరెడ్డి పేర్కొన్నారు.

### ఒక్కొక్కరిపై రూ.35వేల నుంచి రూ.40వేల వరకు వ్యయం




ఒక్కో హెచ్ఐవీ కలిగిన వ్యక్తిపై ఏడాదికి ప్రభుత్వం సగటున రూ.35వేల నుంచి రూ.40వేల వరకు వ్యయంచేస్తోంది. సెంట్రల్ సెక్టార్ స్కీము కింద న్యాకో ద్వారా ఉచితంగా యాంటీ రిట్రోవైరల్ థెరపీ మందులు వస్తున్నాయి. వైరల్ లోడు (శరీరంలో హెచ్ఐవి ఇన్ఫెక్షన్ సాయి గుర్తింపు) పరీక్షలు, ఇతర వాటికి కలిపి ప్రతి నెలా ఒక్కొక్క హెచ్ఐవీ పేషంటుకు నెలకు రూ.3వేల నుంచి రూ.3,500 వరకు వ్యయమవుతోంది. ప్రతినెలా ప్రస్తుతం 2,38,760 మంది మందులను రాష్ట్ర వ్యాప్తంగా 59 ఎఆర్టీ కేంద్రాల ద్వారా పొందుతున్నారు. మందులను క్రమం తప్పకుండా వాడుతున్న వారి జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి. 2004లో మొదటి కేసు గుంటూరు నగరంలో నమోదైంది. సదరు వ్యక్తి మందులు వాడుతూ ఇప్పటికీ మెరుగైన జీవనాన్ని సాగిస్తున్నారు.

### సంపూర్ణ సురక్ష కేంద్రాల ద్వారా..!

హైరిస్కు బిహేవియర్ (మల్టీపుల్ పార్టనర్స్) ఉండి హెచ్ఐవీ పరీక్షల్లో నెగిటివ్ వస్తున్నప్పటికీ ఎప్పటికప్పుడు వారిని అప్రమత్తం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 13 సంపూర్ణ సురక్ష కేంద్రాలు పైలటు ప్రాజెక్టు కింద న్యాకో ద్వారా గత ఏడాది నుంచి నడుస్తున్నాయి. సుమారు 35వేల మందికి ఇప్పటి వరకు ఈ కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్, హెచ్ఐవీ, ఇతర పరీక్షలు చేస్తున్నారు. హైరిస్క్ (సెక్స్ వర్కర్లు, స్వలింగ సంపర్కులు, ఇంజెక్టింగ్ డ్రగ్ యూజర్స్), ట్రాన్స జెండర్స్, మైగ్రంట్సు అండ్ ట్రక్కర్స్) గ్రూపులో ఉన్న వారికి ఏడాదిలో రెండుసార్లు హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 109 ఎన్జీఓలు పనిచేస్తున్నాయి.



ఎస్సీ, ఎస్టీ యువతకు ఉచిత యుపిఎస్సి సివిల్స్ కోచింగ్

## ముగిసిన ప్రవేశ పరీక్ష

విజయవాడ, నవంబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి: యుపిఎస్సీ సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు డా. బి.ఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో యుపిఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ అందించనున్నారు. ఈ శిక్షణ కోసం మొత్తం 6,361మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నేడు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో మెరిట్ సాధించిన అభ్యర్థులకు విశాఖ, విజయవాడ, తిరుపతి అంబేద్కర్ స్టడీ సర్కిళ్లలో (10.12.2025 నుంచి 10.04.2026 వరకు) 4 నెలల పాటు అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యంతో యుపిఎస్సీ ప్రిలిమ్స్ కి శిక్షణ అందించనున్నారు.



## జగన్ హాయాంలో ఇరిగేషన్ వ్యవస్థ అస్తవ్యస్తం

- ప్రాజెక్టు గేట్లకు కనీసం గ్రీజ్ కూడా పెట్టలేదు
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు
- తవ్వోడతో నల్లి క్రీక్‌లో సిల్ట్ తొలగింపు పనులు ప్రారంభం

నరసాపురం, నవంబరు 30 ప్రభాతవార్త: పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం తీర ప్రాంతంలో నల్లి క్రీక్ పనులను వంతెన నిర్మాణ పనులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ సర్కార్ జల వనరుల వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని సుల్యీస్ తలుపులకు లాకుల గేట్లకు గాని కనీసం గ్రీజు కూడా పెట్టించలేకపోయింది అన్నారు. ఫలితంగా వరదలు, భారీ వర్షాల సమయంలో రైతులు తీవ్రంగా నష్టపోయారని వాపోయారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు ప్రతి పనిని వెంటనే చేపట్టడం జరిగిందన్నారు. శ్రీశైలం ప్లాంజ్ పూల్ ఎఫరాన్ మరమ్మతులకు రూ 200 కోట్లు తుంగభద్ర గేట్ల మరమ్మతులకు 54 కోట్ల ధవలేశ్వరం గేట్ల మరమ్మతుల రూ 150 కోట్లు ఆదివారం మంజూరు చేసినట్టు తెలిపారు. జగన్ పాలనలో వ్యవస్థలన్నిటిని విధ్వంసం చేశారని, కూటమి పాలన వచ్చాక చంద్రబాబు గాడిలో ఒక్కొక్కటి పెడుతున్నారన్నారు. తొలుత ఆయన నల్లి క్రీక్ తవ్వు పనులు ప్రారంభించారు. రూ.10 కోట్లతో నిర్మించే వంతెనకు భూమి పూజ చేశారు. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో గత సర్కారు పదివేలు ఇస్తే కూటమి ప్రభుత్వం దాన్ని 20వేలు చేసిందని ఈ ఏడాది ఆ విధంగా ఇవ్వడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ టిడిపి నియోజకవర్గ కన్వీనర్ పి.రామరాజు, కొల్లు పెద్దిరాజు, వాతాడి ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎపి కోఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడుగా టివి ఫణి పేర్రాజు



విజయవాడ, నవంబరు 30 ప్రభాతవార్త: ఏపి కోఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్రాధ్యక్షుడుగా టివి ఫణి పేర్రాజు, ప్రధాన కార్యదర్శిగా జి సురేష్ నాయుడు ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ఏపి సహకార ఉద్యోగుల సంఘం రాష్ట్ర మహాజన సభలో జరిగిన ఎన్నికల్లో వారు ఎన్నికయ్యారు. ముఖ్య అతిథి ఏపి జెఏసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదర్ పాల్గొనగా, వివిధ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫణి పేర్రాజు మాట్లాడుతూ గత 56 సంవత్సరాలుగా క్రమశిక్షణకు మారుపరుగా ఏపి కోఆపరేటివ్ సర్వీసెస్ నడుస్తోందని, దానికి గత 16 సంవత్సరాలుగా తాను అధ్యక్షుడుగా వున్నానని, ఇపుడు మరల ఎన్నుకున్న సహకార ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు. బొప్పరాజు మాట్లాడుతూ నూతన అధ్యక్ష, కార్యదర్శులను అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా తాము చేసిన ఉద్యమాలకు సహకారసంఘం సంపూర్ణసహకారం అందించిందన్నారు. ఈ ఎన్నికల్లో కోశాదికారిగా జిసిబివి కోటేశ్వరరావు, సహాధ్యక్షుడుగా పి. నాగరమణయ్య, ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు.



## లోకోమోటర్ అంటే..?

### సదరం శ్లాట్ బుకింగ్‌లో 'అవగాహనాలోపం'

- మానసిక వైకల్యం, పక్షవాతం శాపమని ఆవేదన
- చంద్రగిరిలో "లోకోమోటర్"కు మాత్రమే

చంద్రగిరి, నవంబరు 30 ప్రభాతవార్త: లోకోమోటర్ అంటే ఏమిటనేది సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించాల్సిన బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వమే తీసుకోవాలని ప్రభుత్వ వైద్యులు కోరుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గల పీడిత ప్రజలు సదరం క్యాంపులకు హాజరై సర్టిఫికెట్ పొందడానికి సచివాలయాలకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో లబ్దిదారుడు దరఖాస్తు చేసుకునే క్రమంలో ప్రత్యేక ప్రతిభావంతులకు, వికలాంగులకు లోకోమోటర్ ఆప్షన్ మాత్రమే కనిపిస్తుండటంతో ఈ ఆప్షన్ పట్ల అవగాహన లేని డిజిటల్ అసిస్టెంట్లు ఆ మేరకు లోకోమోటర్‌ను ఓకే చేసి లబ్దిదారులు కోరుకున్న సెంటర్‌కు పంపిస్తున్నారు. అయితే లోకోమోటర్ ఎవరెవరికి వర్తిస్తుందనే విషయం సిస్టంలో పొందుపరచక పోవడం, రాష్ట్ర వ్యాప్తంగా గల సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు అవగాహన లేకపోవడం లబ్దిదారుల సమస్యలకు కారణమవుతున్నది. ముఖ్యంగా చంద్రగిరి, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి (కమ్యూనిటీ హెల్త్ సెంటర్) లాంటి కేంద్రాలకు సదరం లబ్దిదారులు లోకోమోటర్ ఆప్షన్‌తో కర్నూలు, అనంతపురం, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుండి ఎక్కువ మంది హాజరవుతున్నారు. లోకోమోటర్ అంటే.. పోలియో, పార్కింగ్ సన్స్, మేజర్ యాక్సిడెంట్స్, యాంపుటేషన్స్, సెరిబ్రల్ పాలసీ, కంజనేటర్ డిఫార్మోటీ మాత్రమే మాత్రమే వర్తిస్తాయి. అయితే కేవలం లోకోమోటర్ అని మాత్రమే ఆప్షన్ వుండటంతో అవగాహనలేని డిజిటల్ అసిస్టెంట్లు లోకోమోటర్ ఆప్షన్‌తో పక్షవాతం, మానసిక వైకల్యం వంటి వారికి సైతం కేటాయిస్తున్నారు.) ఏరియా ఆసుపత్రిలో జనరల్ మెడిసన్, న్యూరాలజీ, మానసిక వైద్యులు లేకపోవడంతో ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ పావన్ తనపరిధిలో లేని అంశంపై అభిప్రాయాన్ని (వ్రాతపూర్వక) కోరుతూ తిరుపతి రుయా ఆసుపత్రి వైద్యుల చెంతకు పంపుతున్నారు. లబ్దిదారులకు ఇక్కడే అసలు సమస్య ఎదురవుతున్నది. మానసిక వైకల్యంతో దిక్కులు చూస్తున్న తనయుడిని మోసుకువచ్చిన తల్లిదండ్రుల కష్టం కళ్ళముందు కనబడుతున్నప్పటికీ తన పరిధిలో లేకపోవడంతో కనికరించలేని వైనం లబ్దిదారుల్లో వేదన మిగుల్చుతున్నది. అదేవిధంగా పక్షవాతానికి గురైన వ్యక్తికి అర్హత కల్పించడానికి తనకు అవకాశం లేదని తిరుపతి రుయాకు వెళ్ళి వైద్యుల నుండి అభిప్రాయాన్ని తీసుకురావాలని పంపుతున్నారు. రుయాలో ఇటువంటి బాధితులు ఆయా విభాగాలకు వెళ్ళి పరీక్షలు చేసుకురావడం, స్కానింగ్ తీసుకురావడం వంటివి అత్యంత ప్రయాసలతో కూడుకున్నవి కావడంతో అష్టకష్టాలు పడుతున్నారు. తీరా సంబంధిత వైద్యులు తగిన పర్సంటేజ్ ఇవ్వని పక్షంలో అప్పటి వరకు పడిన కష్టం బూడిదలోపోసిన పన్నీరవుతున్నది. ఇటువంటి సంఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా గల అనేక ఆసుపత్రులలో జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సదరం శ్లాట్స్ బుక్ చేసే విషయంలో ఆన్‌లైన్‌లో ఏ వైకల్యానికి ఏ విభాగాన్ని సంప్రదించాలనే విషయాన్ని పొందు పరచగలిగితే సౌకర్యవంతంగా వుండగలదని లబ్దిదారులు కోరుతున్నారు. అలా కుదరని పక్షంలో శ్లాట్స్ బుక్ చేసుకున్న తేదీలలో ఆయా కేంద్రాలలో (ఆసుపత్రులలో) సంబంధిత వైద్యులను నెలలో నాలుగు రోజులు డ్యూటీలు చేయించ గలిగితే మరింత బాగుంటుందని వాపోతున్నారు. ప్రభుత్వ పెద్దలు, అధికారులు ప్రత్యేక ప్రతిభావంతుల కష్టాన్ని గుర్తెరిగి తగిన నిర్ణయం తీసుకోవాల్సి వుంది. వాస్తవానికి ప్రతి కుటుంబానికి సంబంధించిన వ్యక్తిగత వివరాలు రాష్ట్ర ప్రభుత్వం వద్ద వున్న విషయం తెలిసిందే. మండలాన్ని కేంద్రంగా తీసుకుని ఆ మేరకు అర్హత కలిగిన వారికి సమీప ప్రభుత్వ ఆసుపత్రిలోనే పరీక్షలు చేయించి సర్టిఫికెట్ మంజూరు చేయగలిగితే మరింత సౌకర్యవంతంగా వుంటుందనేది ప్రభుత్వ పెద్దలు గుర్తించాలి.

## ఆ నిర్ణయాలు వెనక్కి తీసుకోండి



నెల్లూరు రూరల్, నవంబరు 30 ప్రభాత వార్త: నెల్లూరు జిల్లాలో మూడు మండలాలను తిరుపతి జిల్లాలో చేర్చే ప్రభుత్వం నిర్ణయం భారీ వివాదానికి తావిచ్చిందని, ఈ నిర్ణయం జిల్లాల మధ్య పగదాడులకు, నీటి యుద్ధాలకు దారి తీస్తుందని మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరు పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, జిల్లాల పునర్విభజన పేరిట చంద్రబాబు నెల్లూరులో చిచ్చు రేపుతున్నాడు. ప్రజ లను మోసం చేసే నిర్ణయాలకు వెంటనే తెరదించాలని స్పష్టం చేశారు. ఎన్ని కల ముందు గూడూరును నెల్లూరులో కలుపుతామని హామీ ఇచ్చిన చంద్ర బాబు, అధికారంలోకి వచ్చాక మాట మార్చడమే కాకుండా, ఇప్పటి వరకు నెల్లూరు జిల్లాలో ఉన్న రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను తిరుపతిలో కలపాలని డ్రాఫ్ట్ నోటిఫికేషన్ జారీ చేయడం ప్రజల ఆవేదనకు కారణమైందని పేర్కొన్నారు. జిల్లాల మధ్య నీటి యాజమాన్య హక్కులు కలగలిసిపోయి, సోమశిల- కండలేరు వ్యవస్థలో నీటి విడుదలపై కొత్త వివాదాలు మొదలవుతాయి. నెల్లూరు రైతులు రాబోయే రోజుల్లో తీవ్ర ఇబ్బందులకు గురవడం ఖాయమని హెచ్చరించారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో భౌగోళిక పరిస్థితులు, ప్రజల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని పార్లమెంట్ వ్యవస్థ ఆధారంగా 26 జిల్లాలు ఏర్పాటు చేశామని, అదే సమయంలో వెంకటగిరి నియోజకవర్గంలోని మూడు మండలాలను నెల్లూరులో చేర్చి ప్రజా ప్రయోజనాలను కాపాడామని గుర్తు చేశారు. అప్పటి నిర్ణయంలో ప్రజల ప్రయోజనం ఉంది. కానీ ఇప్పుడు చంద్రబాబు తీసుకున్న నిర్ణయంలో స్పష్టమైన రాజకీయ దురుద్దేశం మాత్రమే కనిపిస్తోందని అన్నారు. ప్రజల జీవితాలతో ఆడుకోవడం చంద్రబాబుకే సరిగ్గా తెలిసిన పని ఆరోపించారు. ఎన్నికలకు ముందు గూడూరును నెల్లూరులో కలుపుతామని ఇచ్చిన హామీపై కూడా కాకాణి ప్రశ్నలు లేవనెత్తారు. గూడూరు నియోజక వర్గంపై చంద్రబాబు ఎందుకు సవతి ప్రేమ చూపిస్తున్నాడు..? ఇచ్చిన మాట నీట మూటలా..? అని మండిపడ్డారు. రాపూరు, కలువాయి, సైదాపురం మండలాల కలయికను వెంటనే రద్దు చేయాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరులో కలపాలని డిమాండ్ చేశారు.

## అనైతిక పనులకు అడ్డు తగులుతున్నాడనే పెంచలయ్య హత్య



- కల్లూరుపల్లి హత్య కేసు ఛేదించిన పోలీసులు
- ఏడుగురు నిందితుల అరెస్ట్, మరో ఆరుగురి కోసం గాలింపు

నెల్లూరు క్రైమ్, నవంబరు 30 ప్రభాతవార్త: కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు ప్రాంతంలో తమ గంజాయి అమ్మకాలకు, అనైతిక కార్యక్రమాలకు అడ్డు తగులుతున్నాడని అరవ కామాక్షి, మరికొందరు కలిసి పెంచలయ్యను హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ సంఘటనకు సంబంధించి ఏడుగురు నిందితులను నెల్లూరు రూరల్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ఆదివారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రూరల్ డిఎస్పి ఘట్టమనేని శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు.. స్థానిక ఆర్డిటి కాలనీలో నివాసం ఉండే కొట్టవీడి పెంచలయ్య (35) ప్రజానాట్య మండలిలో జిల్లా కమిటీ సభ్యుడుగా ఉంటూ, కాలనీలో అసాంఘిక కార్యక్రమాలపై ప్రజలను చైతన్య పరుస్తూ, చురుగ్గా ఉంటాడు. బోడిగాడి తోట నుండి ఆర్డిటి కాలనీకి వచ్చి స్థిరపడిన అరవ కామాక్షి కుటుంబం గంజాయి వ్యాపారం చేస్తూ కాలనీలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుండేవారు. ఈ క్రమంలో పెంచలయ్య వారికి అడ్డు తగులుతుండడం, గంజాయి అమ్మకాలను నిరోధించేందుకు స్థానికులను చైతన్య పరుస్తుండడం కంటగింపుగా మారింది. మధ్యలో ఆగిపోయిన ముత్యాలమ్మ తల్లి గుడి పనులను కూడా ఆరవ కామాక్షి ప్రమేయం లేకుండా స్థానిక యువత సహకారంతో పూర్తి చేసుకోవటం జరుగుతోంది. కామాక్షి ఆధిపత్యం పూర్తిగా తగ్గిపోవటంతో, ప్రతి పనిలో పెంచలయ్య అడ్డు తగులుతున్నాడని, పెంచలయ్య అనే వ్యక్తి కాలనీ వాసులు అందర్నీ మార్చేస్తున్నాడని భావించి, కామాక్షి తన సహచరులతో కలసి పక్కా ప్రణాళికతో తన తమ్ముళ్లు ఇతరుల సహకారంతో పెంచలయ్యను హత్య చేయించిందచింది. వారి పదకు ప్రకారం ఈ నెల 28వ తేదీ సాయంత్రం తన కుమారుడ్ని స్కూలు నుండి తీసుకువెళ్తున్న పెంచలయ్యను 10 మంది వ్యక్తులు వెంబడించి కల్లూరుపల్లి వద్ద మోటార్ సైకిల్‌తో ఢీ కొట్టి కిందపడిన అతనిపై విచక్షణారహితంగా కత్తులతో దాడి చేశారు. స్థానికులు గమనించి పెంచలయ్యను ఆసుపత్రికి తీసుకెళ్లే లోగా ఆయన మరణించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రూరల్ సీఐ జి.వేణు కేసు దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు, రూరల్ డిఎస్పి శ్రీనివాసరావు పర్యవేక్షణలో నిందితుల కోసం తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో కోవూరు షుగర్ ఫ్యాక్టరీ వద్ద నిందితులు తలదాచుకున్నారని సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి సిఐ అక్కడికి వెళ్లారు. నిందితుల్లో ఒకడైన జేమ్స్ హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణ పై కత్తితో దాడి చేశాడు. దీంతో సీఐ వేణు రెండు రౌండ్ల కాల్పులు జరపడంతో జేమ్స్ కు స్వల్ప గాయమైంది. గాయపడిన కానిస్టేబుల్ ఆదినారాయణ, నిందితుడు జేమ్స్ లను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

నిందితుల్లో కొందరైన నాగుల జానకిరామ్ (నాలుగో మైలు, నెల్లూరు రూరల్), ధారా విష్ణువర్ధన్ (తడికల బజార్), ఆరవ సంతోష్ (ఆర్ డిటి కాలనీ), మిందాల రోహిత్ (రంగనాయకుల పేట), ఈగ వినయ్ (సెట్టిగుంట రోడ్డు), కల్లూరు సంతోష్ (నవాబుపేట), అరవ జోసెఫ్ (బోడి గాడి తోట)లను ఆమంచల సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. వారి వద్ద నుండి హత్య కోసం ఉపయోగించిన మూడు ద్విచక్ర వాహనాలు, ఏడు కత్తులను స్వాధీనం చేసుకున్నారు. పథక రచన చేసిన అరవ కామాక్షిని గంజాయి కేసులో ఆదివారం నవాబుపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, పిటి వారెంట్ కింద ఆమెను, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జేమ్స్ ను త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు. మిగతా నిందితులను కూడా త్వరగా పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు డిఎస్పీ తెలిపారు. సంచలనం కలిగించిన హత్య కేసులో నిందితులను త్వరగా పట్టుకోవడం ప్రతిభ కనబరిచిన నెల్లూరు రూరల్ సీఐ జి.వేణు, వేదయపాలెం సిఐ కె.శ్రీనివాస రావులను ఇతర సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి ప్రకటించిన రివార్డులను డిఎస్పి వారికి అందజేశారు.

## నిందితులను కఠినంగా శిక్షించండి

### హోం మంత్రి అనితకు సిపిఎం కార్యదర్శి లేఖ





విజయవాడ, నవంబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి: గంజాయి మాఫియాకు ఎదురు నిలిచిన పెంచలయ్యను హత్య చేసిన హంతకులను, వారికి అండ దండలిచ్చి ప్రోత్సహించిన వారందరినీ అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేసారు. గంజాయిపై పోరాటంలో హత్య చేయబడిన కుటుంబాన్ని పరామర్శించి వారికి అన్ని విధాలా పునరావాస చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హోం మంత్రి వంగలపూడి అనితకు లేఖ రాశారు. "గంజాయి మీద ఉక్కుపాదం మోపుతున్నట్లు మీరు పదే పదే ప్రకటిస్తూ వచ్చారు. కానీ గంజాయి ముఠా చేసిన ఈ హత్యపై మీరు కనీసం స్పందించలేదు. మాట మాత్రంగా కూడా ఖండించలేదు. గంజాయిపై పోరాడే వారికి మీరు ఎలా భరోసా ఇవ్వగలరు? ఇప్పటికైనా ఆ గంజాయి మాఫియాకు బలైన యువకుడి కుటుంబాన్ని మీరు సందర్శించి, ఆ కుటుంబానికి భరోసా కల్పించాలని కోరుతున్నాను. వారిది అత్యంత నిరుపేద దళిత కుటుంబం. పెంచల య్య భార్యతో పాటు ఇద్దరు చదువుకుంటున్న పిల్లలున్నారు. ఆ కుటుంబానికి కనీసం రూ.50 లక్షల సహాయం, ఆరు ఎకరాల భూమి, ఒక ఇల్లు శాంక్షన్ చేయాలి. ఆయన భార్య దుర్గకి ఉద్యోగం కల్పించాలి. ఇద్దరి పిల్లల చదువుకి ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి. ఆ మేరకు మీ నుండి ప్రకటన వస్తుందని, ఇప్పటికైనా వెంటనే ఆ కుటుంబాన్ని సందర్శించి వారికి భరోసా కల్పిస్తారని ఆశిస్తున్నాను. డ్రగ్స్ మాఫియాను అరికట్టేందుకు త్రికరణ శుద్ధితో తగిన చర్యలు చేపట్టాలి. డ్రగ్స్ మాఫియాపై పోరాడే ప్రజలకు బాసటగా మీ ప్రభుత్వం నిలబడాలని కోరుతున్నాను" అని శ్రీనివాసరావు ఆ లేఖలో పేర్కొన్నారు.

## గంజాయి స్మగ్లర్ అరెస్ట్

నెల్లూరు క్రైమ్, నవంబరు 30 ప్రభాతవార్త: ఇతర ప్రాంతాల నుండి గంజాయి జిల్లాకు తీసుకొచ్చి ఇక్కడ నుండి మరి కొన్ని ప్రాంతాలకు సరఫరా, విక్రయాలు జరుగుతున్న ఓ మహిళా స్మగ్లర్‌ను నవాబుపేట పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్ పరిధిలోని కిన్నెర ప్రసాద్ లేఅవుట్లో నివాసముంటున్న అరవ కామాక్షి అనే మహిళ గంజాయి సరఫరా చేస్తున్నట్లు సమాచారం రావడంతో శనివారం రాత్రి నవాబుపేట సీఐ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఆమె ఇంటిలో సోదాలు నిర్వహించారు. ఈ సోదరుల్లో రవాణాకు సిద్ధంగా ఉంచిన 25 కిలోల గంజాయిని గుర్తించి తాసిల్దార్ సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలు అరవ కామాక్షి ఈనెల 28వ తేదీ కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలో జరిగిన కే పెంచలయ్య హత్యలో ప్రధాన ముద్దాయిగా ఉన్నారు. ఆమెను పీటీ వారెంట్ ద్వారా నెల్లూరు రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకునే అవకాశం ఉంది.

# 4న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ



## నేటి నుండి శ్రీహనుమత్ వ్రతం

ఇంద్రకీలాద్రి, నవంబరు 30, ప్రభాత వార్త: శ్రీ దుర్గామల్లేశ్వరసా ఇమవార్ల దేవస్థానం ఆధ్వర్యంలో ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షణ డిసెంబర్ 4న జరుగుతుందని ఇఓ వికె శీనానాయక్ తెలిపారు. ఉదయం 5.55లకు శ్రీ కామధేను మాత ఆలయం వద్ద ప్రారంభమై కుమ్మరిపాలెం, పాల ఫ్యాక్టరీ, బ్రాహ్మణ వీధుల మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంటుందన్నారు. భక్తులు విశేషంగా పాల్గొనాలన్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం అను బంధ ఆలయమైన సీతానగరంలోని శ్రీ మద్వీరాంజనేయ సమేత శ్రీ కోదండరామసా ్వమివార్ల దేవస్థానంలో 1నుండి 3వ తేదీ వరకు శ్రీ హనుమత్ వ్రతం నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. 3న హనుమత్‌హోమం లక్ష నాగవల్లీ దళార్చన నిర్వహించి సాయంత్రం హనుమత్‌వ్రతం, పూర్ణాహుతి, అన్నప్రసాద వితరణ నిర్వహిస్తామన్నారు. రు.1116ల ఉభయంతో ఉభయ దాతలు పాల్గొనాలన్నారు.

### అన్నప్రసాదానికి విరాళం:

దుర్గమ్మవారి ఆలయంలో జరిగే అన్నప్రసాద వితరణకు రు.1లక్షను మేడ్చల్‌కు చెందిన ఎంవి రామ్‌శెట్టి దుర్గాప్రసాద్ మరియు వారి కుటుంబసభ్యులు ఆదివారం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు.

### దుర్గమ్మ సేవలో హైకోర్టు జడ్జి

దుర్గమ్మవారిని ఆంధ్రప్రదేశ్‌హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి దంపతులు దర్శించుకున్నారు. వారికి ఇఓ వికె శీనా నాయక్ శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు. దుర్గమ్మవారిని కీర్తిస్తూ ఆదివారం కళావేదికపై సాగిన గానామృతం భక్తులను అలరించింది. జి కొండూరు మండలం కవులూరుకు చెందిన గరిమెల్ల శేషకుమారి బృందం పలు కీర్తనలను ఆలపించగా వారికి శ్రీ అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలు అందించారు.

# చెరువు బురదలో చిక్కుకున్న ఏనుగు



చిత్తూరు, నవంబర్ 30 ప్రభాత వార్త: చిత్తూరు జిల్లా యాదమరి మండలం తెల్ల రాళ్ళపల్లి పంచాయతీ గుడ్డి వాని చెరువులోని కుంటలో ఓ ఏనుగు చిక్కుకుపోయింది. చెరువు బురదలో చిక్కుకున్న ఏనుగును రక్షించడానికి అటవీశాఖ, పోలీసుశాఖ అధికారులు ఉపక్రమించినప్పటికీ ఆదివారం ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. చెరువులో బురదలో కూరుకుపోయిన ఏనుగును రక్షించడానికి అటవీ, పోలీసు శాఖ అధికారులు అక్కడే మకాం వేసి ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. వివరాలిలా వున్నాయి. తెల్లరాళ్ళపల్లి పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతంకు తరచు ఏనుగులు వచ్చి వెళ్తుంటాయి. ఈ క్రమంలో అటవీ ప్రాంతంలో తీవ్రంగా గాయపడిన ఈ ఏనుగు వారం రోజులుగా తెల్లరాళ్ళపల్లి అటవీ ప్రాంత పరిధిలో సంచరిస్తోంది. ఆదివారం తెల్లవారుజాము ఈ ఏనుగు గుడ్డివారి చెరువులో దిగి చెరువులో వున్న ఓ కుంటలో కూరుకు పోయింది. చెరువులో బురదలో చిక్కుకున్న ఏనుగు బయటికి రావడానికి ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాకపోవడంతో స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారులు, పోలీసులు ఘటనా స్థలంకు చేరుకుని ఏనుగును రచ్చించడానికి ఉపక్రమించారు. చెరువు ఊబిలో చిక్కుకున్న ఏనుగును బయటికి తీయడానికి తిరుపతి వెంకటేశ్వరా జువాజికల్ పార్కులోని రెండు కుంకీ ఏనుగులను సైతం రప్పించారు. ఆదివారం సాయంత్రం 3 గంటలకు అక్కడికి చేరుకున్న కుంకీ ఏనుగులు కృష్ణ, అభిమన్యులు క్రేన్ సహాయంతో చెరువులో చిక్కుకున్న ఏనుగును బయటికి తీసుకురావడానికి ప్రయత్నించాయి. అయితే ఈ క్రేన్ తెగిపోవడంతో చెరువు ఊబిలో చిక్కుకున్న ఏనుగును బయటికి రప్పించలేక పోయాయి. అప్పటికే రాత్రి కావడంతో ఏనుగును రక్షించడానికి ఇటు అటవీశాఖ అధికారులు, అటు పోలీసు శాఖ అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. సిసిఎఫ్ యశోధ ఆధ్వర్యంలో జిల్లా అటవీశాఖ అధికారి శ్రీనివాసులు, ఫారెస్ట్ రేంజర్లు థామస్, పట్టాబిలతో పాటు యాదమరి ఎస్ఐ ఈశ్వర్‌యాదవ్ అక్కడే మకాం వేశారు. ఏనుగు తీవ్రంగా గాయపడి వుండటంతో ఆ ఏనుగులు చెరువు నుండి ఎలా బయటికి తీసుకురావాలనే విషయంపై అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. సోమవారం నాటికి చెరువులో చిక్కుకున్న ఏనుగు బయట పడే అవకాశాలు కన్పిస్తున్నాయి.

# మెడికల్ విద్యార్థి ఆత్మహత్య

నెల్లూరు క్రైమ్, నవంబరు 30 ప్రభాతవార్త: నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో మూడవ ఏడాది వైద్య విద్యను అభ్యసిస్తున్న రాచగొల్ల నాగమహేశ్వర్ (19) అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎవరూ లేని సమయం చూసి తన హాస్టల్ గదిలో ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. తోటి విద్యార్థుల సమాచారం మేరకు కళాశాల సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దర్గా మెట్ట పోలీస్ స్టేషన్ సీఐ కళ్యాణ్ రాజు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడు ఆత్మహత్యకు ఎందుకు పాల్పడ్డాడనే అంశంపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# నేడు ఉంగుటూరుకు సిఎం

● గోపినాథ్‌పట్నంలో పింఛన్ల పంపిణి ● నల్లమాడు ప్రజావేదికకు చంద్రబాబు హాజరు

● ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి పార్థసారధి





ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి పార్థసారధి, కలెక్టర్ సెల్వి, ఐజి



వర్షం నీటితో హెలిపాడ్

ఏలూరు/ఉంగుటూరు, నవంబరు 30 ప్రభాతవార్త: ఉంగుటూరు మండలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ఆదివారం సాయత్రం ఉంగుటూరు మండలం గొల్లగూడెం హెలిప్యాడ్, నల్లమాడు ప్రజావేదిక మరియు కేదరు సమావేశ సభాస్థలి, గోపినాథపట్నం యన్టీఆర్ బరోసా సామాజిక పింఛన్ల లబ్ధిదారులు గృహాలను, తదితర ప్రాంతాలను ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, డిఐజి అశోక్ కుమార్, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏపి అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ముఖ్యమంత్రి కార్యాలయ భద్రతాధికారులతో కలిసి రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒకేసారి పింఛన్లు పెంపుదల చారిత్రాత్మక నిర్ణయం అని, ప్రతినెల ఒకటవ తేదీన రాష్ట్రంలో ఒక గ్రామం ఇంటింటికి వెళ్ళి పింఛన్లు పంపిణీ చెయ్యడం చంద్రబాబుకే సాధ్యం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా భావించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందని అన్నారు. గత ప్రభుత్వం వెయ్యి రూపాయలు పెంచడానికి ఐదేళ్ల పట్టిందని, పనిచేసే ప్రభుత్వానికి, పనిచెయ్యని ప్రభుత్వానికి తేడాను ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఏ ఆదరణ లేక నిరాధారణకు గురైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పట్ల కూటమి ప్రభుత్వానికి మానవత్వం ఉందన్నారు. గత ప్రభుత్వం హంగు ఆర్భాటాలు, రంగులు మీద పెట్టిన శ్రద్ధ వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులపై పెట్టలేదని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా అత్యధికంగా పింఛన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిరుపేదలు ఇంటికి స్వయంగా వెళ్ళి పింఛన్ల సొమ్మును అందించి, వారి ఆర్థిక, ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకుంటున్నారని అన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఈ విధంగా చేయలేదని మంత్రి తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా కూటమి ప్రభుత్వాన్ని దీవించిన అన్ని వర్గాలు ప్రజలకు మేలు చెయ్యాలనే ఉద్దేశంతోనే అభివృద్ధి, సంక్షేమ దిశగా రాష్ట్రానికి మంచి ప్రజాపాలన అందిస్తున్నామని తెలిపారు. రైతుకు ఒక్కసారి కోకో,పొగాకు, మొక్కజొన్న పంటలు సమస్యలు వచ్చాయని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వారికి అన్ని విధాలుగా తోడుగా ఉందని అన్నారు. ప్రతి రైతుకు టర్పాలిన్లు అందించడం వలన పంట నష్టాలను కొంత మేర తగ్గించ గలిగామని అన్నారు. ఆరుగాలం శ్రమించిన పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసి గిట్టుబాటు ధర అందించి, 24 గంటల్లో డబ్బులను నేరుగా వారి వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని అన్నారు. దేశంలోనే మన రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని అన్నారు.

జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఉంగుటూరు మండలం రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. గోపినాథపట్నం యన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల లబ్ధిదారులు గృహాలకు ముఖ్యమంత్రి స్వయంగా వెళ్ళి పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని సిద్ధం చేశామని అన్నారు. పర్యటన పూర్తి అయ్యేంతవరకు వివిధ శాఖల అధికారులకు ప్రత్యేక విధులు కేటాయించామని, సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో నిమగ్నమై ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం అయ్యేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని అన్నారు.

శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో అత్యధిక పింఛను అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదే అని, ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఇంటింటికి వెళ్ళి పింఛన్లు అందజేయటం ఏ ముఖ్యమంత్రి చెయ్యలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మా నియోజకవర్గంలో రూ 130 కోట్లు అభివృద్ధి పనులు చేసుకున్నామని, ఆర్వోబి పనులు రూ 450 కోట్లు పూర్తి చేస్తామని అన్నారు. పీ4 కార్యక్రమం ద్వారా నియోజక వర్గంలో కాలువలు, బ్రిడ్జి నిర్మాణాలు, తదితర పనులు చేసుకున్నామన్నారు. జిల్లా ఇంచార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ కుమార్ జిల్లా అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ ంముఖ్యమంత్రి చంద్రబాబుకి జిల్లా మౌలిక సదుపాయాలు, ఆక్వా రైతులు, కొల్లేరు సమస్యలను దృష్టికి తీసుకొస్తా మన్నారు. కూటమి ప్రభుత్వం మూడు పార్టీ నాయకులు కలిసికట్టుగా సంక్షేమం, అభివృద్ధి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ, ముఖ్యమంత్రి కార్యాలయ భద్రతా అధికారులు, ఏఎస్పీలు నక్కా పూర్ణచంద్ర రావు, ఆర్.సుస్మిత, మాజీ శాసనసభ్యులు ఘంటా మురళీరామకృష్ణ, ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్, డిఎస్పీలు, జిల్లా, మండల వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# దిత్వా తుపాను నష్టాన్ని తగ్గించడానికి యంత్రాంగమంతా సంసిద్ధంగా ఉండాలి

## మంత్రి కొలుసు పార్థసారధి



బాపట్ల, నవంబర్ 30 ప్రభాతవార్త: దిత్వా తుపాను నష్టాన్ని తగ్గించడానికి జిల్లా యంత్రాంగమంతా సంసిద్ధంగా ఉండాలని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల, గృహ నిర్మాణశాఖల మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. దిత్వా తుపాను హెచ్చరికతో ముందస్తు జాగ్రత్త చర్యలపై అన్ని శాఖల జిల్లా అధికారులతో ఆదివారం ఆయన స్థానిక కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత తుపాను అనుభవాలతో మరింత సమర్థంగా, అధికారులు స్ఫూర్తితో పనిచేయాలన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు అప్రమత్తం కావాలన్నారు. జిల్లాలో అద్దంకి, చిన్నగంజాం మండలాలకు హై అలర్ట్ ఉందన్నారు. గత తుపానులో జిల్లా యంత్రాంగమంతా కలెక్టర్ నాయకత్వంతో సమష్టిగా పని చేశారని అభినందించారు. అదే విధంగా రానున్న భారీ వర్షాలను సమర్థంగా ఎదుర్కోవడానికి సంసిద్ధం కావాలన్నారు. జిల్లాలో తీర ప్రాంతం అధికంగా ఉన్నందున ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఎన్ని ఉన్నాయి, బోట్లు అన్ని తీరానికి వచ్చాయా లేదా పునఃపరిశీలన చేయాలన్నారు. మత్స్యకారులను సముద్రంలోనికి వెళ్ళనీయ రాదన్నారు. విద్యుత్ సరఫరాకు ఏదైనా సమస్య వస్తే తక్షణమే స్పందించాలన్నారు. సాగు నీటి కాల్వలను పరిశీలించుకోవాలన్నారు. భారీ వర్షాలకు అధిక నీరు ప్రవాహంతో కల్వర్టులు, చెరువులు, కాల్వల గట్లు తెగకుండా ముందస్తు చర్యలు తీసుకోవా లన్నా రు. కాల్వలు, రహదారులు పొంగి పొర్లిపారే ప్రాంతాలను గుర్తించి మందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ధాన్యం పండించిన ఏ ఒక్క రైతుకు నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షం అధికం గా కురిస్తే వరి పంటకు నష్టం జరగ కుండా వాటిని దిగువ ప్రాంతాలకు వెళ్లే మార్గం చేయాలన్నారు. సమస్యలు ఏర్పడితే తక్షణమే సహాయక చర్యల కొరకు 630 మంది వ్యక్తులను 42 బృందాలుగా ఏర్పరిచామన్నారు. రైతులకు నష్టం జరగకుండా విస్తృత ప్రచారం చేశామన్నారు. తుపానుతో పోలీసు యంత్రాంగం అప్రమత్త మైందని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ రావు తెలిపారు. ఐదు మండలాలపై తుపాను ప్రభావం చూపే అవకాశం ఉన్నందున, ఆ ప్రాంతాలలో సిబ్బందిని నియమించామన్నారు. నిరంతరం వైర్లెస్ సెట్‌తో పర్య వేక్షిస్తు న్నామని మంత్రికి వివరించారు. సముద్రంలోకి వేటకు వెళ్లిన మత్స్యకారులంతా తిరిగి వచ్చేసినట్లు సమాచారం అందిందన్నారు. పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. కలెక్టరేట్లోని కమాండ్ కంట్రోల్ రూమ్ అను సంధానంగా పనిచేస్తున్నామని తెలిపా రు. జిల్లా సంయుక్త కలెక్టర్ భావన విశిష్ట. డిఆర్ఓ జి.గంగా ధర్ గౌడ్, అధికారులు పాల్గొన్నారు.



# ప్రపంచ తెలుగు మహాసభలకు రండి

## ఒడిశా గవర్నర్‌కు గజల్ శ్రీనివాస్ ఆహ్వానం

విజయవాడ, నవంబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రపంచ తెలుగు మహాసభలకు రావాలంలూ ఒడిశా గవర్నర్ కె.హరిబాబును ఆంధ్ర సారస్వత పరిషత్తు, అధ్యక్షులు, డా.గజల్ శ్రీనివాస్ ఆహ్వానించారు. ఈ మేరకు ఆయనకు ఆహ్వాన పత్రికను అందజేసారు. ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 3 నుండి 5 వరకు గుంటూరులో 3వ ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. జనవరి 3న నిర్వహించే "పూర్ణకుంభ పురస్కార సభకు ముఖ్యఅతిథిగా రావాలని ఒడిశా గవర్నర్ కె.హరిబాబును భువనేశ్వర్‌లో కలసి ఆహ్వానించినట్లు గజల్ శ్రీనివాస్ తెలిపారు. గవర్నర్ సానుకూలంగా స్పందించారని, "తెలుగు మాట ప్రతి నోట" అన్న మహా సంకల్పంతో ప్రజలందరూ పయనం చేయాల్సిన అవసరం ఉన్నదని కె. హరిబాబు అభిప్రాయం పడ్డారని గజల్ శ్రీనివాస్ తెలిపారు.



తలస్సేమియా వ్యాధిగ్రస్తులకు రక్తమార్పిడి కేంద్రాన్ని నప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఐఆర్‌సీఎస్ ఎన్‌టీఆర్ జిల్లా ఛైర్మన్ డా. సమరం

# తలసీమియా వ్యాధిగ్రస్తులకు రెడ్‌క్రాస్ అమ్మ లాంటిది

## ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ, నవంబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి: తలస్సేమియా వ్యాధిగ్రస్తులకు అమ్మలాంటి సంస్థ రెడ్‌క్రాస్ అని ఈ సంస్థ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఎన్‌టీఆర్ జిల్లా) ఆధ్వర్యంలో శనివారం విజయవాడ, గాంధీనగర్‌లోని రోటరీ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో తలస్సేమియా వ్యాధిగ్రస్తులకు రక్త మార్పిడి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఐఆర్‌సీఎస్ ఎన్‌టీఆర్ జిల్లా ఛైర్మన్ డా. సమరం తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఇదో మంచి కార్యక్రమమని.. తలస్సేమియా వ్యాధిగ్రస్తులకు రెడ్‌క్రాస్ నిస్వార్థంగా సేవలందిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో తలస్సేమియా వ్యాధిగ్రస్తులు దాదాపు రెండు వేల నుంచి మూడు వేల వరకు ఉన్నట్లు పేర్కొన్నారు. తలస్సేమియా వ్యాధిగ్రస్తులకు ఉన్నతమైన ఆరోగ్య జీవితాన్ని అందించేందుకు రెడ్‌క్రాస్ కృషిచేస్తోందన్నారు. రాష్ట్ర గవర్నర్ దార్శనికతకు అనుగుణంగా సమష్టి కృషితో రెడ్‌క్రాస్ సేవలను విస్తృతం చేసేందుకు కృషిచేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఎన్‌టీఆర్ జిల్లా) వైస్ ఛైర్మన్ డా. వి.జోషి, కార్యదర్శి ఇ.చిట్టిబాబు, మెడికల్ ఆఫీసర్ డా. మదన్, హెమటాలజిస్టు (హెచ్‌సీజీ) హాస్పిటల్ డా. అమర్‌నాథ్, ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

# పెంచలయ్య హంతకులను శిక్షించాలి

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్

అనంతపురం, నవంబరు 30 ప్రభాతవార్త బ్యూరో: రాష్ట్రంలో గంజాయి అమ్మకాలు అత్యంత ప్రమాదంగా మారాయని, విచ్చలవిడిగా మద్యం బెల్ట్ షాపులు, గంజాయి అమ్మకాలు సాగుతున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులే లక్ష్యంగా చిలువుడిగా గంజాయి అమ్మకాలు సాగుతున్నాయని, గంజాయి అమ్మకాలపై ఉక్కుపాదం మోపుతామని సిఎం, డిప్యూటీ సిఎం మాటలకు ఆచరణలో జరుగుతున్న దానికి పొంతనలేదని ఆయన ఆక్రోషం వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లాలోని ఆర్డీటీ కాలనీలో జరిగిన సిపిఎం నేత పెంచలయ్య హత్యపై సిపిఎం అనంతపురం జిల్లా కమిటీ తీవ్రంగా నిరసించింది. పెంచలయ్య హంతకులను కఠినంగా శిక్షించాలని అనంతపురం నగరంలోని నీలిమా సర్కిల్ వద్ద ఆదివారం మానవహారం నిర్వహించారు.

నగర కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వి.రాంభూపాల్, జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, బి.శ్రీనివాసులు, ఆర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎం.కృష్ణమూర్తి, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వి.నిర్మల, టి.రామాంజనేయులు, నగర నాయకులు వలి, ఇర్ఫాన్, మసూద్, ప్రకాష్ రెడ్డి, నాయకులు చంద్రిక, అశ్విని, రాజా తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విచ్చలవిడిగా గంజాయి మద్యం బెల్ట్ షాపుల వల్ల శాంతి భద్రతలకు తీవ్ర ప్రమాదం ఏర్పడిందన్నారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి వెంటనే స్పందించి పెంచలయ్యను హత్య చేసిన వారినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ ఆయన చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప మాట్లాడుతూ.. పెంచలయ్యను హత్య చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

● జగన్‌దంతా దగా పాలన ● ఎన్నికల హామీ మేరకు సూపర్ సిక్స్ హామీలు అమలు చేశాం

● ముఖ్యమంత్రి సహాయ నిధి, కార్యకర్తల సంక్షేమ నిధితో అండ ● మంత్రి కొల్లు రవీంద్ర



విజయవాడ, నవంబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి: పేదలకు అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మచిలీపట్నం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజల నుండి వినతులు స్వీకరించారు. 26 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.15.62 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 455 మందికి రూ.5 కోట్లు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి అందించినట్లు తెలిపారు. అదే సమయంలో పార్టీ కార్యకర్తలకు సంక్షేమ నిధి నుండి ఆర్థిక సాయం అందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన ముగ్గురికి పార్టీ సంక్షేమ నిధి నుండి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాం. కరగ్రహారంకు చెందిన వల్లభనేని మస్తాన్, 13వ డివిజన్ రామానాయుడు పేటకు చెందిన పట్నాల సుబ్బారావు కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందినట్లు తెలిపారు. కష్టంలో ఉండే ప్రతి పేద వారికి అండగా నిలిచినపుడే అసలైన సంతృప్తి అన్నారు.

రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి రంగంలో అభ్యున్నతి పథంలో నడిపించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవలో కవర్ కాని చికిత్సలకు ప్రభుత్వం నుండి ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్లు అందిస్తున్నాం. వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నాం. ఎన్నికల్లో ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేశాం. ఉచిత గ్యాస్, ఉచిత బస్సు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను హామీ మేరకు అమలు చేసి చూపించాం. పేదలకు సంక్షేమ పథకాలు అందించే విషయంలో చిత్తశుద్ధితో పని చేస్తున్నాం.

విశాఖ కేంద్రంగా రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చాం. గూగుల్ రాకతో అదానీ, రిలయన్స్ కూడా డేటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకొచ్చాయి.

మెడికల్ కాలేజీల విషయంలో వైసీపీ నేతలు రాద్ధాంతం చేయాలనుకుని బొక్కబోర్లా పడ్డారు. గత ఐదేళ్ల పాలనా కాలంలో మెడికల్ కాలేజీలు పూర్తి చేయకుండా కమిషన్లు దండుకున్నారు. కానీ కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు పూర్తి చేయాలని నిర్ణయించాం. మెడికల్ విద్య, వైద్యంలో ఎక్కడా రాజీ పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజల్ని రెచ్చగొట్టి కాలం నెట్టుకు రావాలనుకునే జగన్ రెడ్డి లాంటి అరాచక శక్తులకు బుద్ధి చెబుతామని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

కార్యక్రమంలో బీజేపీ ఇంఛార్జి సోడిశెట్టి బాలాజీ, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ లంకె నారాయణప్రసాద్ గారు, టౌన్ పార్టీ అధ్యక్షులు లోగిశెట్టి స్వామి గారు, క్లస్టర్ ఇంఛార్జి పల్లపాటి సుబ్రహ్మణ్యం, టౌన్ పార్టీ ఉపాధ్యక్షులు బత్తుల అనిల్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ బాబాప్రసాద్, జనసేన ఇంఛార్జి బండి రామకృష్ణ, పిప్పళ్ల వెంకన్న, టౌన్ పార్టీ మాజీ అధ్యక్షులు ఇలియాస్ బాషా, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఫణికుమార్, మండలపార్టీ అధ్యక్షులు కాగిత వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.




# రాయలసీమ వారసత్వ స్ఫూర్తిని కవులు సమాజానికి అందించాలి

## విశ్రాంత వైస్ ఛాన్సలర్ కాడ రామకృష్ణారెడ్డి పిలుపు

అనంతపురం, నవంబరు 30 ప్రభాతవార్త బ్యూరో: రాయలసీమ వారసత్వ స్ఫూర్తిని కవులు కళాకారులు సమాజానికి అందించాలి. రాయలసీమ సమాజం చైతన్యం కోసం కవులు చైతన్య వారధులుగా నిలవాలని రాయలసీమ మహాకవి సమ్మేళనంలో ముఖ్య అతిధిగా విచ్చేసిన విశ్రాంత ఉపకులపతి ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. రాయలసీమ నేల చారిత్రక, సాంస్కృతిక నెలవైనదని భావితరాలకు ఆ వారసత్వ స్ఫూర్తిని కవులు సమాజానికి అందించాలని ఆయన కోరారు. రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో డల్లాస్ ఏరియా రాయలసీమ అసోషియేషన్ సౌజన్యంతో అనంతపురంలోని జిల్లాపరిషత్ ప్రాంగణ సమావేశ మందిరంలో ఆదివారం 180 మంది కవులతో సీమ ప్రసిద్ధ ప్రదేశాలపై రాయలసీమ కవిసమ్మేళనం జరిగింది. రాయలసీమ సాంస్కృతిక వేదిక సమన్వయకర్త డా.అప్పిరెడ్డి, హరినాథరెడ్డి కవి సమ్మేళనాన్ని సమన్వయం చేసారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయితలు బండి నారాయణ స్వామి, శాంతి నారాయణ, ఏలూరి యంగన్న, సడ్లపల్లి చిదంబరరెడ్డి తదితర సాహిత్య ప్రముఖులు, విశ్రాంత ఆచార్యులు లక్ష్మినారాయణరెడ్డి, రవీంద్రారెడ్డి, మానవతా రక్తదాతల బృందం కన్వీనర్ తరిమెల అమరనాథరెడ్డి, రైతుసంఘం నాయకులు శ్రీనివాసరెడ్డి, సీమ ప్రజా సంఘాల నాయకులు వెంకటేష్, రాహుల్ తదితరులు పాల్గొని ఈ కార్యక్రమంలో తమ సందేశాలు ఇచ్చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి కార్యక్రమంలో పాల్గొన్న కవులందరికి నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

# 66 సివిల్ జడ్జి పోస్టుల భర్తీ

## నోటిఫికేషన్‌ను జారీ చేసిన హైకోర్టు రిజిస్ట్రార్

**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 66 సివిల్ జడ్జి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయింది. తెలంగాణ రాష్ట్ర జ్యుడిషియల్ సర్వీసులో సివిల్ జడ్జీస్ (జూనియర్ డివిజన్) స్థాయిలో 66 పోస్టులను భర్తీ చేయడానికి ఆన్‌లైన్ పద్ధతిలో అర్హులైన వారినుండి ధరకాస్తులను ఆహ్వానిస్తున్నట్టు తెలంగాణ హై కోర్ట్ రిజిస్ట్రార్ తెలియచేశారు. ఈ సివిల్ జడ్జిల (జూనియర్ డివిజన్) పోస్టులకు ఈ నెల 8వ తేదీ నుండి 29 తేదీ మధ్యలో దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా పంపాల్సి ఉంటుందని నోనటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ పోస్టుల పరీక్షలకు సంబంధించిన తేదీలు, హాల్ టికెట్ల డౌన్‌లోడ్, కంప్యూటర్ ఆధారిత స్క్రీనింగ్ పరీక్ష తదితర వివరాలను వెబ్ సైట్‌లో ప్రకటించడం జరు గుతుందని రిజిస్ట్రార్ తెలిపారు. ఈ నోటిఫికేషన్ వివరాలను హైకోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు ప్రకటనలో తెలిపారు.

# రైతులకు కృత్రిమ మేధస్సు, మెషీన్ లెర్నింగ్

**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** వ్యవసాయంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందుబాటులోకి రానుంది. వాతావరణ వైవిధ్యానికి అనుగుణంగా, జాతీయ మరియు అంతర్జాతీయ సంస్థల సహకారంతో ఇంటర్నేషనల్ క్రాప్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ ది సెమీ-అరిడ్ ట్రాపిక్స్ (ఇక్రీశాట్) రైతులకు రియల్‌టైమ్, వ్యక్తిగతీకరించిన వాతావరణ సలహా సేవలను అందించడానికి కృత్రిమ మేధస్సు (ఆర్టీఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ)), మెషిన్ లెర్నింగ్ (ఎమ్ఎల్) లను ఉపయోగించుకునే కొత్త చొరవను ప్రారంభించింది. కృత్రిమ మేధస్సు ఆధారిత ఈ ప్రాజెక్ట్, చిన్న రైతులను హైపర్ లోకల్, కార్యాచరణ వాతావరణం మరియు వాతావరణ అంతర్‌రాష్ట్రాల కృషితో సన్నద్ధం చేయడం లక్ష్యంగా పెట్టుకుని ప్రారంభించింది. రుతుపవనాల సమయంలో అభివృద్ధి చేయబడిన ఇంటెలిజెంట్ సిస్టమ్స్ అడ్వైజరీ టూల్, పైలట్ చేయబడిన డిజిటల్ ప్లాట్‌ఫామ్‌గా అందుబాటులోకి తీసుకొస్తోంది. సంక్లిష్ట వాతావరణం, వ్యవసాయ డేటాను వ్యక్తిగతీకరించిన, సైన్స్ ఆధారిత సలహాగా సరళీకరించడానికి ఇంటిలిజెంట్ సిస్టమ్స్ ఆధారిత వ్యవస్థగా అప్‌గ్రేడ్ చేయబడుతోంది. వీటి ద్వారా రైతులకు నిజ సమయ (రియల్ టైమ్) వాతావరణ సూచనలు, పంట నమూనాలు, యంత్రాల వినియోగం తదితర వాటి విశ్లేషణలను సమగ్రపరచడం ద్వారా, ఇది రైతులకు విత్తనాలు, నీటిపారుదల మరియు తెగులు నిర్వహణపై కార్యాచరణ సిఫార్సులను అందిస్తుంది. మారుమూల ప్రాంతాలలో కూడా నిర్ధారించే కృత్రిమ మేధస్సు ఆధారిత వాట్సాప్ బాట్‌తో సహా వినియోగదారుస్నేహపూర్వక డిజిటల్ ఛానెల్‌ల ద్వారా సలహాలు అందించబడతాయి. ఈ అధునాతన పరిజ్ఞానాన్ని తొలుత చిన్న భూస్వామ్య రైతులపై దృష్టి సారిస్తుంది.



ప్రసంగిస్తున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి

# లౌకికవాదం, సామాజిక న్యాయాలను కాపాడుకోవాలి

## సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి

**హైదరాబాద్ (చిక్కడపల్లి), నవంబరు 30, ప్రభాతవార్త:** రాజ్యాంగ మౌలిక సూత్రాలైన లౌకికవాదం, సామాజికన్యాయాలను కాపాడుకోవాలని సుప్రీం కోర్ట్ మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి అన్నారు. ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 75 సంవత్సరాల భారత రాజ్యాంగం, లౌకికతత్వం, సామాజికన్యాయంపై రౌండ్‌టేబుల్ సమావేశం తెలంగాణ హై కోర్ట్ సీనియర్ న్యాయవాది జి విద్యాసాగర్ అధ్యక్షతన జరిగింది. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ అనేకమంది మేధావులు, సామాన్యులు తమ అభిప్రాయాలతో భారత రాజ్యాంగం ఏర్పడిందని చెప్పారు.

ప్రస్తుతం రాజ్యాంగంతోపాటు పై రెండు అంశాలు ప్రమాదంలో పడ్డాయని, వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని అన్నారు. రాజ్యాంగం పై ప్రమాణం చేసిన పార్లమెంట్ సభ్యుల పై రాజ్యాంగ పరిరక్షణ,లౌకికవాదం, సామాజిక న్యాయాన్ని కాపాడవలసిన బాధ్యత ఉన్నది అని చెప్పారు.వాటి అమలులో తప్పులు జరిగినప్పుడు పార్లమెంట్ సభ్యులపై పౌరులే వత్తిడి తీసుకొని వచ్చి అమలు జరిగేలా చూసుకోవాలని తెలియజేశారు.

వివిధ సంఘాల నుండి హాజరైన ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు జస్టిస్ సుదర్శన్ రెడ్డి రెండు గంటలపాటు సమాధానాలు చెప్పారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె పార్థసారథి,వేదిక సభ్యులు కామేశ్ బాబు,డి ఏ ఎస్ వి ప్రసాద్,కె ఉమామహేశ్వర రావు, విద్యార్థి, యువజన, రైతు, కార్మిక, మహిళా, న్యాయవాద, సామాజిక, రచయితల, జర్నలిస్ట్, గిరిజన, ఐఎఎస్ అకాడమీల నుండి ప్రతినిధులు హాజరయ్యారు.వందన సమర్పణ డిఏఎస్‌వి ప్రసాద్ చేశారు.

# కమ్యూనిస్టుల ఐక్యత చారిత్రక అవసరం


## కమ్యూనిస్టు జెఎసి రౌండ్‌టేబుల్ సమావేశం

**హైదరాబాద్ (చిక్కడపల్లి), నవంబరు 30, ప్రభాతవార్త:** కమ్యూనిస్టుల ఐక్యత చారిత్రక అవసరమని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో కమ్యూనిస్ట్ జేఏసీ ఆధ్వర్యంలో కమ్యూనిస్టులను ఐక్యం చేయడానికి మనం ఏమి చేద్దాం అనే అంశంపై కోలా జనార్ధన్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. పేర్కొన్నారు. ఈ సమావేశానికి విశ్రాంత హై కోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించగా సభలో సీనియర్ కమ్యూనిస్ట్ నాయకుడు కందిమళ్ల ప్రతాప్ రెడ్డి, ప్రముఖ సామజిక విశ్లేషకుడు పాశం యాదగిరి, శాసనమండలి సభ్యుడు నెల్లికంటి సత్యం, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి అతిథిలుగా పాల్గొన్నారు. కమ్యూనిస్ట్ జేఏసీ కోఆర్డినేటర్ నాగమోని చిన్న రాములు ప్రసంగించారు. దేశంలోని పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులు, బహుళజాతి సంస్థలు, దేశ సహజ సంపద భూమి, అడవులు, ఖనిజ సంపదను దోచుకోవడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దళారిగా వ్యవహరిస్తూ ఆదివాసీలను, రైతులను, కార్మికులను అణిచివేసేందుకు రాజ్యాంగ వ్యతిరేకంగా వ్యవహరిస్తూ చట్టాలను ఉల్లంగిస్తూ రైతు వ్యతిరేక చట్టాలను తీసుకురావడం దారుణమని విమర్శించింది. అంతేకాకుండా నాలుగు కార్మిక కోడ్ లను అమలు చేస్తూ అప్రకటిత ఎమర్జెన్సీ విధిస్తు అణచివేత కొనసాగిస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ క్లిష్ట సమయంలో ప్రజల మోలిక హక్కుల కోసం, ప్రాథమిక హక్కుల రక్షణ, జీవించే హక్కులను కాపాడుకోవడానికి కమ్యూనిస్టులు ఐక్యం కావాల్సిన చారిత్రక అవసరం అని సూచించింది. ఇరు పార్టీ విభేదాలు, విధానపరమైన వైరుధ్యాలను పక్కపెట్టి కనీస అంగీకృత అంశాలపై ఉమ్మడి కార్యాచరణ రూపొందించుని కమ్యూనిస్టులు, కమ్యూనిస్ట్ పార్టీలు, ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంసిపిఐ నాయకులూ గాదగోని రవి, ఎస్ యూ సి ఐ నాయకులు మురహరి, తెలంగాణ ఉద్యమ నాయకులు జి.రాంచందర్ రావు, నారాయణ రావు, పొన్నం దేవరాజ్ గౌడ్, సతీష్ రెడ్డి, శ్రీరాముల శ్రీనివాసులు, ఇంద్రవెల్లి రమేష్, సంజీవ్ కుమార్, కే.దేవేరి, బాలచందర్, పెండ్యాల మధుసూధనా చారి తదితరులు పాల్గొన్నారు.

# ఎనర్జీ ఎఫిషియన్సీకి మద్దతు

## ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** అసిస్టెన్స్ ఇన్ డిప్లాయింగ్ ఎనర్జీ ఎఫిషియంట్ టెక్నాలజీస్ ఇన్ ఇండస్ట్రీయల్ ది ఎస్టాబ్లిష్‌మెంట్ (ఎడిఇఎటిఐ) పథకానికి పూర్తి మద్దతు ఇస్తున్నట్లు పరిశ్రమలు, ఐటీ మంత్రి డి శ్రీధర్‌బాబు తెలిపారు. ఎంఎస్‌ఎంఈ రంగాలను ఆర్థిక బలోపేతం చేయడంలో ఈ పథకం ఒక గేం ఛేంజర్ అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం పొందే మొదటి క్లస్టర్‌లలో ఒకటిగా మెదక్ జిల్లాలోని ఫార్మా పరిశ్రమను ఎంచుకున్నందుకున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి ఒక ప్రత్యేక నివేదికను ఆదివారం మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పథకం కింద ఇంధన సామర్థ్య ప్రాజెక్టులను సమర్థవంతంగా అమలు చేయడానికి సమగ్ర రోడ్‌మ్యాప్‌ను రూపొందించాలని అధికారులకు సూచించారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్రవ్యాప్తంగా ఎంఎస్‌ఎంఈలకు నిజమైన గేమ్‌ఛేంజర్‌లుగా మారగలవని పేర్కొన్నారు. ముఖ్యంగా వీటిలో రసాయనాలు, ఆహార ప్రాసెసింగ్, స్టీల్ రీరోలింగ్ మరియు ఇతర రంగాలకు ఆర్థిక, పర్యావరణ లాభాలను కల్పించాలని కోరారు. కీలకమైన పారిశ్రామిక క్లస్టర్‌లను ఇంధన సామర్థంతో కూడినవిగా చేయడం కేవలం తక్కు ఖర్చుతో కూడుకున్నదే కాకుండా ఉత్పాదకతను పెంచుతుందని వ్యక్తం చేశారు. తద్వారా ఎంఎస్‌ఎంఈల బలోపేతం, స్థిరమైన అభివృద్ధికి ఇది దోహదం చేస్తుందని చెప్పారు. 2035 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యాన్ని సాధించడానికి రాష్ట్రం జాతీయ స్థాయిలో కలిసి పనిచేస్తుందని చెప్పారు. 2035 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా మార్చడానికి అన్ని వాటాదారులూ కృషి చేయాలని తెలిపారు. ఇంధన సామర్థం, పునరుత్పాదక ఇంధన వనరుల అమలు మరియు గ్లోబల్ స్టాండర్డ్స్ ఫర్ ఇండస్ట్రియల్ ప్రమోషన్‌లో 24/7 విద్యుత్ సరఫరా అందించడం ఈ భారీ లక్ష్యాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. రాష్ట్రం కేవలం 18 నెలల్లో రూ.3.2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించిందని, ఇది చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసిందని తెలిపారు. హైదరాబాద్ ఇప్పుడు ఆర్ అండ్ డీ, ఏఐ, డేటా సెంటర్ పెట్టుబడులలో దేశంలోని టాప్ మూడు పట్టణ ఎఫ్‌డీఐ గమ్యస్థానాలలో ఒకటిగా ఉందన్నారు. ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్ ఎనర్జీ ఆడిట్స్, వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికలు, ఫైనాన్సింగ్ సహాయం, పర్యవేక్షణ ధృవీకరణ వంటి సహకారాలతో సహా మొత్తం రూ. 9 వేల కోట్లకుపైగా అన్ని రాష్ట్రాలకు ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నామన్నారు.




# వ్యవసాయ, అణుశక్తి, బీమాలో సంస్కరణలు

**సంవత్సరాంతానికి అమలు**

**ప్రపంచ పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యం**

**చట్టాలను పరిశీలిస్తున్న కేంద్రం**

**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** వ్యవసాయ, అణుశక్తి, బీమా రంగాల్లో సంస్కరణలు సంవత్సరాంతానికి వచ్చే అవకాశం ఉంది. ఆయా రంగాల్లో ప్రైవేటు సంస్థలు, విదేశీ కంపెనీల పెట్టుబడులకు అవకాశం కల్పించే దిశగా ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకు అవసరమైన చట్టాలను, ప్రస్తుతం ఉన్న వాటికి సవరణలు తెచ్చేందుకు సిద్ధమవుతోంది. నీతి ఆయోగ్ ప్యానల్ చేసిన ప్రతిపాదనలతో సంస్కరణలకు నడుంకట్టింది. ప్రపంచ కంపెనీలను ఆకర్షించడం, పెట్టుబడుల ప్రక్రియను క్రమబద్ధీకరించడం లక్ష్యంగా సంస్కరణల అమలుకు రంగం సిద్ధం చేస్తోంది. వీటిలో చాలా వరకూ వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో చట్టాలను రూపొందిం చనుంది. ముఖ్యంగా వ్యవసాయం, తోటల పెంపకంలో ఫారిన్ డైరక్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్ (ఎఫ్‌డిఐ) ప్రోత్సహించాలని నిర్ణయించింది.

పొగాకు మినహా గంధం, కోకో, అరటి, మిరియాలు, కనట్, వెదు రు, చెరకు వంటి వాటితో పాటు, సుగంధద్రవ్య వాలకు సంబంధించి 100 శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించేందుకు ప్రస్తుతం ఉన్న చట్టాలను సవరించనున్నట్లు అధికారవర్గాల ద్వారా తెలిసింది. ఆటోమేటిక్ మార్గంలో 100 శాతం విదేశీ పెట్టుబడులు ప్రస్తుతం టీ, కాఫీ, రబ్బరు, ఏలకులు, ఆలివ్ ఆయిల్, పామాయిల్ తోటల పెంపకంలో మాత్రమే అనుమతించింది. అలాగే పూల పెంపకం, ఉద్యానవనం, నియంత్రణ పరిస్థితుల్లో ఉన్న కూరగాయలు, పుట్టగొడుగుల పెంపకం, పశు సంవర్థకం, చేపల పెంపకం, తేనెటీగల పెంపక రంగాలకు సైతం అందుబాటులో ఉండ నుంది. మరో కీలకమైన బీమాకు సంబంధించి 2020 విదేశీ పెట్టుబడుల విధానాన్ని సవరిం చడం, భారత్‌లో తమ మొత్తం ప్రీమియంను పెటుట్బడి పెట్టే బీమా కంపెనీలకు ఎఫ్‌డిఐ పరిమితిని 74 నుండి 100 శాతం పెంచాలని భావిస్తోంది. దీని కోసం బీమా చట్టాల సవరణ బిల్లు-2025 తీసుకురానుంది.

ఈ బీమా రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందే పరిస్థితులకు మాత్రమే పరిమితం చేస్తుందని అధికారులు చెబుతున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం బదిలీ నిబంధనలను తొలగించే ప్రయత్నంలో భాగంగానే ఈ ప్రతిపాదనగా కేంద్ర వర్గాలు వెల్లడించాయి.

విదేశీ పెట్టుబడుల పరిమితిని 49 శాతం నుండి 74 శాతానిక పెంచడానికి అవకాశం కల్పించనుంది. ఇక అణుశక్తి విషయంలో ఈ రంగం వృద్ధికి ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం అవసరమని కేంద్రంలో విస్తృత అభిప్రాయం ఉంది. కేంద్రం ఇప్పటికే అణుశక్తి బిల్లు 2025ను ప్లామెంట్ సమావేశానికి జాబితా చేసింది. ఇది ప్రధాన విధాన మార్పులతో పాటు, ఎఫ్‌డిఐ పాలనను అనుమతించే అవకాశం ఉంది.

# టెట్‌కు 2,37,754 దరఖాస్తులు

**ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల నుంచే 71,670**

**నేటి సాయంత్రం వరకు ఎడిట్ సౌకర్యం**

**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కి సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. టెట్-2026కి భారీగా దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు గడువు ముగిసేనాటికి 2,37,754 దరఖాస్తులు వచ్చాయి. టెట్ పరీక్షకి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు భారీగా దరఖాస్తు చేసుకున్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయల నుంచి 71670 దరఖాస్తులు వచ్చినట్టు పాఠశాల విద్య డైరక్టర్, టెట్-2026 ఛైర్‌పర్సన్ నవీన్ నికోలస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

శనివారం అర్ధరాత్రి 11.59 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. దరఖాస్తు గడువులోపు పేపర్-1కి ఇన్ సర్వీస్ ఉపాధ్యా యుల నుంచి 27,389 దరఖాస్తులు రాగా.. ఇతరుల నుంచి 58,149 దరఖాస్తులు కలిపి మొత్తం పేపర్-1కి 85,538 దరఖాస్తులు వచ్చాయి.

పేపర్-2కి సంబంధించి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల నుంచి 44,281 దరఖాస్తులు రాగా.. ఇతరుల నుంచి 1,07, 935 దరఖాస్తులతో కలిపి మొత్తం పేపర్-2కి 1,52,216 దరఖాస్తులు వచ్చాయి. పేపర్-1, 2కి కలిపి 2,37,754 దరఖాస్తులు వచ్చాయి. టెట్-2026కి దరఖాస్తు చేసుకున్న వారు తమ దరఖాస్తులో తప్పులు ఉంటే ఎడిట్ చేసుకోవడానికి నేటి(సోమవారం) వరకు ఎడిట్ సౌకర్యానికి అవకాశం కల్పించారు. టెట్-2026 నోటిఫికేషన్ వెలువడిన మొదటి రోజు(నవంబర్14) నుంచే దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నారు. టెట్-2026 పరీక్షలను జనవరి 3 నుంచి 31 వరకు నిర్వహించనున్నారు.

పరీక్షలకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను త్వరలోనే విడుదల చేయను న్నట్టు అధికారులు ప్రకటించారు. టెట్-2026 ఫలితాలను ఫిబ్రవరి 10 నుంచి 16 మధ్యలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# బిసిలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలి

## 10న ఢిల్లీలో ఒబిసిల జాతీయస్థాయి సదస్సు

## కేంద్రం కుల గణన చేపట్టడం దేశచరిత్రలో రికార్డు

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), నవంబరు 30, ప్రభాత వార్త:** బిసిలకు పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ హాలో బిసి-చలో ఢిల్లీ' పేరిట డిసెంబరు 10న ఢిల్లీలో ఓబిసిల జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఈ సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు.

ఈ జాతీయ స్థాయి సదస్సుకు తెలంగాణ, ఎపి రాష్ట్రాల నుంచే కాకుండా ఒబిసిలు కర్ణాటక, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున పాల్గొంటారని, సదస్సులో 8 మంది కేం ద్ర మంత్రులు, వివిధ పార్టీలకు చెందిన 20 మంది పార్లమెంట్ సభ్యులు, ప్రొఫెసర్లు, మేధావులు పాల్గొంటారని చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తొలి సారిగా జనగణనలో కులగణన చేపడుతున్న దని, ఇది దేశ చరిత్రలో రికార్డుని, 76 సంవత్స రాల చరిత్రలో ఏపార్టీ కూడా కులగణన చేపట్ట లేదని, బిసిలకు అన్ని రంగాలలో ముఖ్యం గా ఆర్థిక, సామాజిక, రాజ కీయ, విద్యా , ఉద్యోగ రంగాలలో వాటా, కోటా లభిసు_ందని, ఇదోక విప్లవాత్మకమైన మార్పుని ఆయన వివరించారు. కులగణన తరువాత కేంద్రం చట్టసభలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు, బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ, జనాభా ప్రకారం విద్యా, ఉద్యోగ రిజర్వే షన్‌లు పెంపువంటి చారిత్రాత్మకమైన నిర్ణయాలను తీసుకుంటున్నదన్న అశాభావాన్ని ఆర్.కృష్ణయ్య వ్యక్తం చేశారు. బిసిల అన్ని రంగాల అభివృద్ధి నరేంద్రమోడీ ద్వారానే సాధ్యమవుతుందన్నారు. సమావేశానికి సంఘం జాతీయ కార్యదర్శి బాణాల అజయ్‌కుమార్ అధ్యక్షత వహించగా, బిసి నేతలు నీల వెంకటేష్, రాజేందర్, అనంతయ్య, రాజ్‌కుమార్, మోదీ రాందేవ్, అఖిల్, బాలయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# టెట్ నుంచి ఇన్‌సర్వీస్ టీచర్లు మినహాయింపునకు పోరాటం

## కేంద్ర విద్యాశాఖ మంత్రికి టీచర్ ఎమ్మెల్సీల విజ్ఞప్తి

## పార్లమెంట్ సమావేశాల్లో చట్టసవరణ చేయాలంటున్న టీచర్లు

**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకి టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి చేస్తూ సెప్టెంబర్ 1న సుప్రీంకోర్టు జారీ చేసిన తీర్పును ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. సీనియర్ ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని, టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాలతోపాటు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. నేటి నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఇందుకు సంబంధించిన చట్టసవరణను చేయాలని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు, ఎమ్మెల్సీలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఉద్యోగంలో కొనసాగుతున్న ఉపాధ్యాయులు కూడా ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఉత్తీర్ణత కావాలని దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ఈ ఏడాది సెప్టెంబర్ 1న తీర్పునిచ్చింది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో టెట్ నుంచి ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకి మినహా యింపు ఇప్పించేలా కేంద్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయ సంఘాల నుంచి వచ్చిన విన్నపాల నేపథ్యంలో ప్రభుత్వం తరపున పాఠశాల విద్య శాఖ సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసింది. దాంతోపాటు పలు ఉపాధ్యాయ సం ఘాలు కూడా సుప్రీంలో రివ్యూ పిటిషన్ దాఖలు చేశాయి. టిఎస్ యూటిఎఫ్, టిఆర్‌టిఎఫ్ సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేశాయి. నల్గొండ-వరంగల్-ఖమ్మం నియోజకవర్గ ఉపాధ్యా య ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి, కరీంనగర్-ఆదిలాబాద్- నిజామాబాద్-మెదక్ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ఇద్దరూ కూడా టెట్ నుంచి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకి మినహా యింపు ఇవ్వాలని కోరుతూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కి, ఎన్‌సిటిఈ ఛైర్మన్‌కి వినతిపత్రాలు సమర్పించారు. టిఎస్ యూటిఎఫ్ .. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి మెయిల్ ద్వారా విజ్ఞప్తి చేయగా.. రాష్ట్రంలోని ఎంపీలకు వినతిపత్రాలు అందజేసింది. విద్యా హక్కు చట్టం అమలు, ఎన్‌సిటిఈ నోటిఫికేషన్‌కి పూర్వం నియామకమైన ఉపాధ్యాయులకు.. ఉపాధ్యాయ అర్హతపరీక్ష (టెట్) నుండి మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు మూలంగా దేశవ్యాప్తంగా 25 లక్షల మంది, రాష్ట్రంలో 45 వేలమంది ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి సుమారు 45వేల మంది ఉపాధ్యాయులు ఇబ్బంది పడనున్నారు. 2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయులకు మినహాయింపునిస్తూ, విద్యా హక్కు చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేస్తు న్నారు. ఎన్‌సిటిఈ నోటిఫికేషన్‌కి ముందు నియామకమైన టీచర్లు టెట్ పరీక్ష వ్రాయాల్సిన అవసరం లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించినందునే గత 15 సంవత్సరాలుగా ఉపాధ్యాయులు టెట్ రాయలేదంటున్నారు. కానీ ఇప్పుడు హఠాత్తుగా రెండేళ్ళలో టెట్ పాస్ కాక పోతే ఉద్యోగానికి ఉద్వాసన పలుకుతామని చెప్పడం సమంజసం కాదని... సుప్రీంకోర్టు తీర్పు వచ్చి రెండు నెలలు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు రివ్యూపిటిషన్ వేయలేదని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేటి(సోమవారం) నుండి జరిగే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో చట్టాన్ని సవరించి సీనియర్ ఉపాధ్యాయుల ఉద్యోగాలకు రక్షణ కల్పించాలని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు డిమాండ్ చేస్తున్నారు.

# సెంచరీ దాటిన కూరగాయలు

## రెట్టింపుపైగా పెరిగిన ధరలు

**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూరగాయల ధరలు దడ పుట్టిస్తున్నాయ్. వంద రూపాయలకే కాదు కొన్ని కూరగాయలు కేజీ 120, 150 రూపాయలు కూడా దాటుతున్నాయి. సాధారణంగా నవంబర్, డిసెంబర్ నెలల్లో కూరగాయల దిగుబడి ఎక్కువగా ఉండి రేట్లు తక్కువగా ఉంటాయ్. ఈ ఏడాది పరిస్థితి రివర్స్ అయ్యింది. వరుస వర్షాలు, మొంథా తుఫాన్ ఎఫెక్ట్‌తో కూరగాయల దిగుబడి భారీగా తగ్గింది. అలాగే రవాణా మార్గాలకు ఆటంకం కల గడం, రవాణా ఖర్చులు పెరగడంతోనూ మార్కెట్లకు కూరగాయల దిగుమతులు తగ్గుతున్నాయి. ఇటు కొత్త పంట చేతికి అందడానికి సమయం పట్టడంతో మార్కెట్‌లో కొరత ఏర్పడుతోంది. ఫలితంగా కూరగాయల ధరలు మండుతు న్నాయ్. తుఫాన్‌కి ముందు కిలో టమటా 30 నుంచి 40 రూపాయలుండేది. ఇప్పుడు 80 నుంచి 100 రూపాయలు పలుకుతోంది. ఆకు కూరలు ఏవైనా కట్ట 30 నుంచి 40 రూపాయలుంటే ఇప్పుడు 80 నుంచి 100 రూపాయలుంది. గోరు చిక్కుడు 30 నుంచి 40 రూపాయలుంటే ఇప్పుడు 60 నుంచి 65 రూపాయలకు పెరిగింది. అలాగే 30 నుంచి 40 రూపాయలకే ఇంటకొచ్చే బెండకాయ ఇప్పుడు హాఫ్ సెంచరీ దాటేసింది. 40 నుంచి 45 రూపాయలుండే బీరకాయ ఇప్పుడు 70 నుంచి 80 పెడితేగానీ సంచిలోకి రానంటోంది. ఇలా కూరగాయల ధరలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో సామాన్య జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 500లతో కూరగాయలు కొనుగోలు చేస్తే చిన్న కుటుంబానికి సైతం వారం రోజులు రావట్లేదంటున్నారు.

# సిఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డితో డైరెక్టర్ రామ్‌గోపాల్‌వర్మ భేటీ

**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు ఎనుముల కొండల్ రెడ్డిని కలిశారు. ఇందుకు సంబంధించిన ఫోటోను వర్మ తన సోషల్ మీడియా ఖాతా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీంతో ఈ పోస్టుకాస్త ఇటు రాజకీయ, అటు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. కొండల్ రెడ్డితో భేటీ గురించి వర్మ తనదైన శైలిలో ఓ ఆసక్తికరమైన వ్యాఖ్యను జోడించారు. "ఈయన రేవంత్ రెడ్డి కాదు.. సింహం లాంటి రేవంత్ సోదరుడు కొండల్ రెడ్డి. తన సోదరుడికి ఉన్నంత బలమైన పట్టు ఈయనకీ ఉంది" అని వర్మ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ పోస్టు కాస్త ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇద్దరి మధ్య భేటీ ఎందుకు జరిగిందనే విషయంపై స్పష్టత లేదు. కేవలం మర్యాదపూర్వక సమావేశమా లేకపోతే మరేదైనా ఇతర కారణం ఉందా అనే దానిపై అందరూ చర్చింకుంటున్నారు. రాజకీయ నేతలు, ప్రముఖులతో డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ సమావేశం కావడం, ఆ తర్వాత వారిపై సినిమాలు ప్రకటించడం చాలా సందర్భాల్లో గతంలో జరిగాయి. ఇప్పుడు కొండల్‌రెడ్డితో భేటీవెనుక కూడా అటువంటి ఉద్దేశమేమైనా ఉందా? లేకపోతే ఇతర కారణాలతో భేటీ అయ్యారా? అని చర్చించుకుంటున్నారు.

# పంచాయతీ ఎన్నికల కోసం పూర్తిస్థాయిలో సిద్ధమవ్వాలి

## రాష్ట్రస్థాయి సమావేశంలో బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్

**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు జరగుతున్న తరుణంలో భారతీయ జనతా పార్టీ కీలక సమావేశం నిర్వహించింది. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో బీజేపీ రాష్ట్ర స్థాయి సంఘటనాత్మక కార్యశాలను ఆదివారం నిర్వహించింది. సమావేశంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌తో పాటు రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు పాల్గొన్నారు. పార్టీ బలోపేతం దిశగా మన ప్రయాణంలో ఇది ఒక కీలక అడుగు అని బిఎల్ సంతోష్, రాంచందర్ రావు అన్నారు. పార్టీ బలోపేతం, బూత్ స్థాయి కార్యక్రమాల విస్తరణ, రాబోయే ఎన్నికల కోసం పూర్తిస్థాయిలో సిద్ధమవ్వడంతో పాటు ఇతర అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. సంఘటిత శక్తి విజయానికి మూలమన్నారు. తెలంగాణలో బీజేపీ విజయం కోసం ప్రతిఒక్కరం కలిసి నడుద్దామని పిలుపునిచ్చారు. కొద్దిరోజుల క్రితం తెలంగాణ బీజేపీలో జిల్లాల బాధ్యతల్లో కీలక మార్పులు చేసిన విషయం తెలిసిందే.

# ప్రాథమిక విద్య బలోపేతానికి చర్యలు తీసుకోవాలి

## టిఆర్‌టిఎఫ్ రాష్ట్ర కార్యవర్గం తీర్మానం

**హైదరాబాద్, నవంబరు 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వ ప్రాథమిక విద్యను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం అత్యవసరంగా వ్యవస్థాపక, విద్యాపరమైన సంస్కరణలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ తీర్మానం చేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్ అధ్యక్షతన ఆదివారం జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేసినట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతులు సరిగా లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య తగ్గుదలతో పాటు ప్రాథమిక స్థాయిలో విద్య నాణ్యతను ప్రభావితం చేస్తున్నాయని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి అన్నారు. ఈ సమస్యలను అధిగమించడానికి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కోతరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తరగతి గదులు, తాగునీరు, మురుగుదొడ్లు, డిజిటల్ మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ అర్హత నిబంధన మినహాయింపుకై సంఘపక్షాన సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయడం జరిగిందని, కేంద్ర ప్రభుత్వం కూడా తదనుగుణంగా చర్యలు చేపట్టి, టెట్ మినహాయింపునకు పార్లమెంట్లో చట్టం చేయాలని కోరారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయుడు(పిఎస్ హెచ్ఎం) పోస్ట్ మంజూరుకు ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని, పదోన్నతుల క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. జీవో 317 అమలు మూలంగా నష్టపోయిన ఉపాధ్యాయులకు తాత్కాలిక డిప్యూటేషన్ అందించడానికి ఇచ్చిన 190 ఉత్తర్వుల మేరకు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. డిసెంబర్ నెలాఖరు నాటికి రాష్ట్ర ప్రభుత్వం కరువు బత్యం ప్రకటించి కొత్త పిఆర్సి అమలుకు చర్యలు చేపడుతుందని నమ్మకముందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మానేటి ప్రతాప్ రెడ్డి, చీఫ్ ప్యాటర్న్ లక్కిరెడ్డి సంజీవ రెడ్డి, రాష్ట్ర మెంబర్షిప్ కన్వీనర్ సంకిశీల ప్రభాకర్ రావు, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ముప్పిడి మల్లయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు దరావత్ రాములు, గజాబీంకర్ గోవర్ధన్, రవికుమార్ పాల్గొన్నారు.



# మీరేం ఆలోచిస్తున్నారు?

ఛ... నిన్న అలా మాట్లాడాల్సింది కాదు, సాయంత్రం వర్షం పడితే ఎలా? పాపకి జ్వరం వస్తుం ఇలా ఎన్నో సందర్భాల్లో ఆలోచిస్తుంటాం కదా! అలాకాకుండా ఎప్పుడైనా ఇలా ఆలోచించారా? మన చేతుల్లో లేనివాటి గురించి ఆలోచించడం వృథా, మనసు భారం అవ్వడం మినహా ఏమీ ఉండదని! సహజం గానే అమ్మాయిలకు అతిగా ఆలోచిసానతరన్న ట్యాగ్ ఉంటూనే ఉంటుంది. ఏం చేస్తాం అదో అలవాటు అని కొట్టేయకండి. ఎందుకంటే ఈచిన్న ఆలోచనతోనే గడిపేయడం వల్ల మన శ్రమంతా వృథా అవుతోంది మరి! చీకట్లో వెళ్తున్నాం. టార్చ్‌లైట్ తీసుకెళతాం కదా! వెళ్లే దారిలో వేస్తామా... లేదంటే ఎటో లైట్ వేస్తూ మరోదారిలో వెళతామా? నడిచే మార్గం కనిపించడానికే వాడతాం కదా! ఆలోచనలూ ఫ్లాష్‌లైట్ లాంటివే నిన్న జరిగిపోయిన, మన చేతిలో లేని వాటి గురించి ఆలోచించడం వలకల లాభమేం ఉండదు. ఒక అధ్యయనం ప్రకారం మనం ఎక్కువగా కంగారుపడేది 90 శాతం నిజానికి జరిగిపోయిన, చేతుల్లో లేనివాటి గురించేనట. దీంతో శక్తి మొత్తం అక్కడే కరిగిపోయి అలసిపోతాం. కొత్త ఆలోచనలకు అడ్డుకట్ట పడుతుంది. అప్పుడు చదువైనా కెరియర్‌లో అయినా ముందుకెలా వెళ్లగలం? కాబట్టి, ఈసారి ఏదైనా ఆలోచన చుట్టుముడుతున్నా, కంగారు పెడుతున్నా ఒక కాగితం మీద రెండు వృత్తాలు గీయండి. తొలిదానిలో ఆ విషయనికి సంబంధించి నేను చేయగలిగినవి, మరోదానిలో నా చేతిలో లేనివి అని రాసుకోండి. ఆపై రెండోదాన్ని వదిలి మొదటి దానిపై దృష్టిపెడితే సరి. ఫలితాలు మెరుగవుతాయి. కాబట్టి మీ ఫ్లాష్ లైట్ అదేనండీ ఆలోచనలు ఎక్కడ కేంద్రీకరిస్తున్నారో అప్పుడప్పుడూ గమనించుకోండి. వాటి దిశ మార్చుకోండి. అప్పుడే ఆందోళనలూ దరిచేరవు. మనమూ ముందుకూ సాగగలరు. గమనించుకుంటారుగా మరి? ◻

# తలలో దురద తగ్గాలంటే..

ఎక్కువ రోజులు నూనె రాసుకోకపోవడం వల్ల మాడు పొడిబారిపోవడం, చుండ్రు, పేలు, ఇలా పలు కారణాల వల్ల తలలో విపరీతమైన దురద పుడుతుంది. దీనివల్ల ఎప్పుడు చూసినా చేతులు తలలోకే వెళ్తుంటాయి. ఈ సమస్య తీవ్రమైతే జుట్టు పటుత్వం కోల్పోయి రాలిపోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి మొదట్లోనే సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టాలి. దీనికీ కొన్ని సహజసిద్ధమైన మార్గాలున్నాయి. అవేంటో చూద్దాం రండి..

**నూనె రాస్తున్నారా? ....** కొంతమంది సమయం లేకనో లేదంటే జిడ్డుగా కనిపించకూడదనే ఉద్దేశంతోనో.. తలకు నూనె రాయరు. దీంతో కుదుళ్ల పొడిబారిపోయి దురదకు దారి తీస్తుంది. అలాగే జుట్టు కూడా నిర్జీవమైపోతుంది. ఫలితంగా కుదుళ్ళ, జుట్టు.. రెండూ ఆరోగ్యాన్ని కోల్పోతాయి. అందుకే కొబ్బరి, బాదం, ఆలివ్.. వంటి సహజసిద్ధంగా లభించే నూనెలను తగిన మొత్తంలో కనీసం వారానికోసారైనఆ రాసుకోవాలి. దీనివల్ల దురద తగ్గే అవకాశం ఉంటుంది. అంతేకాదు జుట్టు కూడా పట్టులా మెరుస్తుంది.

**... మసాజ్ చేయాలి ...** కుదుళ్లకు సరైన రక్తప్రసరణ లేకపోవడం వల్ల కూడా మాడు ఆరోగ్యం దెబ్బ తింటుంది. కాబట్టి నూనె రాసుకునే ముందు దాన్ని కాస్త గోరువెచ్చగా చేసుకుని దాంతో మాడుపై కాసేపు మసాజ్ చేయాలి. దీంతో కుదుళ్లకు రక్తప్రసరణ బాగా జరిగి దురద క్రమంగా తగ్గుముఖం పడుతుంది. నూనె రాసిన తర్వాత జిడ్డుగా ఉంది అనిపిస్తే.. గాఢత తక్కువగా ఉన్న షాంపూతో తలస్నానం చేస్తే తేడా మీకే తెలుస్తుంది.



**నూనె రాస్తున్నారా ? ...** కొంతమంది సమయం లేకనో లేదంటే జిడ్డుగా కనిపించ కూడదనే ఉద్దేశంతోనో.. తలకు నూనె రాయరు. దీంతో కుదుళ్ల పొడిబారిపోయి దురదకు దారి తీస్తుంది. అలాగే జుట్టు కూడా నిర్జీవమైపోతుంది. ఫలితంగా కుదుళ్ల, జుట్టు.. రెండూ ఆరోగ్యాన్ని కోలోనపతాయి. అందుకే కొబ్బరి, బాదం, ఆలివ్.. వంటి సహజసిద్ధంగా లభించే నూనెలను తగిన మొత్తంలో కనీసం వారానికోసారైనా రాసుకోవాలి. దీనివల్ల దురద తగ్గే అవకాశం ఉంటుంది. అంతేకాదు జుట్టు కూడా పట్టులా మెరుస్తుంది.

**మసాజ్ చేయాలి. ...**కుదుళ్లకు సరైన రక్తప్రసరణ లేకపోవడం వల్ల కూడా మాడు ఆరోగ్యం దెబ్బతింటుంది. కాబట్టి నూనె రాసుకునే ముందు దానినన కాస్త గోరువెచ్చగా చేసుకుని దాంతో మాడుపై కాసేపు మసాజ్ చేయాలి. దీంతో కుదుళ్లకు రక్తప్రసరణ బాగా జరిగి దురద క్రమంగా తగ్గుముఖం పడుతుంది. నూనె రాసిన తర్వాత జిడ్డుగా ఉంది అనిపిస్తే.. గాఢత తక్కువగా ఉన్న షాంపూతో తలస్నానం చేస్తే తేడా మీకే తెలుస్తుంది. ◻

# ఆమె 'హానీ ఉమెన్ ఆఫ్ మహారాష్ట్ర'



వ్యాపారం చేయాలన్న కోరిక చాలా మందికి ఉంటుంది. కానీ ఏ వ్యాపారం చేయాలి? ఎందులో లాభాలు ఎక్కువగా వస్తాయి? అన్న విషయాల్లో కొంతమందికి స్పష్టత ఉండదు. మహారాష్ట్రకు చెందిన రోహిణీ పాటిల్ కూడా ఒక దశలో ఇదే డైలమాలో పడి పోయింది. అంతలోనే ఓ వార్తాపత్రికలో వచ్చిన వార్త కంట పడింది. తేనెటీగల పెంపకం, తేన ఉత్పత్తి యాడ్ అది. అనుకున్నదే తడవుగా ఇందులో నైపుణ్యా నేర్చుకొని సొంతంగా ఓ వ్యాపారం ప్రారంభించడమే కాదు.. ప్రస్తుతం పాతిక లక్షల ఆదాయం ఆర్జిస్తోంది. తన చుట్టూ ఉన్న వారికీ ఇందులో శిక్షణ ఇచ్చి వారినీ ఉపాధి దిశగా ప్రోత్సహిస్తోంది. ప్రస్తుతం తేనె ఎగుమతిలో భారత్ ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్నట్లు తాజా గణాంక స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రోహిణి వ్యాపారం తెలుసుకుందాం..

గత ఆర్థిక సంవత్సరంలో మన దేశం 1.07 లక్షల మెట్రిక్ టన్నుల తేనెను ఇతర దేశలకు ఎగుమతి చేసి.. ప్రపంచంలోనే రెండో అతి పెద్ద ఎగుమతి దారుగా నిలిచింది. తద్వారా సుమారు రూ. 15 వేల కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. 2033 కల్లా మన తేనె మార్కెట్ దాదాపు రూ.68 వేల కోట్లు దాటుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో ఎన్నో ఔషధ గుణాలున్న సహజ సిద్ధమైన తేనె ఉత్పత్తిని వ్యాపార మార్గంగా మార్చుకొని రోహిణి సైతం లాభాలు ఆర్జిస్తోంది.

**పేపర్లో యాడ్ చూసి.. !** రోహిణిది మహా రాష్ట్ర సతారా జిల్లాలోని సులేవాడి అనే చిన్న గ్రామం. వ్యవసాయధారిత కుటుంబం కావడంతో.. తాను తన ఫ్యామిలీతో కలిసి ఈ పనుల్లో పాలుపంచుకునేది. అయితే ఒక రాజు ఇలా ఎన్నాళ్లు.. ఏదైనా కొత్తగా వ్యాపారం చేయాలి. నన్ను నేను నిరూపించుకోవాలి. అనుకుందామె కానీ ఎలాంటి వ్యాపారం చేయాలో తనకు స్పష్టత లేదు. ఇలా ఆలోచిస్తున్న క్రమంలోనే ఓసారి ఓ వార్తా పత్రికలో తేనె టీగల పెంపకానికి సంబంధించిన ప్రకటన ఆమె కంటపడింది. ఈ క్రమంలో స్థానిక వ్యవసాయధికారిని సంప్రదిస్తే.. దీనికి సంబంధించి ప్రత్యేక శిక్షణ ఇచ్చే సంస్థ మహాబలేశ్వర్‌లో ఉందన్నారు. అయితే అప్పటికే నాకు ఆరు నెలల బాబున్నాడు. వాడిని వదలి నేను వెళ్లలేను కాబట్టి.. వారినే మా గ్రామానికి వచ్చి శిక్షణ ఇవ్వాల్సిందిగా కోరాను. కనీసం 35 మందితో కూడిన బృందం ఉంటేనే తాము ట్రైనింగ్ ఇవ్వడానికి మా ఊరికి వస్తామన్నారు. దాంతో సంతోషంగా తిరిగొచ్చి శిక్షణ కోసం బృందాన్ని తయారు చేసే పనిలో పడ్డా. మా ప్రాంతంలో చాలామంది మహిళలు కొత్త ఉపాధి అవకాశాల కోసం వెతుకుతుండడంతో.. నేను తేనెటీగల పెంపకం శిక్షణ గురించి చెప్పేసరికి అంతా ఒకే అన్నారు. అలా 35మందికి పైగానే పోగయ్యాం. అంటూ ఆలోచనను ఆచరణలో పెట్టిన తీరు గురించి చెబుతోంది రోహిణి. ప్రస్తుతం ఏడాదికి రూ.25 లక్షలకు పైగా ఆర్జిస్తున్నా. భవిష్యతులో తేనె ఉత్పత్తిని మరింతగా పెంచడంతో పాటు ఆర్గానిక్ ఉత్పత్తులతో ప్రత్యేకంగా ఓ స్టోర్ తెరవాలన కుంటున్నా.. అని చెబుతోన్న ఈ మహిళా వ్యాపారవేత్త.. 'హనీ ఉమన్ ఆఫ్ మహారాష్ట్ర'గా పేరు తెచ్చుకుంది. మనసు పెట్టి కష్టపడితే ఏదైనా సాధించగమంటూ తోటి మహిళల్లో స్ఫూర్తి రగిలిస్తోంది. ◻



# గ్రూప్ స్టడీ మంచిదే !

పిల్లలు ఎవరికి వారు చదువుకోవడం మామూలే. అలా కాకుండా గ్రూప్ స్టడీలో పాల్గొనడం వల్ల ప్రయోజనాలు న్నాయి అంటున్నారు నిపుణులు.

పిల్లలు ఒంటరిగా చదువుతున్నప్పుడు ఏదో మొక్కుబడిగా చదువుతూ బోర్‌గా ఫీలుతుంటారు. కొన్ని సబ్జెక్టులు ఇంకెప్పుడైనా చదువుదాం అని వాయిదా వేస్తుంటారు. అదే వారి స్నేహితులతో గ్రూప్ స్టడీ చేయండి అంటే చాలు ఎంతో ఉత్సాహం చూపిస్తారు. దీనివల్ల వాయిదా విధానాన్ని మానుకుంటారు. ◆ కలిపి చదవడంవల్ల వారిలో బృంద స్ఫూర్తి ఏర్పడు తుంది. మీ పిల్లలు సిగ్గు పడేవారైతే స్నేహితులతో చదవడమే మంచిది. సందేహాలను పంచుకోవడం వల్ల వాళ్లల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయి. బాల్యం నుంచే వారిలో నాయకత్వ లక్షణాలు అలవడతాయి. ◆ ఎవరికి వారు చదువుకునేటప్పుడు తాము చదివిందే కర్టెక్ అనుకుంటారు. దానివల్ల పరీక్షలో తప్పుడు సమాధానాలు రాస్తుంటారు. అదే గ్రూప్ స్టడీ చేయడం వల్ల తప్పొప్పులు సరిచూసుకోగలరు. అంతేకాదు, పిల్లలకు అన్ని సబ్జెక్టులూ సరిగా అర్థం కాకపోవచ్చు. అదే ఒకరికొకరు చెప్పుకోవడంవల్ల తేలికగా నేర్చుకుంటారు. ◻



# అవి కూడా సంకెళ్లే





గౌతమ బుద్ధుడి శిష్యబృందం ఓ రోజు నగరంలో భిక్షాటన చేస్తున్నారు. వీధుల్లో సంచరిస్తున్న ఆ భిక్షువుల సంకెళ్లతో వెళ్తున్న బందీలు కనిపించారు. రాజభటులు ఆ నేరస్థుల కాళ్లూ చేతులకు సంకెళ్ల వేసి కారాగారానికి తరలి స్తున్నారు. వారి దుస్థితికి బాధపడుతూ భిక్షువులు ఆశ్రమానికి చేరుకున్నారు. సాయంత్రం తథాగతుడి ముందు సత్సంగంలో ఆ బందీల ప్రస్తావన తీసుకొచ్చారు. మనుష లకు ఇంతకన్నా దురవస్థ ఇంకేదైనా ఉంటుందా? ఎంత దుర్భరమైన శిక్షకదా?! అని బాధపడసాగారు. అప్పుడు గౌతముడు తన సహజ మందహాసంతో భిక్షువులారా! మీరు చూసినవాటి కన్నా బలమైన సంకెళ్లున్నాయి. వాటి ముందు ఈ సంకెళ్ల ఏ పాటి? దేహానికి బంధించిన ఆకలిదప్పులు, గృహవస్త్రాది తృష్ణలే బలమైన సంకెళ్లు. అవి సామాన్యమైనవి కావు పీడించే బంధాలూ, బంధుత్వాలూ అన్నీ సంకెళ్లే. రాజ భటులు వేసే శిక్షలు కొంత సమయానికి తీరిపోతాయి. కానీ మనసుకు పడే సంకెళ్ళు మృత్యువు ఆసన్నమయ్యే వరకూ బంధించి ఉంచుతాయి. అందుకే జ్ఞానులు తక్కిన అన్ని విషయాల కంటే కోరికలు అనే సంకెళ్లకే ఎక్కువ భయపడతారు అంటూ వివరించాడు. ◻

# శనగపప్పు పూర్ణాలు



**కావలసినవి :** శనగపప్పు, మినపగుండ్లు, బెల్లం-1 కప్పు చొప్పున, బియ్యం - ఒకటింబాబు కప్పు, ఉప్పు-తగినంత, నెయ్యి-చెంచా, యాలకుల పొడి-చిటికెడు, నూనె-వేగడానికి సరిపడా.

**తయారీ :** మినపగుండ్లు, బియ్యం, శనగపప్పులను విడివిడిగా నానబెట్టాలి. 4 గంటల తర్వాత ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేసి 2 గంటలు పక్కన ఉంచాలి. శనగపప్పును కుక్కర్‌లో 4 విజిల్స్ వచ్చే వరకు ఉడికించి, నీరు వడకట్టాలి. చల్లారాక పప్పు గుత్తితో మెదపాలి లేదా మిక్సీలో బరకగా వచ్చేట్లు గ్రైండ్ చేసుకోవాలి. అదే కుక్కర్‌లో పప్పుతో పాటు బెల్లం వేసి చిన్న మంట మీద కలుపుతూ ఉడికించాలి. ఇందులో యాలకుల పొడి వేసి, పిండి గట్టి పడుతున్నప్పు నెయ్యి వేసి దించాలి. చల్లారాక మనకు కావలసిన సైజులో ఉండలు చుట్టి, తయారుచేసుకున్న పిండిలో ముంచి కాగిన నూనెలో బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. ◻

# తెర

# జి.ఓ.ఎ.టి కి బ్యాగ్రౌండ్ మ్యూజిక్ అందిస్తున్న మణిశర్మ



సుడిగాలి సుధీర్ జి.ఓ.ఎ.టి. సినిమాకి బ్యాగ్రౌండ్ మ్యూజిక్ అందిస్తున్న మెలోడీ బ్రహ్మ మణిశర్మజైశ్నవ్ ప్రొడక్షన్, మాహాతేజ క్రియేషన్స్ లో అద్భుతం, టేనంట్ వంటి అద్భుతమైన చిత్రాలని నిర్మించిన మొగుళ్ళ చంద్రశేఖర్ నిర్మాణంలో.. క్రికెట్ నేపథ్యం లోనే కామెడీ ప్రధాన అంశంగా సుడిగాలి సుధీర్, దివ్యభారతి ప్రధాన పాత్రధారులుగా మూవీ జి.ఓ.ఎ.టి. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశకి చేరుకుంది. ఇటీవలే రిలీజ్ చేసిన ఫస్ట్ సింగిల్ ఒడియమ్మ సాంగ్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. లియోన్ జేమ్స్ ఈ పాటని అదిరిపోయే లవ్ మెలోడీ గా కంపోజ్ చేశారు. సుధీర్ బాబు కెరీర్‌లో ఇంత వేగంగా వైరల్ అయిన పాట ఇదే అనే చెప్పాలి. రిలీజ్ అయిన ఒక్కరోజులోనే రికార్డు స్థాయి వ్యూస్‌తో దూసుకుపోయి, సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ఇప్పటివరకు విడుదలైన అన్ని పాటలు హిట్ అంటూ ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన అందుకుంటున్నాయి. దీంతో సినిమా పై బజ్ మరింతగా పెరిగింది.ఇక తాజాగా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కోసం మెలోడి బ్రహ్మ మణిశర్మ టీంలో చేరడంతో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి. సినిమా ఎంతో బాగా వచ్చిందని మేకర్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే గ్రాండ్‌గా విడుదల చేసేందుకు ఏర్పాట్లు జరుపుతున్నారు.

# 'అఖండ తాండవం'లో హై మూమెంట్స్ ఉంటాయి

**ఆది పినిశెట్టి..**



గాడ్ ఆఫ్ మాస్‌నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'అఖండ 2' 14 రీల్స్ ప్లస్ బ్యానర్ మీద ఎం తేజస్విని నందమూరి సమర్పణలో రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మించిన ఈ మూవీని డిసెంబర్ 5న విడుదల చేయబోతోన్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్ ఇలా అన్నీ కూడా అభిమానుల్లో, ఆడియెన్స్‌లోఅంచనాల్ని పెంచేశాయి. సినిమాప్రమోషన్స్‌లో భాగంగా శనివారం నాడు విలక్షణ నటుడు ఆది పినిసెట్టి మీడియాతో ముచ్చటించారు. ఆయన ఈ చిత్రం గురించి చెప్పిన సంగతులివే.

**బోయపాటి శ్రీనుతో రెండోసారి పని చేస్తున్నారు కదా? ఏం తేడా గమనించారు?**

బోయపాటి శ్రీను దర్శకత్వంలో నేను సరైనోడు చిత్రంలో వైరం ధనుష్ అనే పాత్రను పోషించాను. అందులోని పాత్రకి అఖండ 2లో నేను పోషించిన కారెక్టర్‌కు చాలా తేడా ఉంటుంది.

**బాలయ్యతో వర్క్ ఎక్స్‌పీరియెన్స్ గురించి చెప్పండి?..**

బాలయ్య గురించి బయట చాలా వింటుంటాం. కానీ సెట్‌లో ఆయన ఎనర్జీ వేరేలా ఉంటుంది. ఆయన ఉంటే సెట్‌లో పాజిటివ్ వైబ్స్ కనిపిస్తాయి.

**తమన్ సంగీతం, నేపథ్య సంగీతం గురించి చెప్పండి?..**

తమన్ మామూలుగా కొడితేనే బాక్సులు బద్దలు అవుతుంటాయి. ఇక బాలయ్య తమన్ ఏ రేంజ్‌లో కొడతారో చెప్పాల్సిన పని లేదు .

# 'సహాకుటుంబానాం'చిత్రం ట్రైలర్ లాంచ్



హెచ్ ఎన్ జి సినిమాస్ ఎల్ ఎల్ పి బ్యానర్ పై ఉదయ్ శర్మ రచన దర్శకత్వంలో మహదేవ్ గౌడ్, నాగరత్న నిర్మాతలుగా డిసెంబర్ 12వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సఃకుటుంబానాం. రామ్ చరణ్, మేఘ ఆకాష్ జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో నటకిరీటి రాజేంద్రప్రసాద్, హాస్యబ్రహ్మ బ్రహ్మానందం, శుభలేఖ సుధాకర్, సత్య, రాజశ్రీ నాయర్, రచ్చ రవి, గిరిధర్, తాగుబోతు రమేష్, భద్రం తదితరులు కీలక పాత్రలో పోషిస్తున్నారు. మణిశర్మ ఈ సినిమాకు సంగీతాన్ని అందించగా మధు దాసరి డిఓపిగా పనిచేశారు. ఎడిటర్‌గా శశాంక్ మలి చేశారు. విడుదల తేదీ దగ్గరవుతున్న సందర్భంగా ప్రముఖ దర్శకుడు బుచ్చిబాబు సనా చేతుల మీదగా సఃకుటుంబానాం చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా బుచ్చిబాబు సనా మాట్లాడుతూ,అందరికీ నమస్కారం. బ్రహ్మానందం రాజేంద్ర ప్రసాద్ నటించిన నాన్నకు ప్రేమతో, ఆర్య2 చిత్రాలకు నేను అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశాను. ఇప్పుడు పక్కన నిలబడి డైరెక్టర్‌గా మాట్లాడడం ఒక అదృష్టంగా భావిస్తున్నాను. నటకిరీటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ,సభా సరస్వతికి, నా తెలుగు ప్రేక్షకులకు ధన్యదాలు. బ్రహ్మానందం మరొకసారి కలిసిన నటించడం, మధు పనిచేసిన వారంతా ఉన్నత స్థాయిలకు అడగడం, వారిని ఈ స్టేజిపై చూడటం నాకు ఎంతో సంతోషం ఇచ్చింది. హాస్యబ్రహ్మ బ్రహ్మానందం మాట్లాడుతూ. ఈ సినిమాకు దర్శకుడు ఉదయ్ శర్మ తనకు కావలసిన ఔట్పుట్ వచ్చేవరకు కచ్చితంగా చూసుకుని అద్భుతమైన దర్శకుడు. అతడి వెనుక అర్జున్ సాయి ఉన్నాడు. అతను ప్రతి విషయంలను అండగా ఉండి నడిపిస్తుంటాడు. అన్నారు.ఈ సినిమాలో అందరూ సపోర్ట్ చేసి మంచి విజయాన్ని అందించవలసిందిగా కోరుకుంటున్నాను" అన్నారు.

# పాన్ ఇండియా ఎంటర్‌టైనర్ దుల్కర్ సల్మాన్‌ఖాన్ ఫస్ట్‌లుక్



కాంతతోబ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్న దుల్కర్ సల్మాన్ పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్ టైనర్." మూవీతో అలరించబోతు న్నారు. వేఫెరర్ ఫిలిమ్స్ సమర్పణలోనహాస్ హిధాయత్ దర్శకత్వం లో దుల్కర్ సల్మాన్,జోమ్‌వర్గీస్ నిర్మిస్తున్న ఈచిత్రం ఫస్ట్‌లుక్ నిమేకర్స్ రిలీజ్ చేశారు. ఫస్ట్‌లుక్‌పోస్టర్ నైట్ క్లబ్, క్యాసినో బ్యాక్ డ్రాప్ లో స్టైలిష్‌షూట్‌వేసుకున్న దుల్కర్ రక్తంతడిసిన చేతితో గన్ పట్టుకునిఇంటెన్స్ లుక్‌లో కనిపించడం అదిరి పోయింది. ఈలుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈచిత్రంలోమిస్కిన్, ఆంటోనీ వర్గీస్, సంయుక్త విశ్వనాథన్ కీలక పాత్రలు పోహిస్తున్నారు. ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ మ్యూజిక్ అందిస్తున్నారు. అన్బరీవ్ యాక్షన్ కొరియోగ్రాఫర్ గా పని చేస్తున్నారు.ఈ చిత్రం తెలుగు, మలయాళం, తమిళ, కన్నడ హిందీ భాషల్లో విడుదల కానుంది .

# 'ఆర్ ఎక్స్ ప్లోర్' మూవీస్ బ్యానర్ లాంచ్

ఈవెంట్, "ఆర్ ఎక్స్ ప్లోర్ మూవీస్" బ్యానర్ పై బ్యాక్‌టుబ్యాక్ మూవీస్‌చేసేందుకు సిద్ధమవుతున్న ప్రొడ్యూసర్ అతీకూర్ రెహమాన్..టాలీవుడ్ లోకి మరో చిత్ర నిర్మాణ సంస్థ రాబోతోంది. "ఆర్ ఎక్స్ ప్లోర్‌మూవీస్" పేరుతో నిర్మాత అతీకూర్ రెహమాన్ ఈ సంస్థను ప్రారంభించారు. ఈ బ్యానర్ పై బ్యాక్ టు బ్యాక్ మూవీస్ నిర్మించేందుకు సిద్ధమవుతున్నట్లు నిర్మాత అతీకూర్ రెహమాన్ తెలిపారు. సమాజానికి ఉపయోగపడే,సామాజికరుగ్మతలు,నేరాలపై యువతకు అవగాహన కల్పించేలా సినిమాలు నిర్మిస్తామనిఆయన అన్నారు. ఈ రోజు హైదరాబాద్ ఫిలింఛాంబర్‌లో"ఆర్‌ఎక్స్ ప్లోర్‌మూవీస్" బ్యానర్ లాంఛ్‌ఈవెంట్‌ఘనంగాజరిగింది. ఈ కార్యక్రమంలో మహతి మాట్లాడుతూ "ఆర్ ఎక్స్ ప్లోర్ మూవీస్" బ్యానర్‌లాంఛ్ చేస్తున్న సందర్భంగా నిర్మాత అతీకూర్‌రెహమాన్‌కినా అభినందనలు తెలియ జేస్తున్నా. నిర్మాతఅతీకూర్‌రెహమాన్ మాట్లాడుతూ, ఈ రోజుమా"ఆర్‌ఎక్స్ ప్లోర్‌మూవీస్" బ్యానర్‌లాంఛ్ ఈవెంట్‌కు హాజరైనదర్శకులు, సినిమాటో గ్రాఫర్, మా సపోర్టర్స్ అందరికీ థ్యాంక్స్.




# ఆడియన్స్‌ను ఆకట్టుకునేలా ఉంటుంది



**సందీప్ సందీప్ రాజ్**

రాజ్..జాతీయ అవార్డు గ్రహీత సందీప్ రాజ్ దర్శకత్వంలో రోషన్ కనకాల నటిస్తున్న చిత్రం మోగ్లీ'. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ మీద ఈ మూవీని టీజీ విశ్వ ప్రసాద్,కృతి ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తు న్నారు. ఈ సినిమా డిసెంబర్ 12న రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో చిత్ర దర్శకుడు సందీప్ రాజ్ మీడియాతో ముచ్చటించారు. సినిమా గురించి ఆయన చెప్పిన విశేషాలివే..

**ప్రస్తుతం మీరు నటుడిగా ఎక్కువ కనిపిస్తున్నారు? మీకు డైరెక్షన్, యాక్టింగ్‌లో ఏదంటే ఎక్కువ ఇంట్రెస్ట్?..**

నాకు ముందుగా నటన అంటేనే ఇష్టం. చాయ్ బిస్కెట్..లో ఉన్నప్పుడు కథలు కూడా రాసేవాడ్ని. అలా అతిథ్థి అనే షార్ట్ ఫిల్మ్ చేశాను. ఆ తరువాత దర్శకుడిగా నాకు అవకాశాలు స్టార్ట్ అయ్యాయి. అడ్వాన్స్‌లు కూడా ఇచ్చేందుకు రెడీ అయ్యారు. ఆ తరువాత మెల్లిమెల్లిగా కథలు రాయడం, డైరెక్షన్ మీద ఫోకస్ పెట్టాను.కానీ నాలోని యాక్టింగ్ కోరికల్ని ఇప్పుడిప్పుడే తీర్చుకుంటు న్నాను.

**ఐదేళ్ల తరువాత దర్శకుడిగా వస్తున్నారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?..**

మోగ్లీ ప్రస్తుత ట్రెండ్‌కి తగ్గట్టుగా ఉంటుంది. ఈ కథలో నేను మాత్రం నటించలేదు. ఐదేళ్ల గ్యాప్ తరువాత దర్శకుడిగా సినిమా చేస్తున్నాను. అందుకే ఒళ్లు దగ్గర పెట్టుకుని మరింత జాగ్రత్తగా చేశాను.

**'మోగ్లీ"కి ఆడియెన్స్ ఏం ఆశించి థియేటర్‌కు రావాలి? ఈ చిత్రం ఎవరిని టార్గెట్ చేస్తుంది?..**

మోగ్లీ అన్ని వర్గాల ఆడియెన్స్‌ను ఆకట్టుకునేలా ఉంటుంది. యూత్, ఫ్యామిలీ, మాస్ అని ఇలా వేర్వేరుగా కాకుండా అందరినీ మెప్పిస్తుంది.

**నటుడిగా, దర్శకుడిగా మీ అప్ కమింగ్ ప్రాజెక్టుల గురించి చెప్పండి?..**

ప్రస్తుతం నటుడిగా రెండు ప్రాజెక్ట్‌లు చేస్తున్నాను. డిసెంబర్ 20 నుంచి నటుడిగా బిజీ అవుతాను.



## సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్
# ఛాంపియన్‌గా ట్రీసా-గాయత్రి జోడీ

**న్యూఢిల్లీ:** సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ 2025లో ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ జంట మహిళల ఛాంపియన్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ సూపర్ 300లో డిఫెండింగ్ ఛాంపియన్స్ ట్రీసా మరియు గాయత్రి ద్వయం జపాన్‌కు చెందిన కహో ఒసావా-మై తనబేపై మూడు గేమ్‌ల పోరాట విజయాన్ని నమోదు చేసి మహిళల డబుల్స్ టైటిల్‌ను సాధించింది. టాప్ సీడ్ భారత ద్వయం ఒక ఆట వెనుకబడిన తర్వాత కూడా దాడి చేసే నైపుణ్యాన్ని ప్రదర్శించి, ప్రపంచ 35వ ర్యాంకర్ జపాన్ జంటను 17-21, 21-13, 21-15 తేడాతో ఒక గంటా 16 నిమిషాల పాటు జరిగిన ఫైనల్లో ఓడించింది. ఫైనల్ ఉత్కంఠభరితమైన 49 షాట్ల ర్యాలీతో ప్రారంభమైంది. రెండు జంటలు హోరాహోరీగా పోరాడడంతో ఒసావా-తనబే 6-3తో ఆధిక్యంలో నిలిచారు. ట్రీసా చేసిన రెండు పదునైన స్మాష్‌లు భారత జట్టును సమం చేశాయి. ఇదే సమయంలో ఒసావా ఫోర్ హ్యాండ్ పొరపాటు వారిని 8-6కి తీసుకెళ్లింది. అయితే, జపాన్ జట్టు తిరిగి జట్టులోకి చేరి విరామంలో స్వల్ప ఆధిక్యాన్ని సాధించి, తమ పట్టును 18-15కి పెంచుకుంది. భారత తప్పిదం జపనీస్ జట్టుకు ఐదు గేమ్ పాయింట్లను అందించింది. కొన్ని షాట్లు నెట్‌లోకి వెళ్ళినప్పటికీ, బ్యాక్‌కోర్ట్ నుండి ట్రీసా కొట్టిన మరో అద్భుతమైన స్మాష్ ద్వారా వారు బ్రేక్ సమయానికి 11-5 ఆధిక్యాన్ని కలిగి ఉన్నారు.ట్రీసా-గాయత్రి 17-9కి మార్చింగ్ చేశారు. ట్రీసా చేసిన గోల్‌తో 20-11కి తీసుకెళ్లాయి.




# యూత్ వరల్డ్‌లో దివ్యాంశికి కాంస్యం

**న్యూఢిల్లీ:** ఐటీటీఎఫ్ యూత్ వరల్డ్స్‌లో దివ్యాంశి భౌమిక్ అండర్ 15 సింగిల్స్‌లో కాంస్య పతకం గెలుచుకుంది. 14 ఏళ్ల ఆమె క్లూజ్ నపోకాలో సెమీఫైనల్‌కు చేరుకుంది, ఆమె మునుపటి జట్టు పతకానికి చారిత్రాత్మక సింగిల్స్ కాంస్య పతకాన్ని జోడించింది. క్లజ్ నపోకాలో ఆదివారం జరిగిన యూత్ వరల్డ్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో బాలికల సింగిల్స్‌లో ఈ పతకాన్ని దక్కించుకుంది. 32వ రౌండ్‌లో దివ్యాంశి ఐర్లాండ్‌కు చెందిన జాడే మోరిస్‌ను ఓడించి బలంగా ప్రారంభించింది. 16వ రౌండ్‌లో, ఆమె దక్షిణ కొరియాకు చెందిన కిమ్ మిన్సియోను 4-2తో ఓడించింది. జపాన్‌కు చెందిన కోకోమి ఇషిడాపై ఆమె క్వార్టర్ ఫైనల్ విజయం ఆమె ప్రచారంలో అత్యుత్తమ ఫలితం. దివ్యన్షి 4-2 (11-9, 13-11, 10-12, 11-9, 11-7)తో విజయం సాధించింది. ఆమె పరుగు సెమీఫైనల్లో చైనాకు చెందిన జు కిహుయ్ చేతిలో 1-4 తేడాతో (11-4, 12-10, 10-12, 11-6, 11-8) ఓడిపోవడంతో ముగిసింది. టోర్నమెంట్‌లో అంతకుముందు అండర్ 15 బాలికల జట్టు కాంస్య పతకం సాధించిన తర్వాత, 14 ఏళ్ల ఆమె ఈ పోటీలో తన రెండవ పతకాన్ని కూడా సాధించింది. దీంతో దివ్యాంశి యూత్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లలో సింగిల్స్ పతకం గెలుచుకున్న మూడవ భారతీయురాలిగా నిలిచింది, పయాస్ జైన్ (2021) మరియు సుహానా సైని (2021) తర్వాత నిలిచింది.

## హాకీ ప్రపంచ కప్‌లో
# భారత్ రెండో విజయం

**న్యూఢిల్లీ:** పురుషుల జూనియర్ హాకీ ప్రపంచ కప్-2025లో ఒమన్ పై భారత్ అద్భుతమైన ప్రదర్శనతో రెండో విజయం నమోదు చేసింది. దీంతో రెండో మ్యాచ్‌లోనూ క్లీన్ షీట్‌ను భారత్ నిలబెట్టుకుంది. ఒమన్‌తో జరిగిన పూల్ బి మ్యాచ్‌లో భారత జట్టు 17-0 తేడాతో ఈ విజయం సాధించింది. గత మ్యాచ్‌లో భారత్ చిలీని 7-0 తేడాతో ఓడించింది. ఈరోజు హాకీలో మన్మీత్ సింగ్ (17వ నిముషం, 26, 36), అర్ష్‌దీప్ సింగ్ (4, 33, 40), దిల్‌రాజ్ సింగ్ (29, 32, 58) హ్యాట్రిక్ గోల్స్ సాధించగా, అన్మోల్ ఎక్కా (29), అజీత్ యాదవ్ (34, 47), గుర్జోత్ సింగ్ (39, 45) ఇంగలెంబా తౌనౌజమ్ లువాంగ్ (43, 50), సర్దా నంద్ తివారీ (55) కూడా భారత స్కోరుకు దోహదపడ్డారు. ఈ విజయంతో, భారత్ పాయింట్ల పట్టికలో స్విట్జర్లాండ్ కంటే 24 గోల్స్ ఆధిక్యంలోఅగ్రస్థానంలో ఉంది. 4వ నిమిషం ప్రారంభంలో గోల్ చేయడానికి అనుమతించిన ప్పటికీ ఒమన్ రక్షణలో బాగా రాణించింది. అర్ష్‌దీప్ సింగ్ అద్భుతమైన ఫీల్డ్ గోల్‌తో భారత్ స్కోరు కార్డును తెరిచినా తర్వాతి నిమిషాలు అనుకున్నట్లుగా సాగలేదు. ఒమన్ అడ్డుకునే యత్నం చేసింది. అయితే రెండవ క్వార్టర్ ప్రారంభమైన మూడు నిమిషాల్లోనే మన్మీత్ సింగ్ ద్వారా భారత్‌కు 2వగోల్ వచ్చింది. ఈ క్వార్టర్‌లో 3గోల్స్ నమోదయ్యాయి, ఇదిభారత్ అత్యధిక స్కోరింగ్ నందించింది. మన్మీత్ (26) మళ్ళీ గోల్‌చేయగా, అన్మోల్, దిల్రాజ్ (29) గోల్ చేయడంతో భారత్ తొలి అర్ధభాగం ముగిసే సమయానికి 5-0తో అద్భుతమైన ఆధిక్యంలోకి వెళ్లింది. మూడో క్వార్టర్‌లో 5 నిమిషాల వ్యవధిలో మరో 4 గోల్స్ సాధించారు, మన్మీత్ తన అర్హత కలిగిన హ్యాట్రిక్‌ను పూర్తి చేశాడు. దిల్‌రాజ్, అర్ష్‌దీప్‌లు చెరో 2 గోల్స్‌తో తమ గోల్ ఫెస్ట్‌ను కొనసాగించారు. ఈ క్వార్టర్‌లో మరో 3 గోల్స్ రావడంతో ఒమన్ తీవ్ర ఒత్తిడికి గురైంది. 12-0 ఆధిక్యంతో, చివరి క్వార్టర్ కేవలం లాంఛనప్రాయంగానే మిగిలిపోయింది. ఈ క్వార్టర్‌లో భారత్ మరో 5 గోల్స్ చేసింది.





# ఆర్‌సిబి, ఆర్‌ఆర్ ఫర్ సేల్
## ఐపిఎల్‌కు ముందు ఫ్రాంచైజీల నిర్ణయం

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2026 కొత్త సంవత్సరంలో ప్రారంభం కానుంది. దీనికి సంబంధించి డిసెంబర్ 16న మినీ వేలం జరగనుంది. దానికి ముందు ఫ్రాంచైజీల యాజమాన్యాలలో కొన్ని మార్పులు జరిగే అవకాశం ఉందని సమాచారం. ఇందులో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సిబి) ఇప్పటికే అధికారికంగా అమ్మకానికి ఉంచబడింది. అయితే ఒక్క ఆర్సీబీ మాత్రమేకాదు, మరో ఫ్రాంచైజీ కూడా మార్కెట్లో అమ్మకానికి సిద్ధం అవుతోంది. 2008లో ఐపీఎల్ ప్రారంభ ఎడిషన్ ఛాంపియన్‌లైన రాజస్థాన్ రాయల్స్‌తో పాటు, ప్రస్తుతం రాజస్థాన్ రాయల్స్ (ఆర్‌ఆర్) కూడా అమ్మకానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. పూణే, అహ్మదాబాద్, ముంబై, బెంగళూరు లేదా యుఎస్‌ఎ కి చెందిన వారు వీటిని కొనుగోలు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాజస్తాన్ రాయల్స్‌లోని 65శాతం వాటా ఉన్న రాయల్స్ స్పోర్ట్స్ గ్రూప్ (ఎమర్జింగ్ మీడియా స్పోర్టింగ్ హోల్డింగ్స్ లిమిటెడ్) యాజమాన్యంలో ఉందని నివేదికలు చెబుతున్నాయి. ఇందులో లాచ్లాన్ ముర్డోక్, రెడ్‌బర్డ్ క్యాపిటల్ పార్టనర్స్ కీలకమైన మైనారిటీ వాటాదారులు ఆర్‌సిబినిఇ అమ్మకానికి పెట్టే ప్రక్రియను ప్రారంభించినట్లు నవంబర్ 5న డియాజియో ధృవీకరించింది. జెరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్, మణిపాల్ ఎడ్యుకేషన్ అండ్ మెడికల్ గ్రూప్ అధిపతి రంజన్ పాయ్ ఆర్‌సిబిని కొనుగోలు చేయాలనుకుంటున్న వారిలో ఉన్నారు. ఈ ఇద్దరు వ్యాపారవేత్తలు కర్ణాటకకు చెందిన వారు. బెంగళూరులో స్థిరపడ్డారు. ఇద్దరూ ఆర్థికంగా బలవంతులు. ఒక బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువైన జట్టును కొనుగోలు చేసే సామర్థ్యం వారికుంది. సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సిఇఒ అదార్ పూనావాలాతో కలిసి కామత్, పాయ్ సంయుక్తంగా బిడ్‌లో పాల్గొనున్నారు. కామత్ నికర విలువ 2.5 బిలియన్ డాలర్లు. పాయ్ నికర విలువ 2.8 బిలియన్ డాలర్లుగా అంచనా వేయబడింది.

# ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ డ్రాకు కలియాండ అర్హత

**న్యూఢిల్లీ:** ఆసియా పసిఫిక్ వైల్డ్‌కార్డ్ ప్లే ఆఫ్‌ను గెలుచుకున్న తర్వాత నికి కలియాండ పూనాచ 2026 ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల డబుల్స్ మెయిన్ డ్రాలో స్థానం సంపాదించాడు. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న రెండవ సీడ్ నికి కలియాండ థాయిలాండ్‌కు చెందిన ప్రుచ్యా ఇసారోతో జతకట్టి తమ మొదటి మ్యాచ్‌లో టియాంజి కియాన్-బోవెన్ వుపై గెలిచింది. తదుపరి సెమీఫైనల్లో పాక్ లాంగ్ యెంగ్-చీహ్ చి హువాంగ్‌లను ఓడించింది. ఫైనల్లో, వారు జపాన్‌కు చెందిన సెయితా కుసుహారా-కట్సుకి నకగావాపై 6-4, 6-3 తేడాతో ఘన విజయం సాధించి ఆస్ట్రేలియన్ ఓపెన్ వైల్డ్‌కార్డ్‌ను పొందారు. దీంతో తొలిసారి గ్రాండ్‌స్లామ్ మెయిన్ డ్రాలో అడుగుపెట్టాడు. ఈ అర్హత పూనాచా యొక్క మొదటి గ్రాండ్ స్లామ్ మెయిన్‌డ్రా ప్రదర్శనను సూచిస్తుంది. 30 ఏళ్ల అతను తన కెరీర్‌లో ఎక్కువ భాగం ఎటిపి ఛాలెంజర్ మరియు ఐటిఎఫ్ సర్క్యూట్‌లలో పోటీ పడ్డాడు. అక్కడ అతను కెరీర్‌లో అత్యధిక డబుల్స్ ర్యాంకింగ్‌ను ప్రపంచ నంబర్ 98కి చేరుకుని ఆరు ఛాలెంజర్ టైటిళ్లను గెలుచుకున్నాడు. ఆస్ట్రేలియాలో అవకాశం ఇప్పుడు అతన్ని ఎలైట్ అంతర్జాతీయ డబుల్స్ జట్లతో పాటు ఉంచుతుంది. మరోపక్క సింగిల్స్ ప్లేఆఫ్‌లో భారతదేశానికి చెందిన సుమిత్ నాగల్ 16 మంది ఆటగాళ్ల డ్రాలో క్వార్టర్ ఫైనల్స్‌లో నిష్క్రమించాడు.

# 22రోజులే సెన్సెక్స్, నిఫ్టీల ట్రేడింగ్!

**న్యూఢిల్లీ, నవంబరు 30:** స్టాక్ మార్కెట్లకు డిసెంబరునెలలో అతితక్కువ రోజులు మాత్రమే ట్రేడింగ్ రోజులు కనిపిస్తున్నాయి. ఆది,శనివారాలే ఈనెలలో 8 రోజులవరకూ ఉన్నాయి. అలాగే ఈ ఏడాది చివరిగా క్రిస్మస్ సందర్భంగా చివరి సెలవుదినం కావడంతో స్టాక్ మార్కెట్లు బిఎస్ఇ,ఎన్ఎస్ఇలు మూతపడతాయి. నిజానికి ఏడాదిలో చివరి మాసంలోనే ట్రేడింగ్ అత్యంత చురుకుగా కొనసాగుతుంది. మొత్తంగాచూస్తే స్టాక్ మార్కెట్లు ఈనెలలో తొమ్మిదిరోజులపాటు మూతపడతాయి. దీనివల్లక ఏవలం 22 ట్రేడింగ్ సెషన్లు మాత్రమే ఇన్వెస్టర్లకు ఉంటాయి. మొత్తంగాచూస్తే ఎక్స్ఛేంజిలు 2025లో 14 ట్రేడింగ్ సెలవులు కూడా నమోదుచేసుకున్నాయి. వీటిలోక్రిస్మస్ చిట్టచివరి సెలవు దినం.ఇక కొత్త వారంలో మార్కెట్లు స్థిరంగా ఉంటాయని నిపుణుల అంచనా.




వాణిజ్య సంప్రదింపులు ముమ్మరం కావడం కూడా ఇందుకు దోహదంచేస్తుంది. భారత్ అమెరికా వాణిజ్య సంప్రదింపులు, రెండోత్రైమాసిక జిడిపి గణాంకాలు, ఐఐపి డేటాలు కూడా ఉంటాయి. స్థూల ఆర్థిక గణాంకాలు ఇందుకు దోహదం చేస్తాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్‌సూచీలు కూడా కొంత మేర సానుకూలంగా ఉంటాయని నిపుణుల అంచనా. గతవారం ఫార్మా,మీడియా, ఆటో రంగాలు లాభాల్లో కొనసాగాయి. ఇంధనం, ఆయిల్ అండ్ గ్యాస్, టెలికాం రంగాలు స్వల్పంగా క్షీణించాయి. ఈ సారి ఇండో అమెరికా వాణిజ్య చర్చలతోపాటు, ఫెడ్ రిజర్వు గణాంకాలు, అమెరికా ఉపాధి గణాంకాలు కూడా కీలకం అవుతాయి. అలాగే భారత్ రెండోత్రైమాసిక వృద్ధిరేట్లు, వివిధ రేటింగ్ సంస్థలఅంచనాలు కూడా మార్కెట్ల తీరుకు దిక్సూచిగా నిలుస్తాయి.

# పసిడినిల్వల్లో అమెరికా టాప్!

**ముంబయి, నవంబరు 30:** ప్రపంచవ్యాప్తంగా బంగారం రేట్లు ఎవరూ ఊహించని విధంగా ఆకాశా న్నంటుతున్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక పరిణామాలు, ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయా లతో గోల్డ్ రేటుకు బ్రేకులు పడటం లేదు. దాదాపు తులం బంగారం లక్షన్నరకు చేరుకోగా రానున్న కొద్ది నెలల్లో రూ.2 లక్షలకు కూడా ఎగబాకే అవకాశముం దని బులియన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల వల్ల గోల్డ్‌పై పెట్టుబడి పెట్టేందుకు పెట్టుబడిదారులు ఆసక్తి చూపిస్తున్నారు. గోల్డ్ రేట్ భారీగా పెరగడానికి ఇదొక కారణంగా తెలుస్తోంది. అన్ని దేశాలు కూడా ద్రవ్యోల్బణం, కరెన్సీని రక్షించుకోవడానికి తమ వద్ద గోల్డ్ నిల్వలను పెంచుకుంటున్నాయి. ప్రపంచ గోల్డ్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన నివేదిక దీనిక బలం చేకూర్చుతోంది. తొలి స్థానం అమెరికాదే



ప్రపంచవ్యాప్తంగా గోల్డ్ నిల్వల్లో అమెరికా తొలి స్థానంలో ఉంది. 2000వ సంవత్సరం నుంచి ఆ దేశంలో గోల్డ్‌నిల్వలు స్థిరంగా ఉన్నాయి. ప్రస్తుతం 8,134 టన్నులు ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇక జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్ తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి. అమెరికా తర్వాత జర్మనీ దగ్గర ఎక్కువ బంగారు నిల్వలు ఉన్నాయి. దాదాపు ఆ దేశం దగ్గర 3,350.25 టన్నుల నిల్వలు ఉన్నాయి. ఇక ఇటలీ దగ్గర కొన్ని దశాబ్దా లుగా నిల్వలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం 2,451.84 టన్నులుగా ఉంది. ఇక తర్వాతి స్థానంలో ఫ్రాన్స్ ఉంది. ఫ్రాన్స్ దగ్గర ప్రస్తుతం 2,437 టన్నుల నిల్వ ఉంది. ఇక రష్యా దగ్గర 2,329.63 టన్నులు, చైనా దగ్గర 2,279.6 టన్నులు, స్విట్జర్లాండ్ దగ్గర 1,040 టన్నులు నిల్వల ఉన్నాయి.ఇక భారత్‌పరంగాచూస్తే ప్రస్తుతం 800 టన్నుల గోల్డ్ నిల్వ ఉంది. గత త్రైమాసికం కంటే నిల్వలు పెరిగాయి.

# దాల్మియా సిమెంట్స్‌కు జిఎస్టీ రూ.266.3 కోట్ల నోటీసులు!




**న్యూఢిల్లీ, నవంబరు 30:** తమిళనాడు సేల్స్‌ట్యాక్స్ అధికారులు దాల్మియా భారత్ సిమెంట్‌కంపెనీకి రూ.266.3 కోట్ల విలువైన పన్నునోటీసులు జారీచేసారు. కేంద్ర జిఎస్‌టి, తమిళనాడు జిఎస్టీ చట్టం 2017 ప్రకారం 2019-20, 2022-23 సంవత్సరాలకు సంబంధించి లోపాలున్నట్లు గుర్తించామని, మీపై ఎందుకు చర్యలు తీసుకోరాదో స్పష్టం చేయాలంటూ తమిళనాడు తిరుచిరాపల్లి ప్రాంతంలోని లాల్‌గుడి సేల్స్‌ట్యాక్స్ అధికారి సంజాయిషీ నోటీసులు జారీచేసారు. 2019-20 ఆర్థిక సంవత్సరానికిగాను పన్ను అధికారులు 128.39 కోట్ల పన్ను విధించారు.
వీటితపాటు జరిమానా కూడా రూ.19.25కోట్లవరకూ చెల్లించాల్సి ఉంటుందని నోటీసుల్లో పేర్కొన్నారు. నోటీజులు జారీ అంశాన్ని కంపెనీ స్టాక్ ఎక్ఛేంజిలకు కూడా తెలియజేసింది. ఇక 2022-23 సంవత్సరానికిగాను రూ.59.32 కోట్లు అంతేమొత్తం జరిమానా చెల్లించాల్సి ఉందని నోటీసులు ఇచ్చింది. పన్నుపరిధిలోని టర్నోవర్‌లో కొన్ని తేడాలు గుర్తించామని, 2019-20, 2022-23 ఇన్‌పుట్ ట్యాక్స్ సబ్సిడీలో కూడా కొన్ని అవకతవకలు గుర్తించినట్లు నోటీసులో వివరించింది. ఈనెల 28వ తేదీ ఈ నోటీసులు జారీచేసామని, అయితే ఈ చర్యలు దాల్మియా సిమెంట్స్ భారత్ లిమిటెడ్‌పై ఎలాంటి ప్రభావం ఉండదని వివరించింది. భారత్‌లో నాలుగో అతిపెద్ద సిమెంట్ ఉత్పత్తి సంస్థలు అయిన దాల్మియాలో సాలీనా 49.5 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తి అవుతున్నది. అలాగే తమ కంపెనీపై ఈనోటీసులవల్ల ఎలాంటి ఆర్థిక భారం కూడా ఉండదని తెలిపింది.

## టాప్ పదిలో ఏడు కంపెనీల మార్కెట్‌క్యాప్
# రూ.96వేల కోట్లు వృద్ధి

**ముంబై, నవంబరు 30:** భారతదేశంలోని టాప్ 10 కంపెనీలలో ఏడుకంపెనీల మార్కెట్ మూల ధనం విలువలు 96,200.95 కోట్లు పెగాయి. దీనికి భారత స్టాక్ మార్కెట్లలో బలమైన పనితీరు కారణమైంది. బజాజ్‌ఫైనాన్స్, హెచ్‌డి ఎఫ్‌సి బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, హిందూస్తాన్ యూనిలీవర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరియు ఇన్ఫోసిస్ మార్కెట్ క్యాప్‌లో లాభాలు చవిచూశాయి. అదే సమయంలో, భారతి ఎయిర్‌టెల్, ఎల్ఐసి,మరియు టిసిఎస్ క్షీణించాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ క్యాప్ రూ. 28,282.86 కోట్లు పెరిగి రూ.21,20,335.47 కోట్లకు చేరుకుంది. బజాజ్ ఫైనాన్స్ మార్కెట్ క్యాపిటలైజేషన్ 20,347.52 కోట్లు పెరిగి 6,45,676.11 కోట్లకు చేరుకుంది.హెచ్‌డిఎఫ్‌సిబ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.13,611.11 కోట్లు పెరిగి రూ.15,48,743.67 కోట్లకు చేరుకుంది. ఐసిఐసిఐ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 13,599.52 కోట్లు పెరిగి రూ.9,92,725.97 కోట్లకు చేరుకుంది. హిందూస్తాన్ యూనిలీవర్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.7,671.41 కోట్లు పెరిగి రూ.5,79,644.16 కోట్లకు చేరుకుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.6,415.28 కోట్లు పెరిగి రూ.9,04,185.15 కోట్లకు చేరుకుంది.అదనంగా, ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.6,273.15 కోట్లు పెరిగి రూ.6,47,961.98 కోట్లకు చేరుకుంది.మరోవైపు, భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.35,239.01 కోట్లు, ఎల్ఐసిరూ.4,996.75 కోట్లు మరియు టిసిఎస్ రూ.3,762.81 కోట్లు తగ్గాయి. ఈనెల చివరి ట్రేడింగ్ వారంలో, నిఫ్టీ 0.52 శాతం లేదా 134.80 పాయింట్లు పెరిగి 26,202.95 వద్ద ముగిసింది, మరియు సెన్సెక్స్ 0.56 శాతం లేదా 474.75 పాయింట్లు పెరిగి 85,706.67 వద్ద ముగిసింది.ఈ కాలంలో, స్టాక్ మార్కెట్ విస్తృత ఆధారిత ర్యాలీని చూసింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 766.95 పాయింట్లు లేదా 1.27 శాతం తగ్గి 61,043.25 వద్ద ముగిసింది. అయితే, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 18 పాయింట్లు స్వల్పంగా తగ్గి 17,829.25 వద్ద ముగిసింది.







# కూపాంగ్‌లో 3.37 కోట్ల మంది సమాచారం చోరీ!

**న్యూఢిల్లీ, నవంబరు 30:** ఈకామర్స్ దిగ్గజం కూపాంగ్‌లో అతిపెద్ద డేటా చోరీజరిగింది. దాదాపు 3.37 కోట్ల మంది వినియోగదారుల వ్యక్తిగత సమాచారం చోరీకి గురైనట్లు కంపెనీ స్వయంగా ప్రకటించింది. ఈ సంఘటనతో కస్టమర్లలో తీవ్రఆందోళన, ఆగ్రహం వ్యక్తమవుతున్నాయి. కొన్ని నెలల పాటు ఈ డేటా చోరీ జరిగినట్లు తెలుస్తోంది. వినియోగదారుల పేర్లు, ఫోన్ నంబర్లు, ఈమెయిల్ ఐడీలు, డెలివరీ అడ్రస్‌లు లీక్ అయినట్లు కంపెనీ వెల్లడించింది. అయితే, పేమెంట్‌వివరాలు, క్రెడిట్ కార్డ్ నంబర్లు, లాగిన్ పాస్‌వర్డ్‌లు సురక్షితంగా ఉన్నాయని స్పష్టం చేసింది. జూన్ 24 నుంచే విదేశీ సర్వర్ల ద్వారా తమ కస్టమర్ల డెలివరీ సంబంధిత సమాచారాన్ని అనధికారికంగా యాక్సెస్ చేసినట్లు గుర్తించామని అని కూపాంగ్ తెలిపింది. ఈ కేసుపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ డేటా బ్రీచ్ వెనుక కంపెనీకి చెందిన ఒక మాజీ చైనా ఉద్యోగి హస్తం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. అతను ప్రస్తుతం కంపెనీలో పనిచేయడం లేదని, ఇప్పటికే దేశం విడిచి వెళ్లిపోయాడని కంపెనీ వర్గాలు తెలిపాయి. నవంబర్ 18న ఈ ఉల్లంఘనను గుర్తించిన కూపాంగ్, రెండు రోజుల్లో అధికారులకు సమాచారం ఇచ్చింది.

# ఆరువేల ఎయిర్‌బస్ విమానాలు రీకాల్!

**ప్యారిస్, నవంబరు 30:** ఫ్రెంచ్ దిగ్గజ విమాన తయారీ సంస్థ ఎయిర్ బస్ తమ తయారీలోని ఏ320 సిరీస్‌లోని 6వేల విమానాల్లో సాంకేతిక లోపాల కారణంగా రీకాల్ చేస్తున్నట్లు తెలిపింది. ప్రపంచ విమానయాన చరిత్రలోనే అతిపెద్ద రీకాల్ కావడం విశేషం. ఒకేసారి పెద్ద సంఖ్యలో విమానాలను గ్రౌండింగ్ చేయడం వల్ల విమానాల షెడ్యూల్‌కు అంతరాయం కలిగే అవకాశం ఉందని ఎయిర్‌లైన్స్ భావిస్తున్నాయి. దాంతో ప్రయాణికుల జేబులు, సమయంపై ప్రత్యక్ష ప్రభావం చూపనున్నది. ఓ విమానం మెక్సికోలోని కాన్‌కూన్ నుంచి నూజెర్సీలోని న్యూవార్క్‌కు ప్రయాణిస్తోంది. అకస్మాత్తుగా విమానం వేగంగా కిందకు దిగింది. తర్వాత విమానాన్ని ఫ్లోరిడాలోని టాంపాలో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. ఆ సమయంలో ఎయిర్‌బస్ ఎ320 విమానాల్లో సాంకేతిక సమస్యపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. మంచి పనితీరును కలిగిన ఉన్న ఎయిర్‌బస్ ఏ320 విమానాలు ప్రస్తుతం సాంకేతిక సమస్యల బారినపడ్డాయి. యూఎస్ ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ దర్యాప్తు చేపట్టింది.ఎ320 ఫ్యామిలీకి చెందిన విమానాల్లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ సమస్యను సృష్టించిందని గుర్తించారు. ఎక్కువ సోలార్ రేడియేషన్ ఎక్కువగా ఉన్న సమయంలో ఎలివేటర్ అండ్ ఎలిరాన్ కంప్యూటర్లలోకి వెళుతున్న డేటాలో తప్పుడు ఉన్నట్లు తేలింది. దాంతో తప్పుడు కమాండ్స్ విమానానికి వెళ్తున్నట్లుగా దర్యాప్తులో వెల్లడైంది. ఎయిర్‌బస్ ప్రస్తుతం 11,300 ఏ320 విమానాలను నడుపుతుంది. కంపెనీ సుమారు 6వేల ఏ320 ఫ్యామిలీకి చెందిన విమానాలను రీకాల్ చేసింది. సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్ స్వభావం ఎ320 విమాన వెర్షన్‌పై ఆధారపడి ఉంటుంది. కొత్త వెర్షన్‌లకు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ సరిపోతుంది. చాలా విమానాలకు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కొన్ని గంటలుపడుతుంది. కానీ, దాదాపు వెయ్యి విమానాలకు ప్రక్రియ వారాలు పడుతుందని తెలిపింది. ఈ వ్యవస్థ విమానాలను నియంత్రించడానికి ఉపయోగపడుతుంది. సమస్యను పరిష్కరించేందుకు కొత్తగా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌ను తీసుకువచ్చామని.. విమానయాన సంస్థలు వెంటనే తమ ఎ318, ఎ319, ఎ320, ఎ321 మోడల్ విమానాల్లో ఇన్‌స్టలేషన్ పూర్తిపూర్తి చేయాలని కంపెనీ సూచించింది. పలు భారతీయ విమానాయాన సంస్థల్లో 200 నుంచి 250 వరకు ఎ320 క్లాస్‌కు చెందిన ఎయిర్ బస్ విమానాలు ఉన్నాయి. భారత్‌లో ఇండిగో, ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఎ320 క్లాస్ మానాలు నడుపుతున్నాయి. దేశీయ విమానయాన సంస్థలు భారత్‌లో దాదాపు 560 విమానాలను ఉపయోగిస్తున్నాయి. మార్పులు చేయాల్సిన విమానాల్లో ఏ320 సీఈవో, నియో ఉన్నాయి. దీనిపై ఇండిగో స్పందించింది. 'ఎయిర్‌బస్ తన ఎ320 సిరీస్ విమానాలకు సంబంధించి జారీ చేసిన నోటిఫికేషన్ గురించి కంపెనీకి తెలుసు. మా విమానాల్లో ఎక్కువ భాగం ఇవే. ఈ విషయంలో ఇండిగో ఎయిర్‌బస్‌తో కలిసి పనిచేస్తోంది' అని పేర్కొంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.